# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

**జూన్ - 2017**

సంపుటి- 43 సంచిక : 06



## సంపాదక వర్గం

**ఎన్.కుమార్ రాజా**

ప్రధాన సంపాదకులు

**ఐ.వెంకటేశ్వరరావు**

**పి.బాబురెడ్డి**

**టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు**

**సిహెచ్.శ్రీహరి**


## ఈ సంచికలో...


| | |
|---|---|
| జాతీయం అంతర్జాతీయం | -04 |
| పిడిఎఫ్ ఎమ్మెల్సీల నిరాహారదీక్షలు | -05 |
| ప్రజలకు భారంకానున్న.... | -07 |
| డైరెక్టరేట్ కార్యాలయం ముట్టడి | -09 |
| ఆదర్శ వసతి గృహాల్లో... | -10 |
| చదవడం అంటే.. | -11 |
| రేషనలైజేషన్‌తో ప్రభుత్వ విద్య... | -12 |
| పదవ తరగతి పరీక్షా ఫలితాలు | -13 |
| ఉపాధ్యాయ బదిలీ నిబంధనలు | -15 |
| పుణ్యం (చిన్న కథ) | -18 |
| బదిలీల మార్గదర్శకాలు | -19 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | -21 |
| ప్రశ్నోత్తరాలు | -23 |
| పుస్తక సమీక్ష | -25 |
| ఉద్యమ వార్తలు | -26 |
| ప్రభుత్వఉత్తర్వులు | -42 |



| | | | |
|---|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ | 1250-00 |
| 5 సం॥ చందా | : | ₹ | 650-00 |
| సం॥ చందా | : | ₹ | 150-00 |
| విడిప్రతి | : | ₹ | 15-00 |

Union Bank Online
A/c No. 346402010025027
IFSC Code : UBINO534641



**ఐక్య ఉపాధ్యాయ**

యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2573763
Website: www.aputf.org
E-mail: ikyopadhyaya1975@gmail.com


# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి జరగాలి

**జూన్** 12 నుండి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలలు ప్రారంభించే వేళలో క్రమబద్ధీకరణ పేరిట పెద్ద సంఖ్యలో పాఠశాలలు మూత పడనున్నాయి. వేసవి సెలవుల్లోనే పాఠశాలల క్రమబద్ధీకరణ, ఉపాధ్యాయుల సర్దుబాటు, బదిలీలు పూర్తి చేస్తామన్న ప్రభుత్వ ప్రకటన ఆచరణలో విఫలమైంది.

విద్యాహక్కు చట్టం మేరకు బడిఈడు గల బాలబాలికలందరికీ నాణ్యమైన విద్య ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కాని మన రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరణ పేరుతో విడుదల చేసిన ఉత్తర్వులు వలన 10వేల పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉన్నది. 19లోపు విద్యార్థులున్న 6201 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారనున్నాయి. 1 కి.మీ. లోపు గల 19లోపు విద్యార్థులున్న పాఠశాలలు 3778 విలీనం ద్వారా మూతబడనున్నాయి. 40మంది లోపు విద్యార్థులున్న 2384 ప్రాథమికోన్నత పాఠశాలలు డిగ్రేడ్ కాబడి ప్రాథమిక పాఠశాలలుగా మారనున్నాయి.

పాఠశాలల్లో అవసరాలకు మించి ఉన్న అదనపు పోస్టులను సర్దుబాటు చేయవచ్చుగాని, కొన్ని పాఠశాలలు మూసివేసి, మరికొన్ని పాఠశాలలు డిగ్రేడ్ చేసి, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులపై పనిభారం పెంచి, ఉపాధ్యాయ పోస్టులను కృత్రిమంగా మిగులు చూపి సర్దుబాటు చేయడం సమర్థనీయం కాదు. మరి అవసరమైన పాఠశాలల్లో అదనపు పోస్టులు కల్పించకపోవడం శోచనీయం.

జాతీయ విద్యా విధానం ప్రకారం గాని, విద్యాహక్కు చట్టం ప్రకారం కాని ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలి. అంతే కాకుండా పాఠశాలల క్రమబద్ధీకరణ అనేది బడిలో చేరిన పిల్లల సంఖ్య ఆధారంగా కాకుండా ఆవాస ప్రాంతాలలో బడిఈడు గల పిల్లల సంఖ్య ఆధారంగా నిర్ణయించబడాలి. బడిఈడు గల పిల్లలుండి, వారు బడిలో చేరకపోతే ప్రభుత్వ బడిలో పిల్లలు చేరకపోవడానికి గల కారణాలు అన్వేషించాలి. వాటి ఆధారంగా సమస్యలు పరిష్కరిస్తే ప్రభుత్వ బడులు బతుకుతాయి.

విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించాలి. ప్రభుత్వ పాఠశాలల క్రమబద్ధీకరణకు అనుసరిస్తున్న విధానాలను గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలకూ వర్తింపు చేయాలి. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలి. పర్యవేక్షణా వ్యవస్థను పటిష్ట పరచాలి. ప్రభుత్వ ఆధీనంలోనే బడిఈడు గల పిల్లలకు ఉచిత విద్య అందించాలనే లక్ష్య దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. ప్రభుత్వ పాఠశాలల మూసివేతకాదు పాఠశాలల అభివృద్ధి జరగాలనే ఆశయంతో ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వం ముందుకు సాగాలని ఆశిద్దాం. ఉపాధ్యాయులుగా మనవంతు కర్తవ్యం నిర్వహించుదాం.

## నూతన విద్యా సంవత్సర శుభాకాంక్షలు

# జాతీయం అంతర్జాతీయం

### బడిలో ఇక వేడి భోజనం లేనట్లేనా?

ఇప్పటివరకూ ప్రభుత్వ పాఠశాలల్లో అక్కడే వండి వడ్డిస్తున్న వేడి వేడి భోజనం ఇటీవల ప్రభుత్వం విడుదలచేసిన మెమో చూస్తే ఇక లేనట్లుగా కనిపిస్తోంది. 20 కి.మీ.లోపు వున్న 20 నుండి 25 వేల విద్యార్థులకు ఇకపై కేంద్రీకృత వంటశాలల ద్వారా భోజనం ఏర్పాటు చేయనున్నారు. 2003లో ముఖ్యమంత్రిగా వున్న కాలంలో మధ్యాహ్నభోజన పథకం ప్రారంభ మైంది. ఇప్పుడు ఆయన హాయాంలోనే ఆ పథకం కార్పొరేట్‌ల చేతుల్లోకి వెళ్ళి 80వేల కార్మికులకు ఉపాధి కోల్పోయే స్థితి ఏర్పడింది. గత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇస్కాన్, నాంది, అక్షయ పాత్ర, బుద్ధవరపు ట్రస్ట్, హరేరామ హరేకృష్ణ వంటి ప్రైవేట్ సంస్థలకు ఈ పథకాన్ని అప్పగించి తూట్లు పొడిచింది. గ్రుడ్డులేకపోవడం, స్థానిక మెను లేకపోవడం, నాశిరకం గానూ, చల్లారిపోయి వుండడం చేత కేంద్రీయ వంటపై అనేక విమర్శలు వచ్చాయి. విద్యార్థులు తినలేక కడుపు మాడ్చుకొన్న సందర్భాలు అనేకం. అయినా ఇవేమీ పట్టనట్లు ఇప్పుడు దీన్నే రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయనున్నారు. జిల్లాకు నాలుగు కేంద్రీయ వంటశాలలు ఏర్పాటు చేస్తారట. ఈ పథకాన్ని ప్రైవేట్ సంస్థకు అప్పగించి 80వేల భోజన కార్మికుల పొట్టకొట్టవద్దని మధాహ్న భోజన పథక నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### వికీలీక్స్ అసాంజేకు ఊరట

అమెరికా పన్నిన కుట్రలో భాగంగా లైంగిక కేసును ఎదుర్కొంటూ లండన్ లోని ఈక్వెడార్ కార్యాలయంలో తల దాచుకొంటున్న వికీలీక్స్ వ్యవస్థాపకుడు అసాంజేకు ఊరట లభించింది. స్వీడన్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ డైరెక్టర్ అసాంజేపై కేసుకు సంబంధించి దర్యాప్తు, విచారణను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఆస్ట్రేలియాకు చెందిన అసాంజే వికీలీక్స్ ద్వారా దేశాలకు సంబంధించిన రహస్య పత్రాలను లీక్ చేయడం ద్వారా భారీ సంచలనాలకు తెరతీశారు. అమెరికా, బ్రిటన్, ఇండియా, పాకిస్తాన్ వంటి దేశాల్ని వికీలీక్స్ గడగడలాండించింది. ముఖ్యంగా అమెరికా సైనిక కుట్రల్ని, దౌత్యనీతిని వికీలీక్స్ బట్టబయలు చేసింది. అమెరికా వివిధ దేశాల్లో అంతర్యుద్ధాల్ని ఎలా సృష్టించింది, యుద్ధాలకు ఎలా పురికొల్పిందీ, తీవ్రవాదాన్ని ఎలా పెంచి పోషించింది వంటి పత్రాలను సైతం వికీలీక్స్ బట్టబయలు చేసింది. దీంతో అప్పట్లోనే అసాంజే అంతుచూస్తానని అమెరికా బాహాటంగానే ప్రకటించింది.

### సామ్రాజ్యవాద చక్రబంధంలో వెనుజులా

ప్రత్యామ్నాయ ప్రభుత్వాలకు చుక్కానిగా, పింక్‌టైడ్‌గా ముందు కొచ్చిన వెనుజులా, చావెజ్ మరణం (2013) తర్వాత సామ్రాజ్య వాద కుట్రలతో సంక్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొంటోంది. ప్రతిపక్షాన్ని, మీడియాని ఉపయోగించుకొని మదురో ప్రభుత్వాన్ని కూల్చేందుకు అమెరికా కొత్తతరహా యుద్ధం చేస్తోంది. సాంప్రదాయక విదేశీ సైనిక జోక్యం కాకుండా కార్పొరేట్ మీడియా ద్వారా ప్రజల్ని రెచ్చగొట్టి, సమీకరించి హింసాకాండ నడుపుతోంది. అందులో భాగంగా 56మంది చనిపోయారు, 800మంది గాయపడ్డారు. హ్యూగోచావెజ్ బాల్యంలో నివసించిన ఇల్లు తగులబెట్టారు. సింబాలిక్ వార్‌లో భాగంగా సోషల్ మీడియా ద్వారా వాస్తవ సంఘటనల చుట్టూ అబద్ధాలు గుచ్చి ప్రజల్ని రెచ్చగొట్టే ప్రచారం చేస్తున్నారు. గతంలో లిబియాలో గడాఫీ ప్రభుత్వాన్ని కూడా ఇదే తరహాలో కూల్చేశారు. అయిన మదురో ప్రభుత్వం ధైర్యంగా సామ్రాజ్యవాద చర్యల్ని ఎదుర్కొంటోంది. తాము వెనుజులాకు బాసటగా నిలుస్తామని కరేబియన్ దేశాలు ప్రకటించాయి.



### ఫ్రాన్స్ ఎన్నికలు - నూతన ప్రజాస్వామిక విప్లవమా?

ఇటీవలి ఎన్నికల్లో ఫ్రెంచి ప్రజలు సంప్రదాయ రాజకీయ పార్టీలను ప్రక్కకు నెట్టి మాక్రాన్‌కు పట్టం కట్టారు. అమెరికాలో ట్రంప్‌వలె జాతీయ వాది అయిన లీపెన్ అధికారంలోకి వస్తుందన్న ఊహాగానాలకు తెరదించారు. గ్లోబలైజేషన్‌కు, శరణార్థులకు వ్యతిరేకంగా ప్రజల్ని రెచ్చగొట్టిన లీపెన్‌ను నిర్ద్వందంగా ఫ్రెంచి ఓటర్లు ప్రక్కన పెట్టారు.

ఆర్థిక సంక్షోభం ప్రపంచాన్ని చుట్టుముట్టియున్న నేపథ్యంలో అనేక దేశాలలో ఊహించని రాజకీయ పరిణామాలు చోటు చేసు కొంటున్నాయి. పెరిగిపోతున్న నిరుద్యోగం, అసమానతలు రాజకీయ అస్థిరతను ఏర్పరస్తున్నాయి. ఇందులోనుంచి పెద్దపెద్ద రాజకీయ పార్టీలు వెనక్కు నెట్టబడి పాపులర్ వ్యక్తులు అధికారంలోకి వస్తున్నారు. టర్కీలో ఎర్డోగాన్, ఫిలిప్పైన్స్‌లో డ్యూటర్టే, ఈజిప్టులో ఎల్‌సిసి, ఢిల్లీలో కేజ్రీవాల్ ఇందుకు ఉదాహరణలు. పార్టీలు వున్నా అమెరికాలో ట్రంప్, ఇండియాలో నరేంద్రమోడీ, రష్యాలో పుతిన్ వ్యక్తిగత హవాతోటే అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పార్టీ వ్యవస్థ సంక్షోభంలోపడింది. దీనికి ప్రత్యామ్నాయంగా రాజకీయ పార్టీ కావడం లేదు. పాపులర్ వ్యక్తులే ప్రత్యామ్నాయం అవుతున్నారు. 1789లో ఫ్రెంచి విప్లవం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అందించడమే కాదు, ప్రపంచానికి ప్రతి ఫ్యాషన్‌ను అందించే ఫ్రాన్స్, ఈ ఎన్నికల ద్వారా నూతన ప్రజాస్వామ్య విప్లవానికి ద్వారాలు తెరిచిందా?

## రచయితలకు ఆహ్వానం

సృజనాత్మకత, అభ్యుదయ భావజాలం కల్గిన రచనలను ఐక్య ఉపాధ్యాయ పాఠకులకు అందించాలనే లక్ష్యంతో కథలు, వ్యాసాలు, కవితలు పంపవలసిందిగా రచయితలను ఆహ్వానిస్తున్నాము. సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించే ఏ అంశానైనా వస్తువుగా తీసుకుని రచనలు పంపండి. అనుకరణ, అనువాదం కాకుండా స్వీయ రచన అయి ఉండాలి. హామీ పత్రం జతపరచండి. ప్రచుర నార్హమైన రచనలను సమయాను కూలంగా "ఐక్యఉపాధ్యాయ" లో ప్రచురిస్తాము. రచనతోపాటు రచయిత ఫోటో, చిరునామా, ఫోన్ నంబరు పంపండి.

**– సంపాదకవర్గం, ఐక్యఉపాధ్యాయ**

**రచనలు పంపవలసిన చిరునామా :**

**చీఫ్ ఎడిటర్, ఐక్యఉపాధ్యాయ,** 27-31-11, గవర్నపేట, పాలపర్తివారి వీధి, విజయవాడ-520002

మెయిల్ : *ikyopadhyaya1975@gmail.com*

## ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు ఆపాలని, బదిలీల షెడ్యూలు విడుదల చేయాలని

# పిడిఎఫ్ ఎమ్మెల్సీల నిరాహారదీక్షలు



ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు ఆపాలని, షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ మే 30న నిరాహారదీక్షలు చేపట్టారు. విజయవాడలోని అలంకార్ సెంటర్ ధర్నాచౌక్‌వద్ద పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీలు బొడ్డు నాగేశ్వరరావు, వై.శ్రీనివాసులురెడ్డి, రాము సూర్యారావుతో టీచర్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఈ దీక్షల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ రావు, ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షులు షణ్ముఖ ఎమ్మెల్సీలకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. జెఏసి సెక్రటరీ జనరల్, యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమం లో బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి బదిలీలు చేస్తామని ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తూ కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఎన్నిసార్లు అడిగినా బదిలీల షెడ్యూల్ ప్రకటించకుండా అక్రమ బదిలీలు జరిపిస్తుందన్నారు. ఒక్కో బదిలీకి రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు వసూలు చేస్తూ, పాఠశాలశాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టరేట్ కార్యాలయాలను ప్రభుత్వం దళారులమయం చేస్తోందని విమర్శించారు. సాధారణ బదిలీల్ని పనితీరు ప్రాతిపదికన చేస్తామన్న ప్రభుత్వ అక్రమం బదిలీల్ని ఏ ప్రతిపాదికన చేస్తుందని ఆయన ప్రశ్నించారు. బడుల మూసివేతకు, రేషనలైజేషన్‌కు ఆగ మేఘాల మీద జిఓ ఇచ్చిన ప్రభుత్వం, బదిలీల షెడ్యూల్ ఎందుకు ప్రకటించడం లేదని అన్నారు. ఉపాధ్యాయులున్నచోట విద్యార్థుల్లేక, విద్యార్థులున్న చోట ఉపాధ్యాయుల్లేక రాష్ట్ర విద్యావ్యవస్థ అస్తవ్యస్తతంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 1.83లక్షలమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యా రని వివరించారు. కొంతమంది ఉపాధ్యాయులు ఎమ్మెల్సీలచే ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్ వచ్చాక బదిలీలు చేస్తే బాగుంటుందని మాట్లాడిస్తోందన్నారు. ఉపాధ్యాయులకు, ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధమేంటని ప్రశ్నించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.నరసింహారెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో నిర్వహించాల్సిన బదిలీల విషయంలో ఇంత గందరగోళాన్ని సృష్టించడం తీవ్రమైందిగా పరిగణించాలన్నారు. ప్రభుత్వం పారదర్శ కంగా చేయాల్సిన బదిలీలకు వెంటనే షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వేసవిలోనే బదిలీలు చేపడతామని తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత బదిలీల్లో పరస్పర ఒప్పందంతో బదిలీల ప్రక్రియ మొదలు పెట్టారన్నారు. జరుగుతున్న అవినీతి మొత్తం కూడా ప్రభుత్వానికి తెలుసన్నారు. ప్రతి సమావేశంలో కూడా కౌన్సిలింగ్ తానే తీసుకొచ్చానని చెప్పుకుంటున్న మంత్రి, ఈ విధానానికి తూట్లు పొడిచే విధంగా హరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను మూసివేయడమంటే పేద విద్యార్థి విద్యకు దూరం చేయడమేనని యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దీక్షకు ఎఐటి ప్రధానకార్యదర్శి జి. ఓబులేసు, ఏపి ప్రత్యేక హోదా సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.

### అన్ని జిల్లాలోనూ యుటియఫ్ మద్ధతు

అక్రమ బదిలీల సమస్యపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విజయవాడలో చేపట్టిన దీక్షకు అన్ని జిల్లాల్లోని యుటియఫ్ జిల్లా కమిటీలు, కార్యకర్తలు సంపూర్ణ మద్ధతు ప్రకటించారు. కలెక్టరేట్ల ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. గుంటూరు జిల్లా రాజు పాలెంలోని ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్. ఆదినారాయణ నాయకత్వం వహించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ డిఇఓ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేశారు. యుటియఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డివి రాఘవులు, టి.కామేశ్వరరావు మాట్లాడారు. విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షా శిబిరాన్ని ఏపిటిఎఫ్ 257 సీనియర్ నాయకులు జి.సింహాద్రప్పడు ప్రారంభించారు. యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షలను యుటియఫ్ సీనియర్ నాయకులు కె.ఆదినారాయణ ప్రారంభించారు. యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడారు. కడప డిఇఓ కార్యాలయం ఎదుట దీక్షలను ఉద్దేశించి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బి.లక్ష్మిరాజ మాట్లాడారు. చిత్తూరు విద్యాశాఖ కార్యలయం ఎదుట యుటియఫ్ చేపట్టి రిలేదీక్షల్లో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సోమశేఖరనాయుడు, ఎన్.గుణశేఖర్ ప్రసంగించారు. కర్నూలు లో కృష్ణదేవరాల సర్కిల్‌లో దీక్షలు నిర్వహించారు. యుటియఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సురేష్‌కుమార్, డి.రామశేషయ్య పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.రమేష్, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు షఫీ సంఘీభావం తెలిపారు. అనంత పురంలో యుటియఫ్ కార్యకర్తలు నిరాహారదీక్ష చేపట్టారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్‌జిలాన్ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ డా॥ ఎం.గేయానంద్, సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ ఆందోళనకు మద్దతు తెలిపారు. శ్రీకాకుళంలో జిల్లాలో నిరాహారదీక్షలు యుటియఫ్ కార్యదర్శి గొంటి గిరిధర్ ప్రారంభించారు. విజయనగరంలో రిలే నిరాహారదీక్షలను యుటియఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస రావు, కె.శేషగిరి ప్రారంభించారు.

# అక్రమ బదిలీల నిలుపుదలకు హామీ
# పిడిఎఫ్ ఎమ్మెల్సీల దీక్ష విరమణ



ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఓ నం.31ను విడుదల చేయడంతో విజయవాడలో రెండు రోజుల నుండి చేపట్టిన దీక్షలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ మే 31న రాత్రి నిరాహార దీక్షలను విరమించారు. ఏపిజెఏసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వర రావు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు. ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్ విడుదల చేయకుండా ప్రభుత్వం అక్రమంగా బదిలీ చేయడాన్ని నిరసిస్తూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలకు పెద్దఎత్తున ఉపాధ్యాయుల వద్ద నుండి మద్దతు లభించింది. దీంతో ప్రభుత్వం ఎట్టకేలకు ఉపాధ్యాయులను బదిలీ చేయబోమని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ ఉపాధ్యాయ సంఘ నాయకులకు, ఎమ్మెల్సీలకు హామీ ఇచ్చారు. దీంతో మే 31 రాత్రి 9 గంటల సమయంలో నిరాహారదీక్షలను విరమిస్తున్నట్లు శాసనమండలి సభ్యులు ప్రకటించారు.

ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫ్లోర్ లీడర్ విఠపు బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వేసవి సెలవుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సిన ప్రభుత్వమే అక్రమ బదిలీలకు శ్రీకారం చుట్టిందన్నారు. దీనికి వ్యతిరేకంగా తాము దీక్షలకు దిగినట్లు చెప్పారు. రేషనలైజేషన్ పేరుతో బడులు మూతవేయరాదని తెలిపారు. ప్రభుత్వం మళ్లీ అక్రమాలకు పాల్పడితే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఉపాధ్యాయ సంఘాలుచేసే పోరాటాలకు మద్ధతుగా ఉంటామని ప్రకటించారు. టీచర్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ బదిలీల జిఓతోపాటు షెడ్యూల్‌ను కూడా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీక్షలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.రఘు వీరారెడ్డి, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, శాసనమండలి సభ్యులు వెన్నపూస గోపాలరెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం సభ్యులు సిహెచ్.బాబూరావు, యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి, జెఏసి చైర్మన్ పి.అశోక్‌బాబు, ఎన్‌జిఓ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.గాంధీ, మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.బోసుబాబు, కెజిబివి టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొని తమ మద్ధతు ప్రకటించారు.

**జెఏసి ధర్నాలు - ఫ్యాప్టో,జాక్టో పోరాటాలను విజయవంతం చేయండి**

## యుటియఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు

సిపిఎస్ విధానం రద్దు చేయాలని, పిఆర్‌సి అరియర్లు, 2 విడతల డిఏ చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ తదితర సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ 6న జిల్లా, తాలూకా కేంద్రాలలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (జెఏసి) ధర్నాలను విజయవంతం చేయాలని యుటియఫ్ పిలుపు నిచ్చింది. పాఠశాలల మూసివేత, ఉపాధ్యాయ పోస్టుల రద్దును వ్యతిరేకిస్తూ, బదిలీలల్లో వెబ్‌కౌన్సిలింగ్, ఫెర్‌ఫార్మెన్స్ పాయింట్స్ రద్దు కోరుతూ ఫ్యాప్టో-జాక్టో ఆధ్వర్యంలో జూన్ 5న జరుగనున్న పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి పిలుపునిచ్చారు.

జూన్ 4న విజయవాడ యుటియఫ్ రాష్ట్ర కార్యాలయంలో యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలు సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానం రద్దు కోసం, సిపిఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జూన్‌లో సమస్యల సేకరణ, జులై మొదటివారంలోగా తాలూకా స్థాయి ధర్నాలు, జులై చివరిలో జిల్లా స్థాయిలో ధర్నాలు, ఎంపిపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలకు విజ్ఞాపనలు, డివిజన్, జిల్లా స్థాయిలలో బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని, సిపిఎస్ రద్దు కోసం శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుండి 3 జాతాలు, రాష్ట్ర వ్యాప్త పర్యటనను ఆగస్టులో నిర్వహిస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ప్రసంగిస్తూ ఉద్యమాలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల తరపున సంపూర్ణ మద్ధతు తెలిపారు.

యుటియఫ్ మహాసభల సంవత్సరం కాబట్టి మండల, పట్టణ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో మహాసభలు నిర్వహించి ప్రభుత్వ విద్యారంగ రక్షణకోసం, ఉపాధ్యాయ సంక్షేమం కోసం యుటియఫ్ నిర్ణయాలు తీసుకుంటుందని బాబురెడ్డి తెలిపారు.

యుటియఫ్ ఉద్యమాలలోను, ఐక్య ఉద్యమాలలోను, మహాసభల నిర్వహణలోను ఉపాధ్యాయులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు, రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు గొంటి గిరిధర్, డి.రాము, మహమ్మద్ జిలాన్, బి.శ్రీదేవి, బి.లక్ష్మిరాజా, ఆడిట్ కన్వీనర్ కె.సత్తిరాజు, ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు ఎన్.కుమార్‌రాజా, ప్రచురణల కమిటీ చైర్మన్ ఎన్.తాండవకృష్ణ, 13 జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




## ప్రజలకు భారం కానున్న

# వస్తు సేవల పన్ను

వస్తు సేవలపన్ను GST-2017 జులై 1 నుండి అమలులోకి రానున్ననది. దేశవ్యాపితంగా ఒకే పన్నుల విధానం, ఆర్థిక వ్యవస్థ పరుగు పెడుతుందని జిడిపి రెండు అంకెలకు చేరుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. పార్లమెంట్‌లో ఈ బిల్లుని వామపక్షాలు, డిఎంకె తప్ప అన్ని పార్టీలు ఆమోదించాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన ప్రధాన సంస్కరణ జిఎస్‌టి బిల్లు. దీనితో ఇప్పటివరకు దేశంలో అమలు అవుతున్న పన్నుల విధానం సమూలంగా మారిపోయింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వాటా స్థానంలో కేంద్ర ప్రభుత్వ పన్నుల విధానంగా రూపొందుతుంది. 1211 రకాల వస్తులపై పన్నులు నాలుగు స్లాబుల విధానం 5%, 12%, 18%, 28%గా వర్గీకరించారు.

నిత్యావసర వస్తువులు చక్కెర, టీ, కాఫీ, వంటనూనె, భారతీయ స్వీట్స్, ఆహార ధాన్యాలు ఇలాంటి 14% వస్తువులపై 5% పన్ను; నిల్వవుంచిన మాంసం, సెల్‌ఫోన్, ఎరువులు, కుట్టుమిషన్లు, పళ్ళ పొడులు, ఆయుర్వేదిక్ మందులు లాంటి 17% వస్తువులపై 12% పన్ను; వస్తు సేవలు అన్ని రకాలు, నోట్-బుక్స్‌లు, ఐస్‌క్రీమ్, టెలికాం, కెమెరా, ఐటి సేవలు లాంటి 43% వస్తువులపై 18% పన్ను; ఆటో మొబైల్ రంగం, పెయింట్, కాటరింగ్, పొగాకు ఉత్పత్తులు లాంటి 19% వస్తువులు 28% పన్ను పరిధిలోకి వస్తాయి.



ఎన్.వెంకటేశ్వర్లు
UTF రాష్ట్ర సహాధ్యక్షులు

### జిఎస్‌టి బిల్లు పూర్వరంగం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక పన్నుల చట్టంలో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానం వుంది. కేంద్రప్రభుత్వం పరిధిలో సర్వీసు టాక్స్, మ్యానుఫాక్చరింగ్ టాక్స్ వుండగా, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో సేల్స్ టాక్స్ వుంది. ప్రత్యక్ష పన్నులలో ఆదాయం తక్కువ వున్న వారు తక్కువ పన్నులు, ఎక్కువ ఆదాయం వున్నవారు ఎక్కువ పన్నులు చెల్లించేవారు. పరోక్ష పన్నులు వివిధ స్థాయిలో వుండేవి. ఇది వస్తువుల తయారీని బట్టి నిర్ధారించేవారు. అవసరమైన సందర్భంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పన్నులపై సబ్సిడీ ఇచ్చేవారు. ఆ మేరకు ప్రజలపై భారం తగ్గించడానికి అవకాశం వుంది.

సరళీకరణ యుగం ప్రారంభమయిన తరువాత పెట్టుబడి ఆకర్షించాలంటే ఎక్కువ కంపెనీలు రావాలంటే రాయితీలు ఇవ్వాలనే పేరుతో కార్పొరేట్ కంపెనీలకు లక్షలకోట్ల రాయితీలు ఇస్తున్నారు. దీని ప్రభావంవల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయింది. ప్రత్యక్ష పన్నులు ఆదాయం తగ్గిపోవడంతో పరోక్ష పన్నులను ప్రభుత్వం పెంచుతుంది. కార్పొరేట్ కంపెనీలను రాయితీలను తొలగించడానికి సాహసం చేయని ప్రభుత్వం ప్రజలపై భారం వేయడానికి సిద్ధపడింది. 2014- 15 కేంద్ర బడ్జెట్ 17 లక్షల కోట్లు దీనిలో 5 లక్షల 59 వేల కోట్లు కార్పొరేట్‌లకు ప్రభుత్వ రాయితీ ఇచ్చింది.

### జిఎస్‌టిపై కేంద్ర ప్రభుత్వం వాదనలు

ఏక బిల్లు విధానంవల్ల ధరలు తగ్గుతాయని, ధనవంతులనుండి ఎక్కువ పన్ను రాబట్టవచ్చని, జిడిపి పెరుగుతుందని, ప్రజల సంక్షేమానికి పెరిగిన ఆదాయాన్ని వినియోగించవచ్చని, జిఎస్‌టి వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోతే ఆ నష్టాన్ని కేంద్ర భరిస్తుందని, పెట్టుబడులకు భారతదేశం నిలయంగా మారుతుందని, ఎగుమతులు పెరుగుతాయని ప్రభుత్వం చెబుతుంది. జిఎస్‌టి ఒకే దేశం, ఒకే జాతి, ఒకే బాష, అనే పాలకవర్గ విధానాని కనుగుణంగా ఒకే పన్ను విధానం తెస్తుంది. ఇది కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడే జిఎస్‌టి విధానం తప్ప ఎగుమతులు పెరగడం, ధరలు తగ్గడం, ప్రజల సంక్షేమం కోసం ఆదాయం వినియోగించడం అనేది నోట్ల రద్దు సందర్భంలో చెప్పిన ఏ అంశం ఫలితాన్ని ఇవ్వక పోయినంత సత్యం.

### రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

భారతదేశం విభిన్న జాతుల సమాఖ్య భిన్న జాతులు, భాషలు, ఆచార, ఆహార అలవాట్ల ఐక్య సంఘటన. ఫెడరల్ రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాలకు సేల్స్ టాక్స్ మీద పూర్తి హక్కులు వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయంలో 80% సేల్స్‌టాక్స్‌నుండే వస్తుంది. ఈ 80% ఆదాయాన్ని జిఎస్‌టి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి చేరుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు వారి రాజకీయ విధానాలకనుగుణంగా ప్రజలకు వివిధ రకాల రాతీయిలు ఇస్తూ వస్తూ వున్నారు. కాని భవిష్యత్‌లో ఇలా రాయితీలు ఇవ్వడానికి వీలుకాదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి పన్నులు వెళ్ళడమే కాదు, వివిధ పార్టీల రాజకీయ విధానాలను కేంద్ర ప్రభుత్వం శాసిస్తుంది. సొంతంగా వనరులు సమీకరించుకునేది పోగొట్టుకొని కేంద్రం దయా దాక్షిణ్యాల మీద ఆధారపడే పరిస్థితిని తెస్తుంది.

### వివిధ దేశాలలో జిఎస్‌టి అమలు

చైనా, పాకిస్థాన్ దేశాలలో 17% పన్నుల విధానం అమలులో వున్నాయి. బంగ్లాదేశ్, శ్రీలంకలలో 15%, నేపాల్‌లలో 13%, ఆస్ట్రేలియా, ఇండోనేషియాలలో 10%, జపాన్ 8%, అమెరికాలోని వివిధ రాష్ట్రాలలో టెన్నీసీలో 9.45%, లూసియన్ 8.91%, వాషింగ్టన్ 8.39%, బ్రిటన్ 20%, గ్రీస్ 24%, అర్జెంటీనా 27% కాని మన దేశంలో 28%గా వున్నది. మిగిలిన దేశాలకంటే కార్పొరేట్ శక్తులకు భారతదేశానికి స్వర్గదామంగా చేయడంతప్ప మరొకటి కాదు. ఇది ఎలాంటి దేశ భక్తో పాలకవర్గం చెప్పాల్సివుంది.

# ఇస్రో స్వదేశీ పరిజ్ఞానంతో విజయవంతమైన రాకెట్ ప్రయోగం



భారత అంతరిక్ష ప్రయోగాల చరిత్రలోనే అద్భుత విజయం. ఇస్రో చరిత్రలోనే సరికొత్త అధ్యాయం. భారీ రాకెట్ జిఎస్ఎల్వీ మార్క్ -3డీ1 తొలి ప్రయత్నంలోనే విజయవంతంగా రోదసీలోకి దూసుకుపోయింది. ఈ పెను రాకెట్.. కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-19ను ఎలాంటి అవాంతరాలు లేకుండా అంతరిక్షంలో భూ అనువర్తిత బదిలీ కక్ష్య (జీటీవో)లోకి ప్రవేశపెట్టింది. జూన్ 5 సాయంత్రం 5.28కి శ్రీహరికోటలోని సతీష్ధావన్ అంతరిక్ష కేంద్రంలోని రెండో ప్రయోగ వేదిక నుంచి నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. సరిగ్గా 16 ని॥ల తర్వాత 3,136 కిలోల బరువున్న జీశాట్-19ను జీటీవోలోకి జారవిడిచింది. అనుకున్న దాని కన్నా కొద్ది సెకన్ల ముందే ఈ క్రతువును ముగించి, శభాష్ అనిపించుకుంది.

ఈ తరహా భారీ రాకెట్‌ను ప్రయోగించడం తొలిసారి. ఈ వ్యోమ నౌక పయన మార్గంలో ఎక్కడా లోపం తలెత్తలేదు. జీఎస్ఎల్వి మార్క్-3లో రెండు ఘన ఇంధన స్ట్రాపాన్ (ఎస్200) ఇంజిన్‌లు, ఒక ద్రవ ఇంధన ఇంజిన్ కోర్ దశ (ఎల్110), కీలకమైన క్రయోజనిక్ ఇంజన్ (సి-25) దశ ఉన్నాయి. ఎస్200 స్ట్రాపాన్లు నిర్దేశిత సమయానికి విడివడ్డాయి. ఆ తర్వాత ఎల్ 110 కీలకదశ కూడా అనుకున్నట్లుగానే విడిపోయింది. ఇక రాకెట్‌కు అత్యంత ప్రాణాధార మైన క్రయోజనిక్ ఇంజన్ పనిచేయడం ప్రారంభించింది. అత్యంత కచ్చితత్వంతో పనిచేసింది. స్వదేశీ తయారీ అయిన క్రయోజనిక్ ఇంజన్ పనిచేయడం ప్రారంభించగానే ప్రయోగం విజయం ఖాయమై పోయింది.

రాకెట్‌నుంచి జీశాట్-19 విడిపోగానే అందులోని సౌర ఫలకాలు, యాంటెన్నాలు విచ్చుకున్నాయి. కర్ణాటకలోని హసన్‌వద్ద ఉన్న మాస్టర్ కంట్రోల్ కేంద్రం ఉపగ్రహాన్ని తన నియంత్రణలోకి తీసుకుంది. ప్రస్తుతం జిటివోలో ఉన్న ఈ ఉపగ్రహాన్ని కొద్ది రోజుల్లో తుది కక్ష్యలోకి ప్రవేశపెడ్తారు. ఉపగ్రహంలోని ద్రవ అపోజీ మోటార్‌ను వివిధ దశల్లో మండించడం ద్వారా దాని కక్ష్యను మారుస్తారు.

ఈ విజయం వెనక దశాబ్దంపైన కృషి దాగిఉంది. విదేశాలకే పరిమితమయిన క్లిష్టమైన క్రయోజనిక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వయంగా ఛేదించి, సొంతంగా సీ25 ఇంజన్‌ను తయారుచేసు కోవడానికి ఇస్రో శాస్త్రవేత్తలు అవిశ్రాంతంగా శ్రమించారు. జిఎస్ఎల్వి మార్క్-2లోని సి1 క్రయోజెనిక్ ఇంజన్‌తో పోలిస్తే ఇది రెట్టింపు కన్నా ఎక్కువ శక్తిమంతమైంది. అమెరికా ఆంక్షల ఉచ్చును ఛేదించుకొని మన శాస్త్రవేత్తలు దీన్ని సాకారం చేశారు.

### వివిధ రంగాలపై తీవ్ర ప్రభావం

నిర్మాణ రంగంలో వాడే వస్తువులు సిమెంట్, ఇటుకలు, రూఫింగ్ షీట్లు ఫ్లోరింగ్‌కు వాడే వివిధ రకాల రాళ్ళు ఇప్పటివరకు 17.5% పన్నురేటు వుంటే జిఎస్‌టిలో 28%కి పెంచారు. హోటల్ రంగంలో 19% నుండి 28%కి పెంచారు. వినోద రంగంలో 12% నుండి 28%కి పెంచారు. పత్రికా రంగంలో ఇచ్చే ప్రకటనలకు గతంలో ఎలాంటి పన్నులేదు. ఇప్పుడు 5%కి పెంచారు. విద్యారంగంలో పన్నులు లేవని ప్రకటించారు. కాని కాగితం మీద జిఎస్‌టి మరియు సెస్ కలిపి 40%, పెన్నుల మీద 40% పెరగనున్నాయి. టెలికం రంగంలో 15% నుండి 18%కి పెంచారు. మొబైల్ ఫోన్ ధరలు 4 నుంచి 5% పెరుగుతాయి.

### జిఎస్‌టి ఏర్పడు సామాజిక ప్రభావం

ప్రపంచీకరణ ప్రభావంవల్ల ఇప్పటికే దేశంలో ఉపాధిరహిత అభివృద్ధి అదీ కొద్దిమంది కార్పొరేట్‌ల అభివృద్ధిగా మారిపోయింది. ధనిక పేదల మధ్య ఆర్థిక సామాజిక వ్యత్యాసం పెరిగిపోయింది. ఉపాధి కోల్పోయిన ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. ఉత్పత్తి కుదేలు అవుతుంది. ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుంది. దీనిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రజలకు రాయితీలు ఇచ్చి, ఉపాధిని కల్పించాల్సి వుంది. దీనికి భిన్నంగా ప్రజలకు మరింత భారాలను మోపి, కార్పొరేట్ శక్తులకు రాయితీల పేరుతో వరంగా మార్చడానికి పూనుకున్నది. పాలకవర్గ వాస్తవ నైజం ఈ జిఎస్‌టి ద్వారా ప్రజలు తెలుసుకోవాలి. దేశీయ ముసుగులో విదేశీయ విధానాలకు దాసోహం అవుతున్న తీరు గమనించాలి.

జాతి సమైక్యత, దేశభక్తి, ఆహారపు అలవాట్లు, నల్లజాతివారు, ప్రశ్నించేవారు, దేశద్రోహులు లాంటి అంశాలను ప్రచార అస్త్రాలుగా చేసి సున్నితమైన అంశాలను బహిరంగంగా అడ్డూ అదుపూ లేకుండా వ్యాఖ్యానాలు చేస్తూ, దేశ ప్రజల మధ్య చీలికలు తెస్తున్న నేటి పాలక వర్గం ఈ జిఎస్‌టి బిల్లు తీసుకురావడం ద్వారా ఎవరికి ఎవరు సేవకులో నిరూపణ అవుతుంది. అందుకనే ప్రజలు ఈ జిఎస్‌టి ద్వారా ప్రజల ఆదాయాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే చట్టబద్ధతను ప్రశ్నించాలి. భారతదేశ సమైక్యతను నిలబెట్టే ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాలి.

# డైరక్టరేట్ కార్యాలయం ముట్టడి




ఫ్యాప్టో–జాక్టో పిలుపుమేరకు ఉపాధ్యాయ సంఘాలకు విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో జూన్ 5వ తేదీన వందలాది మంది ఉపాధ్యాయులు విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలు మూత వేయరాదని, బదిలీల్లో వెబ్‌కౌన్సిలింగ్ రద్దు చేయాలని, ఫర్‌ఫార్మెన్స్ పాయింట్స్ తొలగించాలని, అక్రమ బదిలీలు రద్దు చేయాలని నినాదాలతో డైరెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఉపాధ్యాయ సంఘాల ముట్టడిని అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్స్‌తో రక్షణ వలయం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల నిరసనలతో ఆ ప్రాంతం మార్మోగింది. మండు టెండలో 2 గంటలుపైగా అక్కడే బైఠాయించి కార్యాలయంలోకి వెళ్ళే ఉద్యోగుల్ని అడ్డుకోవడంతో పోలీసులకు, ఉపాధ్యాయులకు మధ్య వాగ్వివాదాం ఏర్పడింది. అక్కడ ఏర్పాటుచేసిన పోలీసు బారికేడ్లు నెట్టుకొని ఉపాధ్యాయులు లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పోలీసులు ఉపాధ్యాయులకు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఫ్యాప్టో–జాక్టో నాయకులను ఈడ్చు కెళ్ళి వ్యాన్‌లో పడేశారు. మహిళా ఉపాధ్యాయుల్ని సైతం బలవంతంగా ఈడ్చుకెళ్ళి అరెస్టు చేవారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతోపాటు, ముట్టడికి మద్దతుగా వచ్చిన ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావును కూడా అరెస్టు చేశారు. అరెస్టులు జరుగుతున్న సమయంలో కూడా పెద్దఎత్తున ఉపాధ్యాయులు వస్తూనే ఉన్నారు. అరెస్టు చేసిన ఉపాధ్యాయులను విజయవాడ నగరంలోని 8 పోలీసు స్టేషన్‌లకు తరలించారు.

ముట్టడికి వచ్చిన ఉపాధ్యాయులనుద్దేశించి ఫ్యాప్టో చైర్మన్ పి.బాబు రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖమంత్రి మే 1వ తేదీ విశాఖలో ఉపాధ్యాయ సంఘాలకు హామీలు ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. పాఠశాల పని దినాలు నష్టపోకుండా వేసవి సెలవుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని అన్ని సంఘాలు చెప్పినా విద్యాశాఖ మంత్రి, అధికారుల నిర్లక్ష్యం వల్ల బదిలీలు ఆలస్యం అయి నాయని, ఈ కాలంలోనే అవినీతి, అక్రమ బదిలీలు చేశారని అన్నారు.

ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపా ధ్యాయ సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని అన్నారు. యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెబ్ కౌన్సిలింగ్ రద్దు చేయాలని, ఫర్‌ఫార్మెన్స్ పాయింట్లు తొలగించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు, జాక్టో కన్వీనర్ ఎం.కమలాకర్‌రావు, కో–కన్వీనర్ చంద్ర కృష్ణమోహన్, ఫ్యాప్టో కో–చైర్మన్లు సిహెచ్.జోసెఫ్ సుధీర్‌బాబు, పి.పాండురంగవరప్రసాద్, ఎస్.వి.రమణయ్య, జివి రమణారెడ్డి, జాక్టో కో–చైర్మన్ ముత్తోజి వీరబ్రహ్మం, ఫ్యాప్టో సెక్రటరీలు సామల సింహాచలం, పర్రె వెంకట్రావు, బి.కరీముల్లారావు, టి.గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థినులకు రక్షణ ఉంటుందా?




2009–10 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం బాలికల విద్యను ప్రోత్సహించేందుకు, 14–18 సం॥ మధ్య ఉన్న 9,10వ తరగతి మరియు ఇంటర్ వరకు బాలికల చదువుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా బాలికల విద్యాభ్యాసం కొనసాగాలని కేంద్ర ప్రభుత్వం బాలికల కోసం ప్రత్యేకంగా భారతదేశం అంతటా 3,479 "బాలికల వసతి గృహాలు" అక్షరాస్యతపరంగా వెనుకబడిన మండలాల్లో ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ బాలికల వసతి గృహాల నిర్వహణను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు మంజూరు చేసింది.

ఈ వసతి గృహాల వలన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బాలికలు సమీప పాఠశాలలో చదువు కొనసాగిస్తూ ఈ వసతి గృహాల్లో వసతిని పొందుతారు. 100మంది బాలికల సరిపడా అన్ని సౌకర్యాలు కలిగి ఉండాలని కేంద్ర మానవ వనరుల శాఖ స్పష్టంగా ఆదేశాలను జారీ చేసింది. ఈ బాలికల వసతి గృహాల్లో చేరుటకు దారిద్ర్యరేఖకు దిగువుగా ఉన్న వర్గాలకు చెందినవారిని, ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి, మైనార్టీ వారికి ప్రాధాన్యమివ్వాలి అనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం.



కె.సురేష్
ప్రధానకార్యదర్శి
APMSTF శ్రీకాకుళం

విషయం ఏమిటంటే భారతదేశం అంతటా ఈ బాలికల వసతి గృహాలు ప్రారంభమయ్యాయి. కాని ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు ప్రారంభంకాలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 737 వెనుకబడిన మండలాల్లో రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు 192 బాలికల వసతి గృహాలు, ఆంధ్రప్రదేశ్‌కు 163 బాలికల వసతి గృహాలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఎక్కడైతే ఆదర్శపాఠశాలలు నిర్మించారో దానికి అనుబంధంగా ఈ బాలికల వసతి గృహాలు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వలన 2013వ సంవత్సరంలో ప్రారంభం కావల్సిన వసతిగృహాలు 2017–18 విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తామని కాస్త ఆలస్యంగా అధికారులు విషయాన్ని ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆదర్శ పాఠశాలలకు అనుబంధంగా నిర్మించిన ఈ బాలికల వసతి గృహాలకు అన్ని సౌకర్యాలు ఉన్నాయో లేవో అని గమనించకుండా వసతిగృహాలు ప్రారంభించాలనుకోవడం విడ్డూరం. ఎందుకంటే 14–18 సం॥ల మధ్య బాలికలకు ఉండే వసతి గృహాలకు భోజనం, వసతితోపాటు రక్షణ కూడా అవసరం. ఈ రక్షణ కోసం బాలికల వసతిగృహాలు చుట్టూ "ప్రహరీగోడ" నిర్మించడం లేదా రక్షణ కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ఎంతో అవసరం కాని ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏ ఒక్క "ఆదర్శ పాఠశాలల – అనుబంధ బాలికల వసతి గృహాల"కు రక్షణగోడ లేదు. దీనివలన ఎన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయో అనే కనీస అవగాహన అధికారులకు లేదు.

వసతి గృహాల నిర్వహణకు పూర్తిస్థాయి సిబ్బందని నియమించాలి. వారికి బాలికల ఆరోగ్యం, రక్షణ, వారి హక్కుల రక్షణకు సంబంధించి అవగాహన కల్పించడం ప్రభుత్వం బాధ్యత. అంతేకాకుండా ఈ వసతి గృహాలకు అన్నింటికి మంచినీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం, విద్యుత్ కోతలు ఉంటే ప్రత్యామ్నాయం, ఆరోగ్యానికి సంబంధించి పరికరాలను ఉంచడం తప్పనిసరి.

బాలికల వసతి గృహాలు ప్రారంభించాలంటే కనీస సదుపాయాలు ఏమి ఉండాలో అధ్యయనం చేసి ప్రారంభించాలే తప్ప, హడావుడిగా ప్రారంభిస్తే బాలికల రక్షణకు ముప్పు ఉంటుంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన 90% ఈ అనుబంధ ఆదర్శ బాలికల వసతి గృహాలు ఆవాస ప్రాంతాలకు దూరంగా ఉన్నాయి. అనుకోని ప్రమాదాలు జరిగితే మూల్యం చెల్లించుకోకతప్పదు. దీనికి నైతిక బాధ్యత ప్రభుత్వం, విద్యాశాఖ తీసుకోవాల్సిందే. పశ్చిమగోదావరి జిల్లా మినహా అన్ని జిల్లాలు కలిపి 117 బాలికల వసతి గృహాలు జూన్‌లో ప్రారంభానికి సిద్ధంగా వున్నాయని ప్రభుత్వం ప్రకటించింది.

వసతి గృహాలు నిర్మాణం, ప్రారంభం ఎలాగో ఆలస్యం అయినది కనుక ఇప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటనలు జరిపి, వాస్తవాలు అధ్యయనంచేసి బాలికల రక్షణ చాలా సున్నితమైన అంశముకనుక బాలికల రక్షణకు ఆత్మగౌరవంకు, హక్కులకు భంగం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

## ఉద్యమవార్తలు పంపండి

**యుటియఫ్ జిల్లా శాఖలు, మండల శాఖలు మీ జిల్లా / మండలంలో నిర్వహించిన సమావేశాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ప్రాతినిధ్యాల వార్తలను, ఫోటోలను ఎప్పటి కప్పుడు 'ఐక్య ఉపాధ్యాయ'కు మెయిల్ / పోస్టు ద్వారా పంపండి. మీ పోరాటాలు, విజయాలు అన్ని జిల్లా / మండల శాఖలకు స్ఫూర్తిని కల్గిస్తాయి. ప్రతినెల 30వ తేదీలోగా వచ్చిన వార్తలు, ఫోటోలు మరుసటి నెల పత్రికలో ప్రచురించడం జరుగుతుంది.**

**– సంపాదకవర్గం**

# చదవడం అంటే ఏమిటి?



సి.వి.కృష్ణయ్య
జనవిజ్ఞాన వేదిక

మన మాటల్లో నిరంతరం 'చదవడం' అనే పదాన్ని ఉపయోగిస్తూ ఉంటాం. చదవడం అంటే ఏమిటి? దేన్ని చదవడం అంటారు? పుస్తకంలో ఉన్న వాక్యాలు చదవడమా? ఆ వాక్యాలలో దాగి ఉన్న భావాన్ని చదవడమా?

ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయి. ఒకటి అక్షరాలు చదవడం, రెండు భావాన్ని చదవడం. ఏదైనా ఒక విషయాన్ని ఎందుకు చదువుతాం? ఆ విషయాన్ని గురించి తెలుసుకోవడం కోసం చదువుతాం. కాబట్టి అక్షరాలు (లిపి) చదివినందువల్ల ఉపయోగంలేదు. ఆ అక్షరాలవెనుక ఉన్న విషయం తెలిసుకోవడమే చదవడం అంటే తెలుసుకోవాలంటే చదివింది అర్థంగావాలి. అర్థం అయిందని ఎలా తెలుసుకుంటాం? అర్థంచేసుకొనేటప్పుడు ఆసక్తిగా ఉంటుంది. ఆనందంగా ఉంటుంది. ఏదో ఒక రకమైన అనుభూతి కల్గుతుంది. ఇది నిజమా అనే సందేహం కలుగవచ్చు. తెలుసుకోవాలనే కుతూహలం మరింత ఎక్కువ కావచ్చు. లోపల ఏదో ఒక కదలిక ఉంటుంది.

నేను సోషల్ చదువుతున్నాను, సైన్సు చదువుతున్నాను అంటే వాటిని అర్థం చేసుకోవడానికి, తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాని భావించాలి. ఏదైనా ఒక కొత్త విషయాన్ని అర్థం చేసుకొనేటప్పుడు మెదడు చాలా చురుగ్గా పనిచేస్తుంది. మెదడులో నిక్షిప్తమైన సమాచారమంతా వినియోగంలోకి వస్తుంది. మెదడు అనేక తర్కాలు చేస్తుంది. దాన్ని నిగ్గుతేలుస్తుంది. అర్థంగాని విషయాలు మిగిలి ఉంటే స్నేహితుల్నిగాని, టీచర్లను గాని అడిగి తెలుసుకుంటాం. గ్రంథాలయానికి వెళ్ళి అనేక గ్రంథాలు పరిశీలిస్తాం. ఇంటర్నెట్‌లో వెదుకుతాం. సరైన సమాధానం దొరికినప్పుడు సంతృప్తి పొందుతాం. కొంత జ్ఞానాన్ని సంపాదిస్తాం.

ఇలా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకుండా రెడీమేడ్‌గా సిద్ధం చేసిపెట్టిన క్వశ్చన్ బ్యాంకులో, గైడ్లో సంపాదించుకొని జవాబులు కంఠస్థం చేయడాన్ని చదవడం అంటామా? గుర్తు పెట్టు కొని రాసిన జవాబులకు మార్కులు వేసి జ్ఞానాన్ని కొలవడం అంటే ఆ విద్యార్థిని మోసం చేసినట్లుకాదా! దీనివలన ఆ విద్యార్థికి గాని సమాజానికి ఏమి లాభం? ఒక వ్యక్తి జీవితంలో అద్భుతమైన ఆనందకరమైన బాల్య కౌమార యవ్వన కాలాలను వ్యర్థ పుచ్చుడమేకదా! వ్యర్థమైన ఈ అబద్ధపు చదువులు బడుల్లో మాత్రమే చదువుతారు - మార్కుల కోసం, డిగ్రీల కోసం. బయట చదివే వాళ్ళు ఆనందంకోసం, జ్ఞానంకోసం మాత్రమే చదువుతారు. జ్ఞాన సంపాదనకు పెద్ద అడ్డంకి మార్కులూ, పరీక్షలే పిల్లలు అర్థంచేసుకోలేక పోతున్నారో టీచర్లకు అర్థం అయ్యేటట్లు చెప్పడానికి సమయం చాలటంలేదా? సిలబస్ భారంగా ఉందా?

సమయం చాలకపోవడం, సిలబ్ భారం కావడం- ఈ రెండూ రూపొందించిన వారి సమస్యలు. ఈ సమస్యలతో పిల్లలకు సంబంధం లేదు. కాని పిల్లలకు అర్థం చేసుకొనే శక్తి మాత్రం ఉంది. అర్థం చేసుకొనే శక్తి ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అది పుట్టుకతోనే సహజంగా వస్తుంది. ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిరంతరం గమనిస్తూ అర్థం చేసుకొంటూ ఉంటారు. ఆరు నెలల పసిబిడ్డ కూడా మన ముఖంలో భావాల్ని చదువుతుంది. కోపంగా ముఖం పెడితే ఏడుస్తుంది. చిరునవ్వుతో చూస్తే తానూ నవ్వుతుంది. కేరింతలు కొడుతుంది. అంటే పసిబిడ్డ కూడా మన ముఖంలో, కళ్లల్లో ఉన్న భావాల్ని చదివి స్పందిస్తుంది. దీనికి ఎలాంటి అక్షరాలు చదువులు అవసరం లేదు. ఏ డిగ్రీలు లేనివారంతా అక్షరం ముక్క తెలియనివారు సైతం నిరంతరం ఈ ప్రపంచాన్ని చదువుతూనే ఉంటారు.

మాట్లాడడం తెలుసు. లిపి తెలుసు. అర్థంచేసుకొనే శక్తిఉంది. కాని పుస్తకాలలో ఉండే విషయాలు అర్థం చేసుకోకుండా చదవడం వలన ప్రయోజనం ఏముంది?

ఇలా అర్థం చేసుకోకుండా కంఠస్థం చేసి చదవడం వల్ల అర్థం చేసుకొనేశక్తి నశించిపోతుంది. తనకు ఏమి తెలుసో, ఏమి తెలియదో తన శక్తి సామర్థ్యాలు ఏమిటో తనకే తెలియదు. భారంగా చదువులు ముగించి పట్టాలు చేతబట్టు కొని కూర్చుంటారు. భయంతో ముడుచుకొని పోతారు. తన అజ్ఞానాన్ని డిగ్రీల మాటున దాచుకొంటారు. లేదా మొండిగా మారిపోతారు. చేసే పనిలో సృజనాత్మకత ఉండదు. ఎదుటివారి మాటలు ఓపిగ్గా విని అర్థం చేసుకొనే శక్తి ఉండదు. ఏది ఎందుకు జరుగుతుందో తర్కబద్ధంగా ఆలోచించలేరు. అవినీతి పరులకు అధికారం చెలాయించేవారికి అభిమానులుగానో అనుచరగణంగానో మారిపోతారు. సమాజానికి భారంగా తయారవుతారు.

చదవడమంటే అర్థం చేసుకోవడం. చదవడం అంటే తర్కించం. చర్చించడం. ప్రశ్నించడం.

చదవడమంటే ప్రకృతిని అర్థంచేసుకోవడం. ప్రకృతి సూత్రాలను అర్థం చేసుకోవడం. చదవడమంటే మానవ సమాజాన్ని, ఆ సమాజ గమనాన్ని అర్థం చేసుకోవడం. చదవడం అంటే పల్లెలు, పట్టణాలు తిరిగి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవడం - తార్కిక జ్ఞానంతోపాటు అనుభవ జ్ఞానాన్ని కూడా సంపాదించడం.

చదవడం అంటే తన శరీరాన్ని, మనస్సును, తన ఆలోచనలను అర్థం చేసుకోవడం-తన జీవిత పరమార్థం ఏమిటో - తన గమ్యం ఏమిటో ముందుగానే నిర్దేశించుకోవడం.

చదవడం అంటే భూతవర్తమానాల ఆధారంగా భవిష్యత్తును ఊహించడం. చదవడమంటే సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవడం. చదవడం అంటే సంపాదించిన జ్ఞానం ఆధారంగా కొత్త సిద్ధాంతాలు కొత్త ఆవిష్కరణలు చేయడం.

చదవడం అంటే భయాలు, బాధలు లేని కొత్త ప్రపంచం గురించి కలలు గనడం. ఆ కొత్త ప్రపంచ నిర్మాణానికి కొత్తదారులు వెదకడం. ప్రపంచమంతా సుఖశాంతులతో నిండాలనీ మానవులంతా ఆనందంగా ఉండాలని కోరుకోవడం.

చదువు యొక్క పరమార్థం ఇదే. ఇదిగాకపోతే మరేమిటి? ఈ మానవ మహా ప్రస్థానం ఎవరికోసం, ఎందుకోసం?

# రేషనలైజేషన్‌తో ప్రభుత్వ విద్య నిర్వీర్యం

2022వ సం॥ నాటికి మన రాష్ట్రం భారత దేశంలో 3 అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటి, 2029 నాటికి దేశంలో అత్యుత్తమ రాష్ట్రం. 2050నాటికి ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాలు గల రాష్ట్రం. జూన్ 2వ తేదీ నవ నిర్మాణదీక్ష సందర్భంగా ముఖ్యమంత్రిగారు చేయించిన ప్రతిజ్ఞ.

దేశంలో విద్యారంగంలో 13వ స్థానంలో ఉన్నాం. ప్రపంచంలో అభివృద్ధిచెందిన ఏ దేశం అయినా విద్యాభివృద్ధి సాధించిన తర్వాతే ముందుకు వెళ్ళింది. నేడు మన రాష్ట్రంలో అక్షరాస్యత 67.41% స్త్రీలలో 60.01% మాత్రమే ఉంది. దేశ సగటు అక్షరాస్యతకంటే 11 జిల్లాలు వెనకబడి ఉన్నాయి. 7 జిల్లాలు రాష్ట్ర సగటుకంటే వెనక బడి ఉన్నాయి.



పి. బాబురెడ్డి
UTF రాష్ట్ర ప్రధానకార్యదర్శి

మన రాష్ట్రంలో – పాఠశాలల్లో మొత్తం 68,47, 297మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో 39,85,797 విద్యార్థులు ప్రభుత్వరంగ పాఠశాలల్లో ఉన్నారు.

విద్యాశాఖ ప్రతి సంవత్సరం రేషనలైజేషన్ పేరుతో వేలాది పాఠశాలల మూత వేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో 10వేల పాఠశాలలు మూసివేశారు. 2015–16లో 2825 ప్రాథమిక పాఠశాలలు విలీనం పేరుతో మూసివేసి 3886 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేశారు. 5వ తరగతులకు 5గురు టీచర్స్ ఇచ్చారు. అన్ని రకాల మౌలిక వసతులు, తరగతిదొక గది నిర్మిస్తామన్నారు. ఈ పాఠశాలలకు ప్రత్యేకంగా బడ్జెట్ విడుదల చేస్తామని ప్రకటించారు. ఆచరణలో అమలు కాలేదు. అందులో 1800పైగా పాఠశాలల్లో 80మందికంటే విద్యార్థులు తగ్గిపోయారు. అందుకు కారణంలేమిటి అనేది ఎవరూ సమీక్షించలేదు.

1994లో డిపిఇపి ద్వారా అందుబాటులో పాఠశాలలు అంటూ గ్రామాల్లో బడులు సంఖ్య పెంచారు. బడికి ఇద్దరు టీచర్లను కేటాయిం చారు. బహుళ తరగతి బోధన, విద్యావాలంటీర్లు వచ్చారు. ఈ ప్రయోగం విఫలం అయింది, ప్రమాణాలు పడిపోయాయి. పాఠశాలలు ప్రజల విశ్వాసం కోల్పోయాయి. పిల్లలు తగ్గారు – రేషనలైజేషన్ ప్రారంభం అయింది. ఓ పథకం ప్రకారం ప్రాథమిక విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. ప్రాథమిక విద్యా నిర్వహణ అంతా ప్రాజెక్టుల పరిధిలోకి వెళ్ళిపోయింది. అనేక ప్రయోగాలు చేసి, వందలాది కోట్లు ఖర్చుచేసి చివరికి ప్రాథమిక వ్యవస్థకి బలహీన పరిచారు.

ఇప్పుడు అన్ని హంగులు – క్లాసుకొక టీచర్‌తో పాఠశాల అంటు న్నారు. పాఠశాలలు మరల ప్రజల విశ్వాసం పొందాలంటే గ్రామంలో ఓ మంచి బడి ఏర్పాటు కావాలి. బాలల్ని ఆకర్షించాలి. కాని ప్రభుత్వానికి స్కూళ్ళు మూసివేత మీద ఉన్న ఆసక్తి సౌకర్యాలు కల్పించి కొనసాగించడం మీద లేదు.

ఈ సంవత్సరం రేషనలైజేషన్‌లో 19మంది విద్యార్థులున్న పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చాలని ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7 తరగతుల్లో 30మంది, 6,7,8 తరగతుల్లో 40 మంది ఉన్న పాఠశాలల డౌన్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించారు. అందువల్ల ప్రాథమిక పాఠశాలలు 6201 మూతవేయడమో లేక ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారుతున్నాయి. యుపి పాఠశాలలు 2384 పాఠశాలలు విలీనం పేరుతో మూతపడనున్నాయి.

ఫ్యాప్టో–జాక్టో, ఎమ్మెల్సీలు ఆందోళనల ఫలితంగా 10మంది లోపు విద్యార్థులు పాఠశాలల మూతవేస్తాం. 10–19మధ్య ఉన్నత పాఠశాలల రోల్ పెరగకపోతే 2018–19 సం॥లో మూత వేస్తామంటూ ఇప్పుడే నిర్ణయించేశారు. ప్రాథమిక, యుపి పాఠశాలలు మూతపడితే ఆ తర్వాత సం॥లో ఫీడింగ్ లేక ఉన్నత పాఠశాలలు సైతం మూత పడతాయి. "ఓ పథకం ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు కథ ముగించనున్నారు".

మరోవైపు హాస్టల్స్ మూతవేస్తున్నారు. డిటెన్షన్ ప్రవేశపెట్టాలని ప్రతిపాదనలు వస్తున్నాయి. బయోమెట్రిక్, ఆధార్ అనుసంధానం పేరుతో బాలల సంఖ్య కుదిస్తున్నారు.

86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21(ఎ) అధికరణం ద్వారా 6–14 సం॥ల వరకు అంటే 1–8 తరగతుల వరకు బాలలకు విద్య ప్రాథమిక హక్కు. 2010 ఏప్రిల్ 1 నుండి విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చింది. అయిన మన రాష్ట్రంలో వేలాది స్కూల్సు మూతబడుతున్నాయి.

రేషనలైజేషన్ జిఓ 29 ద్వారా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మూతవేయడం బాలల ప్రాథమిక హక్కుకి భంగం కల్గించడమే!

బడి మూసేముందు ఆవాస ప్రాంతంలో బడి బయట బాలలు ఉన్నారేమో చూడాలి! బడి మూసేస్తే చదువుతున్న బాలలు వేరే గ్రామాలకు, బడులకు వెళతారా? లేదా? నిర్ధారించుకోవాలి. ఇవేవి పట్టించుకోరు. ఏకపక్షంగా పాఠశాలలు మూతవేస్తారు. ఉపాధ్యాయుల్ని తరలిస్తారు. ఒక్క కర్నూలు జిల్లా తప్ప అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయుల్ని సర్‌ప్లస్‌గా తేల్చారు. వాళ్ళందరిని ఏం చేయదలిచారు?

ప్రభుత్వ లెక్కలు ప్రకారమే ప్రాథమిక పాఠశాల స్థాయి బాలలు 28%మంది ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిలో బాలలు 33% మంది ఉన్నత పాఠశాలల స్థాయి బాలలు 42%మంది బడిబయట ఉన్నారు. వారి గురించి పట్టించుకోరు.

ఆంగ్ల మీడియం ప్రవేశపెట్టడం, సిసిఇ విధానంలో బోధన, నిరంతర మూల్యాంకనం, కంప్యూటర్ విద్య, ప్రాజెక్టులు దృష్టిలో వుంచుకొని మరిన్ని పోస్టులు పెంచాల్సిందిపోయి, ఉన్న పోస్టులు రద్దు చేయడం అంటే ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యం చేయడమే పాఠశాలల అభివృద్ధికి 10వేల కోట్లు మంజూరు చేస్తాం అని ముఖ్య మంత్రిగారు అనేకసార్లు ప్రకటనలు చేశారు. ఆ నిధులు ఏమైనాయో ఇంతవరకు రాలేదు. పాఠశాలల అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక ప్రకటించలేదు.

మరోవైపు ఎయిడెడ్ పాఠశాలల్లో దశాబ్దాలుగా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ కాకపోవడంతో టీచర్లు లేరని పిల్లలు వెళ్ళిపోయారు. ఇప్పుడు పిల్లలు లేరని ఉన్న ఉపాధ్యాయులను తొలగిస్తున్నారు.

మున్సిపల్ పట్టణాల్లో పెరిగిన జనాభాకనుగుణంగా పాఠశాలలు పెట్టకపోగా ఉన్న ఉపాధ్యాయుల్ని సర్‌ప్లస్‌గా తేల్చి కమీషనర్ పూల్‌లో పెట్టి బోధనేతర పనులకు ఉపయోగించనున్నారు.

ప్రభుత్వ విద్య బలహీనపరచడం కార్పొరేట్ విద్యను అందలం ఎక్కించడమే!

ప్రభుత్వ పాఠశాలల్ని రక్షించుకుకోవడంతోనే ఉపాధ్యాయుల భవిష్యత్ కూడా ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య మనుగడకు ప్రభుత్వ విద్యే పునాది. అందుకే ప్రభుత్వరంగాన్ని బలోపేతం చేయాలి.

పాఠశాలల మూతపై విస్తృత చర్చ జరగాలి. ప్రజల సహకారం తీసుకోవాలి. తల్లిదండ్రులు, దాతల సామాజిక కార్యకర్తల నుండి బలమైన సామాజిక మద్దతు కావాలి.

పై పై ప్రయోగాలు చేయడం కాదు. పాలకుల్లో రాజకీయ చిత్తశుద్ధి కావాలి. దీర్ఘకాలిక ప్రణాళికతో పటిష్టమైన వ్యవస్థ ఏర్పడాలి...

# 2017 పదవ తరగతి పరీక్షా ఫలితాలు – ఒక విశ్లేషణ



రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సమగ్ర మూల్యాంకన విధానంలో 10వ తరగతి పరీక్షలు మార్చి 2017లో జరిగాయి. ఈ పరీక్షల ఫలితాలు 80% బాహ్యమూల్యాంకనం ద్వారా, 20% అంతర్గత మూల్యాంకనంద్వారా నిర్ణయించారు. ఫలితాలు మే 6న మానవ వనరులశాఖామంత్రి విడుదల చేశారు. మొదటిసారి నూతన మూల్యాంకన విధానంలో పరీక్షలు జరిగినప్పటికి 91.92% ఫలితాలు సాధించడం విశేషం. ఈ పరీక్షా ఫలితాలను విశ్లేషించి పలు ఆసక్తికర విషయాలు తెలుసుకుందాం.

మార్చి 2017 ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్ మరియు ప్రైవేట్ విద్యార్థులు మొత్తంగా 6,22,538 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీటిలో రెగ్యులర్ విద్యార్థులు 6,09,502మందిలో 91.92% ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్గా హాజరులో 13036మందిలో 63.38% ఉత్తీర్ణత సాధించారు.

రెగ్యులర్ విద్యార్థులలో 4102 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించాయి. జిల్లా పరిషత్ పాఠశాలలు 89.23%, ప్రభుత్వ పాఠశాలలు 84.29%, ఏపి మోడల్ పాఠశాలలు 94.32%, మున్సిపల్ పాఠశాలలు 86.67%, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు 82.02% ఉత్తీర్ణత సాధించాయి.



**ఎన్.కుమార్ రాజా**
**ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు**

ప్రైవేట్ పాఠశాలల గరిష్టంగా 97.26% ఫలితాలు సాధించగా వాటిలో 2 పాఠశాలలు 0% ఫలితాలు సాధించాయి.

**జిల్లాల వారీగా ఫలితాలు**

| జిల్లా | మార్చి 2016 | మార్చి 2017 |
|---|---|---|
| శ్రీకాకుళం | 96.08 | 95.10 |
| విజయనగరం | 92.47 | 93.36 |
| విశాఖపట్నం | 94.70 | 93.69 |
| తూర్పుగోదావరి | 97.57 | 97.97 |
| పశ్చిమగోదావరి | 97.65 | 84.30 |
| కృష్ణా | 93.11 | 93.01 |
| గుంటూరు | 94.76 | 94.02 |
| ప్రకాశం | 90.59 | 91.78 |
| నెల్లూరు | 92.94 | 94.80 |
| చిత్తూరు | 90.11 | 80.55 |
| కడప | 98.89 | 95.02 |
| అనంతపురం | 94.57 | 88.48 |
| కర్నూలు | 94.20 | 93.40 |
| మొత్తం | 94.52 | 91.92 |

13 జిల్లాలలో తూర్పుగోదావరి జిల్లా 97.97%తో ప్రథమ స్థానంలో, చిత్తూరు జిల్లా 80.55%తో చివరి స్థానంలో నిలిచాయి.

**మేనేజిమెంట్ వారీగా ఫలితాలు**

| విభాగం | ఉత్తీర్ణత శాతం |
|---|---|
| ఎయిడెడ్ | 86.51 |
| బిసి వెల్ఫేర్ | 95.84 |
| ప్రభుత్వ | 84.29 |
| కెజిబివి | 91.00 |
| మోడల్ స్కూల్స్ | 94.32 |
| మున్సిపల్ స్కూల్స్ | 86.67 |
| ప్రైవేట్ | 97.26 |
| ఏపిఆర్ఎస్ | 96.37 |
| ఏపిఎస్డబ్ల్యుఆర్ఎస్ | 93.45 |
| ఏపిటిడబ్ల్యుఆర్ఎస్ | 82.02 |
| జెడ్పి | 89.23 |
| మొత్తం | 91.92 |

ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ఉన్నత పాఠశాలల్లో ఈ సంవత్సరం ఫలితాలు గత సంవత్సరంకంటే కొద్ది శాతం తగ్గాయి. శాశ్వత పర్యవేక్షణాధికారులు లేకపోవడం, కొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంఇఓలుగా అదనపు బాధ్యతలు నిర్వహించడం, సబ్జెక్ట్ టీచర్ల కొరత తదితర అంశాలు ఈ ఫలితాలపై కొంతమేరకు ప్రభావం చూపాయి. ఎయిడెడ్ పాఠశాలల్లో దీర్ఘకాలంగా సబ్జెక్టు టీచర్ల ఖాళీలు భర్తీ చేయకపోయినా, పదోన్నతులు కల్పించకపోయినా ఉన్న ఉపాధ్యాయులతో 86.51% ఫలితాలు సాధించడం హర్షనీయం.

ప్రైవేట్ పాఠశాలలు 97.26% ఉత్తీర్ణత సాధించిప్పటికి గత సంవత్సరంకంటే 0.32% ఉత్తీర్ణత తగ్గింది.

రాష్ట్ర ప్రభుత్వం అన్ని మేనేజిమెంట్ పాఠశాలలకు తగిన స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తే, తగినంతమంది ఉపాధ్యాయులను నియమిస్తే మరింత మంచి ఫలితాలు సాధించగలవని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి.

**100% ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు**

| యాజమాన్యం | మార్చి 2016 మొత్తం స్కూల్స్ | మార్చి 2016 100% స్కూల్స్ | మార్చి 2017 మొత్తం స్కూల్స్ | మార్చి 2017 వందశాతం ఉత్తీర్ణత పొందిన పాఠశాలలు |
|---|---|---|---|---|
| ప్రభుత్వం | 558 | 136 | 558 | 117 |
| జిల్లా పరిషత్తు | 4374 | 1319 | 4392 | 1181 |
| మోడల్ స్కూల్ | 148 | 56 | 148 | 61 |
| మున్సిపల్ | 315 | 24 | 316 | 22 |

| | | | | |
|---|---|---|---|---|
| రెసిడెన్షియల్ స్కూల్స్ | 264 | 127 | 44 | 27 |
| సోషల్‌వెల్ఫేర్ స్కూల్స్ | 156 | 52 | 169 | 52 |
| ట్రైబల్ స్కూల్స్ | 148 | 38 | 157 | 30 |
| కెజిబివి | – | – | 172 | 56 |
| బిసి వెల్ఫేర్ | – | – | 25 | 12 |
| ఎయిడెడ్ స్కూల్స్ | 428 | 75 | 416 | 65 |
| ప్రైవేట్ స్కూల్స్ | 4550 | 2390 | 4736 | 2479 |
| **మొత్తం** | **10941** | **4217** | **11143** | **4102** |

నూరుశాతం ఫలితాలు సాధించిన పాఠశాలల సంఖ్య ఈ సంవత్సరం 4102. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 100% ఫలితాలు సాధించిన పాఠశాలల సంఖ్య గత సంవత్సరంతో పోలిస్తే కొద్దిగా తగ్గింది. ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాల ఫలితాలలోను పెద్దగా మార్పులేదు. ఎయిడెడ్ పాఠశాలల సంఖ్య తగ్గినట్లుగా గమనించవచ్చు. ఈ సంవత్సరం కొత్తగా ప్రారంభించిన కస్తూరిబా పాఠశాలలు, బిసి వెల్ఫేర్ పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తే ఆ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించగలవు.

**10 జిపిఏ సాధించిన విద్యార్థులు**

| పాఠశాలలు | హాజరైన విద్యార్థులు | 10 జిపిఏ పొందిన వారు |
|---|---|---|
| ఎయిడెడ్ | 21689 | 123 |
| బిసి వెల్ఫేర్ | 1370 | 6 |
| ప్రభుత్వ | 35436 | 44 |
| కెజిబివి | 6001 | 2 |
| మోడల్ స్కూల్స్ | 9590 | 153 |
| మున్సిపల్ స్కూల్స్ | 24333 | 49 |
| ప్రైవేట్ | 231499 | 17209 |
| ఏపిఆర్ఎస్ | 1486 | 3 |
| ఏపిఎస్‌డబ్ల్యుఆర్ఎస్ | 11985 | 15 |
| ఏపిటిడబ్ల్యుఆర్ఎస్ | 7448 | 2 |
| జెడ్‌పి | 258665 | 619 |
| **మొత్తం** | **609502** | **18225** |

ఈ సంవత్సరం గ్రేడ్ యావరేజ్ పాయింట్లు (జిపిఏ) పొందిన విద్యార్థుల సంఖ్య గతయేడాదికంటే గణనీయంగా పెరిగింది.

**సామాజిక వర్గాల వారీగా ఉత్తీర్ణత**

| సామాజిక వర్గం | హాజరు | ఉత్తీర్ణులు | శాతం |
|---|---|---|---|
| ఓసీ | 150125 | 143318 | 95.47 |
| ఎస్సీ | 116575 | 102801 | 88.18 |
| ఎస్టీ | 29685 | 24871 | 83.78 |
| బీసీ | 313117 | 289263 | 92.38 |
| **మొత్తం** | **609502** | **560253** | **91.92** |

సామాజిక వర్గాలవారీగా ఫలితాలు 83% నుండి 95%గా వున్నాయి. గురుకుల, సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ, కెజిబివి, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల్లో సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటే, ఆయా సామాజిక వర్గాల ఉత్తీర్ణత శాతం ఇంకనూ మెరుగుపరచవచ్చు.

**సబ్జెక్టులవారీ ఉత్తీర్ణత**

| భాష | హాజరైన విద్యార్థులు | ఉత్తీర్ణత | శాతం |
|---|---|---|---|
| తెలుగు | 609320 | 605092 | 99.31 |
| హిందీ | 608935 | 608610 | 99.95 |
| ఇంగ్లీష్ | 608885 | 603213 | 99.07 |
| గణిత శాస్త్రం | 609394 | 569159 | 93.40 |
| సామాన్యశాస్త్రం | 609362 | 595198 | 97.68 |
| సాంఘీకశాస్త్రం | 609340 | 607240 | 99.66 |

సబ్జెక్టులవారీ ఉత్తీర్ణత శాతమును పరిశీలిస్తే ఈ సంవత్సరం కూడా అన్ని సబ్జెక్టులలో 93% నుండి 99% వరకు ఫలితాలు వచ్చాయి. ప్రథమ స్థానంలో హిందీ తర్వాత వరుసగా సోషల్, తెలుగు, ఇంగ్లీషు, సైన్సు, గణితం న్నాయి. ఈ సంవత్సరం సిసిఇ మోడల్ నూతనంగా ప్రవేశపెట్టడం వలన గత సంవత్సరంకంటే ఇంగ్లీషులో 0.92%, సోషల్ 0.12%, గణితంలో 3.76% తగ్గుదల ఉంది. తెలుగులో 0.84%, హిందీలో 0.01%, సైన్సులో 0.01% పెరుగుదల ఉంది.

**మీడియం వారీ ఉత్తర్ణత**

| మీడియం | హాజరైన విద్యార్థులు | ఉత్తీర్ణులు | శాతం |
|---|---|---|---|
| తెలుగు | 269666 | 233127 | 86.45 |
| ఆంగ్లం | 335204 | 322853 | 96.32 |
| ఉర్దూ | 2679 | 2419 | 90.29 |
| హిందీ | 9 | 9 | 100 |
| ఒరియా | 1057 | 1026 | 97.07 |
| తమిళం | 403 | 339 | 84.12 |
| కన్నడ | 484 | 480 | 99.17 |
| **మొత్తం** | **609502** | **560253** | **91.92** |

మీడియంవారీ ఉత్తీర్ణతను పరిశీలిస్తే ఇంగ్లీషు మీడియం ఉత్తీర్ణత శాతంలో ముందుంది. పరీక్షవ్రాసిన 6,09,502మంది విద్యార్థు లలో 3,35,204మంది ఇంగ్లీషు మీడియం విద్యార్థులే వారిలో 96.32% ఉత్తీర్ణత, తర్వాత స్థానంలో తెలుగు మీడియం వారు 86.45% ఉన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో స్టాఫ్ ప్యాట్రన్ మీడియం వారీగా నియమిస్తే మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

మొత్తం మీద గత సంవత్సరం ఫలితాలలో ఈ సంవత్సరం ఫలితాలను పోలిస్తే కొద్దిగా తగ్గినట్లుగా కనిపిస్తాయి. సిసిఇ విధానం నూతన మూల్యాంకన విధానాలపై పట్ల విద్యార్థులలో పూర్తిగా అవగాహన లేకపోవడం, నూతన మూల్యాంకనా విధానంపై ఉపాధ్యాయులకు పూర్తి స్థాయి శిక్షణ కల్పించకపోవడం, పాఠశాలల్లో మీడియం ప్రకారం తగినస్టాఫ్ ప్యాట్రన్ లేకపోవడం వంటి కారణాలు ఈ ఫలితాలపై ప్రభావం చూపినట్లుగా భావించవచ్చును. ఈ సమస్యలను పరిష్కరించడంతోపాటు సర్వీసు రూల్సు సమస్యను తక్షణమే పరిష్కరించి, ఉన్నత విద్యాశాఖాధికారుల, మండల విద్యాశాఖాధికారుల పోస్టులు భర్తీ చేయటం, విద్యాహక్కు చట్టం మేరకు తగిన విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిలో సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించడంవంటి చర్యలు చేపట్టడం ద్వారా వచ్చే విద్యా సంవత్సరం మంచి ఫలితాలు సాధించవచ్చు. ఈ దిశగా ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో సంస్కరణల చేపట్టి ప్రభుత్వ విద్యారంగ వికాసానికి దోహదపడుతుందని ఆశిద్దాం.

# ఉపాధ్యాయ బదిలీ నిబంధనలు

విద్యా సంవత్సరం ముగిసిన వెంటనే పాఠశాలల రేషనలైజేషన్ పూర్తిచేసి ఉపాధ్యాయ బదిలీలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. డ్రాఫ్టురూల్సు విడుదలచేసి ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు కూడా జరిపింది. కాని సకాలంలో బదిలీలు చేయకుండా స్వప్రయోజనాలకోసం అర్రులు జాచేవారిని ప్రోత్సహిస్తూ అక్రమ బదిలీలకు తెరతీసింది. అక్రమ బదిలీలకు నిరసనగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు 2 రోజులు నిరాహారదీక్ష చేయడం, వారికి మద్ధత్తుగా జిల్లాలలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. చివరకు జిఓ ఎంఎస్ నం.31; తేది.31.05. 2017 ద్వారా ఉపాధ్యాయ బదిలీలకు ఉత్తర్వులు వెలువడ్డాయి. వాటిలో అసంబద్దాలపై రిప్రజెంట్ చేయగా సవరిస్తూ జిఓ ఎంఎస్ నం.32; తేది.04.06.2017 ఉత్తర్వు విడుదల చేశారు.



కెఎస్ఎస్ ప్రసాద్
యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి

వీటి ప్రకారం గవర్నమెంట్, పంచాయితీరజ్ పాఠశాలల్లో 31.12. 2016 నాటికిగల యు-డైస్ రోలు ఆధారంగా పాఠశాలలను, ఉపాధ్యాయ పోస్టులను క్రమబద్ధీకరించి బదిలీలు చేబడతారు.

**1) బదిలీలకు ప్రాతిపదిక :**

1. 30.06.2017 నాటికి ప్రస్తుతము పనిచేస్తున్న పాఠశాలల్లో కనీసం 2 సం॥ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకొనుటకు అర్హులు.
2. విద్యా సంవత్సరం చివరి నాటికి 8 విద్యా సం॥ల సర్వీసు పూర్తిచేసిన ఎస్‌జిటి, ఎస్ఏ తత్సమాన కేడర్ల ఉపాధ్యాయులు (అనగా 17.11.2009 ముందు చేరినవారు), 24.04.2017 నాటికి 5 సం॥ల సర్వీసు పూర్తిచేసి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ చేయబడతారు. విద్యా సంవత్సరంలో సగంకంటే ఎక్కువకాలం పనిచేసినట్ల యితే విద్యా సంవత్సరం మొత్తం పూర్తిచేసినట్లుగా పరిగణించ బడుతుంది.
3. విలీనం వలన మూతపడిన పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విలీనం అయిన పాఠశాలకు వెళ్ళవచ్చును. లేదా వేరొక పాఠశాలకు వెళ్ళదలిస్తే బదిలీకి అప్లై చేసుకోవచ్చు. రేషనలై జేషన్‌లో పోస్టు రద్దు అయినప్పుడు ఆ పాఠశాలకు 8 అకడమిక్ సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయుడుంటే ఆ ఉపాధ్యాయుడిని బదిలీ చేస్తారు. లేకుంటే సర్వీసు జూనియర్ ఉపాధ్యాయుని బదిలీ చేస్తారు. సీనియర్ విల్లింగ్ ఆయనను రేషనలైజేషన్‌లో బదిలీకి అనుమతిస్తారు. రేషనలైజేషన్‌కు గురి అయినవారు తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత తనిఖీ అధికారి ధృవీకరించిన డిక్లరేషన్ జత పరచాలి.
4. బాలికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న 50 సం॥లోపు పురుష ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి.

**మినహాయింపులు :**

1. 30.06.2017 నాటికి 2 సం॥లోపు రిటైరు అయ్యేవారు దరఖాస్తు చేసిన తప్ప బదిలీ చేయబడరు.
2. అంధులైన ఉపాధ్యాయులకు కూడా దరఖాస్తు చేస్తేతప్ప బదిలీ చేయని విధంగా మినహాయింపు ఇవ్వడింది.
3. ఒక పాఠశాలలో అన్ని క్యాడర్‌లలో పనిచేసిన సర్వీసు బదిలీలకు పరిగణనలోకి తీసుకొనబడుతుంది.
4. తగినంతగా మహిళా ఉపాధ్యాయినులు లభ్యం కానప్పుడు 30.04.2017 నాటికి 50 సం॥ల వయస్సు దాటిన పురుష ఉపాధ్యాయులను బాలికోన్నత పాఠశాలల్లో నియమిస్తారు.
5. ఎన్‌సిసి అధికారులుగా పనిచేస్తున్న ప్రధానోపాధ్యా యులు 5 సం॥ల సర్వీసు, ఉపాధ్యాయులు 8 విద్యా సం॥ల సర్వీసు పూర్తి చేసినట్లయితే వారిని మరొక ఎన్‌సిసి యూనిట్ ఉన్న పాఠశాలలోనే నియమిస్తారు. మరొక పాఠశాల లభ్యం కానప్పుడు ఉపాధ్యాయుని అభ్యర్ధనపై అదే పాఠశాలలో కొనసాగిస్తారు.
6. ఉర్దూ, తమిళం, కన్నడం, ఒరియా ప్రథమ భాషగా చదివిన వారికి సంబంధిత మీడియం కలిగిన పాఠశాలల్లో నియమిం చేందుకు ప్రాధాన్యతనిస్తారు.
7. సాధారణంగా ఏ మేనేజిమెంట్లలో పనిచేస్తున్నవారు ఆయా మేనేజిమెంట్లలో ఖాళీలనే కోరుకోవలసి వుంటుంది. అయితే ఇతర మేనేజిమెంట్లలో పనిచేస్తున్నవారు తమ స్వంత మేనేజి మెంట్లకు బదిలీ కోరుకొనదలచినట్లయితే ఆ మేనేజిమెంటు లోని ఖాళీలను మాత్రమే ఎంచుకోవాలి.
8. ఏజెన్సీలో పనిచేస్తున్న షె.త.ఉపాధ్యాయులు మినహా మిగిలిన వారు ఏజెన్సీ నుండి మైదాన ప్రాంతానికి, మైదాన ప్రాంతం నుండి ఏజెన్సీకి బదిలీకి దరఖాస్తు చేసుకొనవచ్చు.
9. జిఓ ఎంఎస్ నం.3 ట్రైబల్‌వెల్ఫేర్; తేది.10.01.2000 ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో షె.త.కు చెందిన ప్రధానోపా ధ్యాయులు/ఉపాధ్యాయులను మాత్రమే నియమించవలసి యుంది. అయితే గిరిజన విద్యార్ధులకు నిరంతరాయంగా బోధన కలిగించే నిమిత్తం ఏజెన్సీ ప్రాంతంలో పనిచేసేందుకు మైదాన ప్రాంతంలోని ఉపాధ్యాయులను బదిలీలకు అనుమతి స్తారు. అయితే వారికి 2 సం॥ల కాలపరిమితి విధించబడింది. వారు పనిచేసే పోస్టు గిరిజన ఉపాధ్యాయులతో భర్తీ చేయ బడినా లేక 2 సం॥ కాలపరిమితి పూర్తయినా వారిని తిరిగి మైదాన ప్రాంతాలకు బదిలీ చేస్తారు.
10. బదిలీలు ముగిసిన పిదప కూడా ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీలు ఉన్నట్లయితే జిల్లాలో సర్‌ప్లస్‌గా యున్న ఉపాధ్యాయులను తాత్కాలిక డెప్యుటేషన్ ప్రాతిపదికన బదిలీలు ముగిసిన 15 రోజులలోపు వర్కు అడ్జస్టుమెంట్ చేస్తారు.

**2. దరఖాస్తు చేసుకోవలసిన విధం :**

1. బదిలీలు వెబ్ కౌన్సిలింగ్ పద్ధతిలో జరుగుతాయి. వీటికి దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.
2. ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను, తాము ఎంచుకున్న ఖాళీల ఆప్షన్లను ఆన్‌లైన్‌లోనే నమోదు చేయవలసివుంటుంది.
3. తప్పనిసరి బదిలీ కావాల్సిన వారు దరఖాస్తు చేయకున్నా, వెబ్‌నందు ఆప్షన్ ఇవ్వకపోయినా సదరు ఉపాధ్యాయినీ జిల్లాలో మిగిలిన ఖాళీలలో కేటగిరీ-3 లేదా 4 ప్రాంతాలకు బదిలీ చేస్తారు.
4. దీనికి సంబంధించిన షెడ్యూలును పాఠశాల విద్యా సంచాలకులు విడుదల చేస్తారు.

**3. ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు :**

**1. పాఠశాల కేటగిరి పాయింట్లు :** (సం॥కి 2 పాయింట్లకు మించకుండా గరిష్టంగా 16 పాయింట్లు)

ఎ) కేటగిరి-4 ఏరియాలో ప్రతీ సం॥ సర్వీస్‌కు - 2
బి) కేటగిరి-3 (12% హెచ్ఆర్ఏ) ఏరియాలో ప్రతీ సం॥ సర్వీస్‌కు - 1
సి) కేటగిరి- 2 (14.5% హెచ్ఆర్ఏ) ఏరియాలో ప్రతీ సం॥ సర్వీస్‌కు - 0.5
డి) కేటగిరి- 1 (20% హెచ్ఆర్ఏ) ఏరియాలో ప్రతీ సం॥ సర్వీస్‌కు - 0

**గమనిక :** పంచాయతీరాజ్ (ఇంజనీరింగు) విభాగం వారి నిబంధనల ప్రకారం 12% హెచ్ఆర్ఏ కలిగి అన్ని కాలములలోను ప్రధాన రహదారితో సంబంధం ఉండని ప్రాంతాలను కేటగిరి-4 ఏరియాగా పరిగణిస్తారు. అట్టి ప్రాంతాలను గుర్తించిన జాబితాను పంచాయతీరాజ్ డిపార్టుమెంట్ సూపరింటెండింగు ఇంజనీరు వారిని సంప్రదించి జిల్లా కలెక్టర్ విడుదల చేస్తారు. అదియే తుది జాబితాగా పరిగణించబడుతుంది.

**2. సర్వీసు పాయింట్లు :** (గరిష్టం 12 పాయింట్లు)

ఏప్రిల్ 30నాటికి అన్ని కేటగిరీలలో పనిచేసిన మొత్తం సర్వీసు సంవత్సరానికి 0.5 పాయింట్లు చొప్పున 12 పాయింట్లకు మించకుండా కేటాయించబడతాయి.

**3. స్పెషల్ పాయింట్లు :**

1. గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులకు - 5
2. అవివాహిత ఉపాధ్యాయినులు - 5
3. భార్య / భర్త కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా (లేదా) స్థానిక సంస్థలు / ఎయిడెడ్ / ఏపి మోడల్ స్కూల్స్‌లో ఉద్యోగిగా సంబంధిత జిల్లా / జోన్ (లేదా) జిల్లాకు ఆనుకొని యున్న ప్రక్క జిల్లా మండలం / డివిజన్‌లో పనిచేస్తున్నవారు - 5

**గమనిక :** 1) ఈ సదుపాయం ప్రధానోపాధ్యాయులకు 5 సం॥లు / ఉపాధ్యాయులు 8 సం॥లకొకసారి మాత్రమే కల్పిస్తారు. రేషనలైజేషన్‌కు గురిఅయి 5/8 సం॥లు సర్వీస్ పూర్తి కానట్లయితే మరొకసారి వినియోగించుకోవచ్చు.)

2) ఈ వివరాలను సర్వీసు రిజిష్టరులో నమోదు చేయాలి. సంబంధిత అధికార ధృకరించిన చెక్‌లిస్టును జతపరచాలి)

4. ఎన్‌సిసి అధికారి / భారత స్కౌట్స్ & గైడ్స్‌గా పనిచేస్తూ 5/8 సం॥ల సర్వీసు పూర్తి చేసినవారు - 2
5. 2 సం॥ల కాలపరిమితితో ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయుటకు అంగీకరించినవారు (ఇట్టివారు తమ మొదటి 5 ఆప్షన్లు ఏజెన్సీ ప్రాంతాలను ఎంచుకోవాలి) - 2
6. ఏపి నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్‌లో రిజిష్టరు చేయించుకున్న వారు - 1
7. రేషనలైజేషన్‌కు గురి అయినవారు - 2

**గమనిక :** 1) ఈ పాయింట్లు 5/8 సం॥ల సర్వీసు పూర్తయిన వారికి వర్తించవు. 2) రేషనలైజేషన్‌కు గురైన వారు బదిలీలకు దరఖాస్తు చేయనట్లయితే బదిలీలు ముగిసిన పిదప మిగిలిన కేటగిరి-3,4 ప్రాంతాలలోని ఖాళీలను కేటాయిస్తారు)

**4. ఫర్‌ఫార్మెన్స్ పాయింట్లు :**

**I. పాఠశాల సంబంధమైనవి :**

1. డిసెంబరు 31 నాటికి గల గత 2 సం॥ల యు-డైస్ రోలు ఆధారంగా పాఠశాలలో నమోదు వృద్ధి 10%- 20% ఉంటే (హెచ్ఎంకు, ఉపాధ్యాయ సిబ్బందికి) - 6
2. గడచిన 2 సం॥ల యు-డైస్ ఆధారంగా 100% ట్రాన్సిషన్ జరిగితే అనగా 1-2, 2-3, 3-4, 4-5, 5-6, 6-7, 7-8, 8-9 తరగతులకు (హెచ్ఎంకు, ఉపాధ్యాయ సిబ్బందికి) - 5
3. గడచిన 2 సం॥లలో సిసిఇ మరియు ఇతర పద్ధతుల ద్వారా మదింపు చేయగా విద్యార్థులు పొందిన మార్కులు, తరగతిలోని విద్యార్థులలో
   80% మందికి, ఆపైన బి2 గ్రేడ్ పొందితే - 6
   50%-80% మంది బి2 గ్రేడ్ పొందితే - 4
   25%-50% మంది బి2 గ్రేడ్ పొందితే - 2
4. ఎస్ఎస్‌సి పరీక్షా ఫలితాలు (హెచ్ఎంకు మాత్రమే)
   95%-100% - 6
   85%-94.99% - 4
   50%-84.99% - 2
5. ఎన్ఐసి డేటా ప్రకారం బియ్యం కొరకు ఎండిఎం ఇండెంట్ సకాలంలో ఆన్‌లైన్‌లో పొందుపరిచిన ప్రధానోపాధ్యాయులకు
   90% కంటే ఎక్కువ సందర్భాలు - 2
   80%-89.99% ఎక్కువ సందర్భాలు - 1
6. రోజువారీ మధ్యాహ్న భోజన పథక వివరాలు ఏపిపి/ ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేసిన వారు (పాఠశాల పని దినాలలో మాత్రము)
   90%కంటే ఎక్కువ సందర్భాలు - 2
   80%-89.99% ఎక్కువ సందర్భాలు - 1

**II. వ్యక్తిగత సంబంధమైనవి :**

1. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీతలు - 6
2. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు - 5
   (పై వారికి 5/8 సం॥లకొక పర్యాయం మాత్రమే)

3. గడచిన 2 సం॥లలో సిసిఇ మరియు ఇతర పద్ధతుల ద్వారా మదింపు చేయగా విద్యార్థులు పొందిన మార్కులు ఆధారంగా

80%కంటే ఎక్కువ మంది బి2 గ్రేడ్ పొందితే - 6

50%-80% మంది బి2 గ్రేడ్ పొందితే - 4

25%-50% మంది బి2 గ్రేడ్ పొందితే - 2

4. ఎస్ఎస్‌సి పరీక్షా ఫలితాలు సంబంధిత సబ్జెక్టులో ఉత్తీర్ణులైన విద్యార్థులు

90%-99.99% ఉత్తీర్ణత - 5

80-89.99% ఉత్తీర్ణత - 3

5. ఎస్ఏఏపి / ఎస్‌జిఎఫ్ / ప్రభుత్వ గుర్తింపు - 6 పొందిన సంస్థలు నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి ఆటల పోటీలలో విద్యార్థులు పాల్గొనినట్లయితే

ఎ) ఈ పాయింట్లు సంబంధిత హెచ్ఎం మరియు పిఇటిలకు మాత్రమే)

బి) రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు నిర్వహించిన ఇన్స్‌ఫెర్ / సైన్స్‌ఫెయిర్ / ఎగ్జిబిషన్‌లో పాల్గొనుట. (హెచ్ఎం మరియు సంబధిత ఉపాధ్యాయునికి 6 పాయింట్లు)

**5. పాయింట్లు సమానంగా వచ్చిన సందర్భంలో :**

పాయింట్లు సమానంగా వచ్చిన సందర్భంలో మొదట కేడర్‌లో సీనియర్, తరువాత పుట్టినతేదీ, తదుపరి మహిళ ఈ క్రమంలో సీనియార్టీని ఉంచుతారు.

**6. ప్రిఫరెన్షియల్ క్యాటగిరీ :**

(1) 70%పైబడిన వైకల్యం కలిగిన వికలాంగులు, (2) భర్త మరణించిన మహిళా ఉపాధ్యాయులు, (3) విడాకులు పొందిన మహిళా ఉపాధ్యా యులు, (4) కేన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్ టిబి, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌పలేషన్ / డయాలసిస్ మొ॥ వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులు, (5) మెంటల్లీ రిటేర్డ్ అయి ఉండి ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఆధారితులు కల ఉపాధ్యాయులు, (6) ఉపాధ్యాయుల పిల్లలకు పుట్టుకతో గుండెలో హోల్స్ ఉండి వారు చికిత్సకు కావలసిన ప్రదేశాలకు బదిలీ కోరుకునే వారికి, (7) ఉపాధ్యాయుల పిల్లలు జువెనీల్ దయాబెట్స్, తలసెమియా డిసిస్, హెూమోపిలాయ్ డిసిస్ బాధపడుతున్నవారిని, (8) స్పౌజ్ సైనికులైన వారిని ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఉంచుతారు.

ప్రధానోపాధ్యాయులు గ్రేడ్-2 అయితే 5 సం॥లు ఉపాధ్యాయులైతే 8 సం॥ల లోబడి స్పెషల్ పాయింట్స్, ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపయోగించుకొనకుండా ఉండాలి. అయితే రేషనలైజేషన్ నందు ఎఫెక్ట్ అయిన ఉపాధ్యాయులకు రేషనలైజేషన్ పాయింట్లతో పాటు ఈ పాయింట్లు కూడా వర్తిస్తాయి.

**7. సీనియార్టీ లిస్టు :**

పదవీ విరమణ ద్వారా ఏర్పడిన ఖాళీలు, తప్పనిసరి బదిలీ ద్వారా ఏర్పడిన ఖాళీలు, ఒక సంవత్సరం పైబడి అనధికార సెలవులో ఉన్న ఖాళీలు, ఏజెన్సీలో భర్తీ కానివి, స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ అయిన భాషా పండితుల పోస్టులు, ఇటీవల ఎంఇఓలుగా కోరుకున్న ప్రధానోపాధ్యాయులు ఖాళీలను మరియు బదిలీకి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు పనిచేస్తున్న స్థానాలు వెబ్‌నందుంచుతారు.

ఒక నెల పైబడి సెలవులో ఉన్న ఉపాధ్యాయుల ఖాళీలను పని సర్దుబాటు ద్వారా భర్తీ చేస్తారు.

రేషనలైజేషన్ పూర్తయిన తరువాత కన్సాలిడేషన్ కాని సింగిల్ టీచర్ స్కూళ్ళకు అదనంగా రెండవ పోస్టును కేటాయిస్తారు.

కేటగిరీ వారీగా పాఠశాలల వివరాలు, పాఠశాలల ఖాళీ వివరాలు, బదిలీకి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల వారికొచ్చిన పాయింట్ల ఆధారంగా జాబితా మొదలగునవి వెబ్‌నందుంచుతారు. అలాగే ఆర్‌జెడి / డిఇఓ కార్యాలయం వద్ద డిస్‌ప్లే చేస్తారు.

**8. అభ్యంతరాలు, అప్పీల్, రివిజన్, కమిటీలు మొ॥ :**

సీనియార్టీ జాబితాపై ఏ విధమైన అభ్యంతరాలున్నా ఆన్‌లైన్ ద్వారా సంబంధిత ధృవపత్రాలతో సమర్పించాలి. వాటిని సంబంధిత అధికారులు సరిచేసి వెబ్‌నందుంచాలి.

కేటగిరీ వారీగా యాజమాన్యం వారీగా కౌన్సిలింగ్ మరియు పోస్టింగ్ ఆర్డర్స్ కొరకు కొన్ని కమిటీలను ఏర్పరిచారు.

బదిలీ ఆర్డర్ వచ్చిన వారంరోజులలోపు నూతనంగా కేటాయించబడిన పాఠశాలలో చేరాలి. పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులలో 50% మందిని మాత్రమే రిలీవ్ చేస్తారు. మిగిలినవారిని ప్రత్యామ్నాయం వచ్చిన తరువాత రిలీవ్ చేస్తారు. బదిలీల కౌన్సిలింగ్ పూర్తయిన 15 రోజులలోపు పనిసర్దుబాటు చేస్తారు.

అధీకృత అధికారి ఇచ్చిన బదిలీ ఆర్డర్‌పై వారి పై అధికారికి ఏవైనా అభ్యంతరాలు అప్పీల్ చేసుకోవచ్చును. ఆర్డర్ వచ్చిన 10 రోజులలో అప్పీల్ చేసుకోవాలి. సదరు అప్పీలేట్ అధికారి ఆ అభ్యంతరాన్ని 15 రోజులలోపు పరిష్కరించాలి.

ఇంకా అభ్యంతరాలుంటే పాఠశాల విద్యా సంచాలకులు సుమోటోగా అభ్యంతరాన్ని నాలుగు వారాల్లోగా రివిజన్ చేయవచ్చును.

మొత్తం ఈ బదిలీల ప్రక్రియలో ఏ విధమైన తప్పుడు సమాచారాన్నిచ్చినా సంబంధిత ఉపాధ్యాయులపై / అధికారులపై సిసిఏ రూల్స్ అనుసరించి చర్యలు తీసుకోబడతాయి.

**ముగింపు :**

వెబ్‌కౌన్సిలింగ్ ఎత్తివేస్తామని ఫర్‌ఫార్మెన్స్ పాయింట్లు తగ్గిస్తామని ఉపాధ్యాయ సంఘాలకు మంత్రివర్యులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. వెబ్‌కౌన్సిలింగ్‌కు వ్యతిరేకంగా ఫ్యాప్టో-జాక్టో పెద్దఎత్తున ఆందోళన చేసినా విద్యాశాఖ మొండిగా వెబ్‌కౌన్సిలింగ్ కొనసాగిస్తూ బదిలీల షెడ్యూలు విడుదల చేయడం చాలా అన్యాయం.

ఈ నెల 11వ తేదీవరకు ఆర్ఎంఎస్ఏ, ఎస్ఎస్ఏ ట్రైనింగ్స్‌లో టీచర్లు ఉంటారు. 12వ తేదీన స్కూలు పున:ప్రారంభం రోజు తప్పనిసరిగా పాఠశాలకు హాజరుకావాల్సి ఉంది.

టీచర్లు జూన్ 9 నుండి 12లోగా అప్లికేషన్ పెట్టాలంటే ఫర్‌ఫార్మెన్స్ పాయింట్లకు చెందిన ఆధారాలు పాఠశాల రికార్డుల్లో ఉంటాయి. ఇవన్నీ ఎప్పుడు భర్తీ చేయాలి, ఎప్పుడు అప్లై చేయాలి అధికారులే తెలపాలి. అప్లికేషన్ కన్ఫర్మేషన్‌గాని, వెబ్ ఆప్షన్స్‌కి కాని ఇచ్చిన సమయం చాలా తక్కువగా ఉంది. సుమారు లక్షమంది ఒకేసారి సిఎస్ఇ వెబ్‌సైట్‌లో ప్రవేశించి ఆప్షన్ ఇవ్వడమంటే సర్వర్ డౌన్ అయ్యి గత కౌన్సిలింగ్‌లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అధికారులకు అందుబాటులో ఉన్నట్లు నెట్‌సౌకర్యం క్రిందిస్థాయిలో ఉండదనే విషయం అవగాహనలో ఉంచుకోవాలి.

వేసవి సెలవులలో నిర్వహించాలని గత 5 నెలలుగా ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు ఉపాధ్యాయులకు ఆందోళన కలిగేలా షెడ్యూలు ఇవ్వడం సరైందికాదు. తగినంత సమయం ఉండేలా షెడ్యూల్ మార్పుచేయాలి.

# పుణ్యం

పి.మనోజ
గూడవల్లి, కృష్ణ జిల్లా

సెలవు దొరక్క ఆఖరి రోజు కారు తీసాను నాకంతగా నమ్మకం లేకపోయినా పెద్దదైపోయిన అమ్మ కోసం.

అమ్మా ఆఖరి రోజు అంత హైజీనిటీ ఉండదు, రద్దీ కూడా విపరీతంగా ఉండచ్చు మరి నువ్వు తట్టుకోగలవా అని నా అనుమానం అని నేనంటే వచ్చే పుష్కరాలకి నేనుంటానంటావా సాయీ, కాస్త ఓపిక చేసుకొని పోయి రావటమే అని ఓ తిరుగు లేని డౌటు ద్వారా ఈ ప్రయాణం సాధించుకుంది. నా భావాలు వేరైనా అమ్మ కోరిక మన్నించాలి కదాని ఇలా బయలుదేరాం. రావుల పాలెం నుండి తణుకు వరకూ బాగానే సాగిన ప్రయాణం అక్కడి నుండి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంది. రోడ్ రద్దీలను క్లియర్ చేయటానికి పోలీసు వారు పడే కష్టం చూసి అబ్బా నాదెంత రిలాక్స్ జాబ్ అని ఆనందించాను.

బయట ఎండ మండిపోతుంది. నాకు టెన్షన్‌గానే ఉంది. అమ్మ నీ రద్దీలో జాగ్రత్తగా తీసుకుని వెళ్ళి దుర్గమ్మ దర్శనమూ చేయించి తేగలనా అని..."అరే నాన్నా, పుష్కరుడున్న నీళ్ళు బాటిల్లో పట్టడం మర్చిపోక మామయ్య, పిన్ని వాళ్ళకివ్వాలి సుమా" ఆరోసారి గుర్తు చేసింది అమ్మ. ఎలాగోలా గన్నవరం దాటేం. గూడవల్లి చేరేసరికి ట్రాఫిక్ బిగుసుకుపోయి, అతిమెల్లగా జారే లావాలా సాగుతోంది వాహనవరుస. అంతా పడవల్లాంటి కార్లే కొనేసరికి ట్రాఫిక్ సముద్రంగా మారటంలో వింతేముందీ... గంటనించీ ట్రాఫిక్ నిలిచి పోయింది. డివైడర్ పక్కనే ఉన్న నాకు అక్కడ మొక్కల మధ్యన పదేళ్ళ పిల్లాడిని పడుకోబెట్టి ఏడుస్తున్న ఓ స్త్రీ కనిపించింది. ఎన్నో కార్లు కిక్కిరిసి ఉన్నాయి. ఎవరికీ కారు దిగివెళ్ళే తీరికా, ఉత్సుకతా లేవో, ట్రాఫిక్లో కారొదిలి వెళితే ఎలా అనో... అయినా ఎవరినో అనటం ఏలా అని నేను దిగి వెళ్ళొచ్చి అమ్మకి చెప్పాను. ఇక్కడికి పనులకోసం వచ్చారంటమ్మా... వాడు ఇక్కడి వరకూ నడిచి ఎండకి సోషొచ్చి పడిపోయాడట... స్పృహలో లేడు పాపం. చెప్పటం పూర్తయినా నా ముఖాన్నే చదువుతూంది అమ్మ...ఏదో వెతుకుతూ .... విండోలోంచి ఆ తల్లీ బిడ్డలని చూసింది. "సాయీ...సిగ్నల్ ఎంతదూరంరా"?

"అదిగో అమ్మా కనపడేదే" "వెళ్ళు...వాళ్ళని తీసుకురా. ఏదోక డాక్టర్‌కి చూపిద్దాం"

ఎవరోకరు పోలీసులకు చెప్పే ఉంటారు లేమా... 108 వస్తూండచ్చూ. మనకసలే టైము లేదుగా అన్నాను. "గంట నుంచీ ఉన్నాం ఇక్కడ ... అటూ అదే పరిస్థితి అయుంటుందిలే పో ... ప్రత్యక్షంగా చేయాల్సిన పుణ్యం వదిలేసి, నీళ్ళలో పుణ్యం కోసం ఏం పరిగెడతాం గానీ వెళ్ళరా". "అందమ్మ.

క్షణంలో వాళ్ళని కారులోకి తెచ్చేసి అతి కష్టంపై సిగ్నల్ దగ్గర యు టర్న్ తీసుకొని గన్నవరం వైపు పరుగులు పెట్టించా వాహనాన్ని. అమ్మ "ఏం కాదులే ..... ఏడవక. మీ ఆయన లేడా.... డబ్బులు ఎన్నున్నాయ్.... జరుగు బాటెలా లాంటి ప్రశ్నలు వేసి, భర్తలేని ఆ స్త్రీకి ఈ పిల్లాడొకడే ఆధారం అని తెలుసుకుంది. గన్నవరంలో ఓ చిన్న హాస్పిటల్‌లో చేర్చాం. "బాగా ఎనిమిక్గా ఉండీ తిండి సరిగా లేక నీరసించి ఉన్నాడనీ సెలైన్ ఎక్కిస్తే వెళిపోవచ్చనీ డాక్టర్ అనటంతో ఫీజు చెల్లించి "పదమ్మా" అన్నా. అమ్మ అక్కడ హుండిలో వేయాలని అనుకున్న మొత్తాన్ని ఆ పిల్లాడి తల్లి చేతిలో పెట్టి, అవసరం పడితే మాట్లాడమని సెల్ నంబరు రాసిచ్చి, చాలా జాగ్రత్తలు చెప్పి "పదరా" అంది.

కారు విజయవాడవైపు తిప్పుతుంటే "వద్దు నాన్నా... ముడుపులన్నీ దేవునికి చేరాయ్ లేరా. ఇక ప్రత్యేకంగా శ్రమపడి వెళ్ళాల్సిన పనిలేదు. ఇంటికిపోదాం అంది అమ్మ.

గ్రేట్ డెసిషన్ అమ్మను... మెచ్చుకున్నా. "స్నానాలకీ, తలనీలాలకీ, పుణ్యాలకీ ఏం లంకెలేరా! ఈ రోజు నా జీవిత కాలం చేసిన పూజకంటే తృప్తి ఫీలయ్యానెందుకో" ఇంటి ముఖం పట్టిన కార్లో వెనక్కి వాలి అమ్మ కళ్ళు మూసుకుని చెబుతుంటే "సెల్యూట్" చెప్పా అమ్మ చూడకపోయినా సరే!

# ప్రభుత్వ పాఠశాలలకు మనుగడ లేదా?



ఎం.సోమశేఖర నాయుడు
జిల్లా అధ్యక్షులు
యుటియఫ్ చిత్తూరు

అక్షరాస్యతలో ముందు ఉండాల్సిన ఆంధ్రప్రదేశ్ ఈ రోజు దేశ వ్యాప్తంగా 13వ స్థానంలో నిలవడం చాలా బాధాకరం. బడిఈడు పిల్లలందరూ 'బడిలో ఉండాలని, పనిలో కాదని, చదువు బాలల హక్కు' అని ప్రభుత్వం అనేక రకాలైన నినాదాలతో ప్రణాళికలు రూపొందించినా ఎందుకు ఇంకా బడిబయట పిల్లలున్నారు? ఈ రోజు 'చదువు' అనేది అంగడిలో కొనుకొనే 'వస్తువు'గా మారింది. డబ్బు ఉండే వారికి 'ఒక చదువు' డబ్బులేని వారికి 'ఒక చదువు' లభిస్తున్నది. ముందు రోజుల్లో ఈ వ్యత్యాసాలు లేవే? మరి ఈ రోజుల్లో ఎందుకు పుట్టుకు వచ్చాయి? దీనికి కారకులు ఎవరు? కొందరి స్వార్థం కోసం, వారి దనార్జన కోసం ఈ రోజు 'చదువు' అంగడి సరుకు అయింది. పేదవారికి అందని ద్రాక్ష పండు అయింది. మరి ప్రభుత్వ పాఠశాలలనందు ప్రమాణాలు లేవా? ఉన్నాయి. ఎంతోమంది వ్యక్తులు పోటీ పరీక్షలనందు ప్రభుత్వ బడులనందు చదివినవారే ఎన్నిక అవ్వడం మనకు తెలుసు. మరి ఇలాంటి తరుణంలో ఈ ప్రైవేటీకరణను అదుపుచేసి పూర్తిస్థాయిలో ప్రభుత్వ విద్యను అమలులోనికి తీసుకొని రావచ్చు గదా! ఇది సాధ్యపడదా?

అలహాబాద్ హైకోర్టు తీర్పును గౌరవిస్తూ ప్రతి ఉద్యోగి, ప్రతి ప్రజాపతినిధి తమ పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు కార్యాచరణ ఎందుకు పాలకులు చేపట్టడం లేదు?

ప్రభుత్వ పాఠశాలలు మరలా పూర్వ వైభవాన్ని పొందాలంటే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా కొన్ని ప్రత్యేక చట్టాలను తీసుకొనివచ్చి ఈ ప్రజాస్వామ్య దేశంలో 'విద్య అనేది అందరికి ఒకటే' అని భావన కల్పించాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు మరలా పూర్వ వైభవాన్ని పొందగలవు. పేదవాడు, ధనవంతుడు కలిసి చదువుకొనే రోజులు వస్తాయి. అప్పుడే నిజమైన సమానత్వం లభిస్తుంది.

ఈ రోజు మన దేశంలో కొన్ని రాష్ట్రాలనందు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు కళకళలాడుతుంటే కొన్ని రాష్ట్రాలలో కార్పొరేట్ రంగానికి చెందిన పాఠశాలలు, కళాశాలలు కళకళలాడుచున్నాయి. కేరళ, గుజరాత్, తమిళనాడు, త్రిపుర రాష్ట్రాలనందు ప్రభుత్వ విద్య మనుగడ సాగిస్తూ ఉన్నది. కొన్ని రాష్ట్రాలు ప్రైవేటీకరణవైపు విద్యను మళ్ళించడానికి మొగ్గుచూపుతూ ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయడం న్యాయంకాదు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయవలసిన అవసరం ఎంతైన ఉంది. 'విద్య అనేది ప్రతి పౌరుని హక్కు' దీనికి కావలసిన మౌలిక వసతులు ప్రభుత్వం కల్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దితే మన దేశం త్వరలోనే అగ్రబాగాన నిలవడానికి అవకాశాలు కలవు. 'రేషనలైజేషన్' పేరుతో ప్రభుత్వ పాఠశాలలను వేలాదిగా ప్రతి సంవత్సరం మూస్తూవస్తే ఎన్ని పాఠశాలలు చివరకు నిలస్తాయి! పేద బడుగు, బలహీన వర్గాల పిల్లల పరిస్థితి ఏమిటి? అని ఒకసారి ఆలోచన చేస్తే దీనికి సమాధానం ఎవరు చెప్పగలరు? ఈ క్రమబద్ధీకరణ ప్రైవేట్ బడులకు, కళాశాలలకు వర్తించవా?

పాఠశాలలనందు, కళాశాలలనందు ప్రభుత్వం మౌలిక వసతులను కల్పిస్తే ప్రభుత్వ విద్యారంగం కూడ అభివృద్ధిలోకి రావడానికి మెండైన అవకాశాలు ఉంటాయి. ఆ దిశగా పాలకులు చిత్తశుద్ధితో అమలు చేస్తే ప్రభుత్వ పాఠశాలలు పూర్వవైభవాన్ని పొంద గలవు. అది మన పాలకులకు ఉందా?!

# బదిలీల మార్గదర్శకాలు

బదిలీలకు సంబంధించిన మరికొన్ని మార్గదర్శకాలు పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.190, తేది.06.06.2017 విడుదలయ్యాయి.

1. యు-డైస్ ఆధారంగా 31.12.2016ను కటాఫ్ డేట్‌గా పరిగణనలోకి తీసుకొని ఒక పాఠశాలలో ఉండాల్సిన టీచర్లను నిర్ధారిస్తారు.
2. 24.04.2017 (క్లోజర్‌డేట్) నాటికి 5 సం॥లు నిండిన ప్రధానోపాధ్యాయులు, 8 అకడమిక్ క్యాలెండర్ సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయులను తప్పనిసరిగా బదిలీ చేస్తారు. సగం అకడమిక్ అర్ధ సంవత్సరం దాటితే పూర్తి సంవత్సరంగా పరిగణిస్తారు. సగంకంటే తక్కువ అకడమిక్ అర్ధసంవత్సరాన్ని లెక్కలోకి తీసుకోరు.
3. ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో 17.11.2009కి ముందు జాయిన్ అయిన ఉపాధ్యాయులు మరియు 24.04. 2017 నాటికి 5 సం॥లు నిండిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులను తప్పనిసరిగా బదిలీ చేస్తారు.
4. 30.06.2017 నాటికి 2 సం॥ల సర్వీస్ లోపు ఉంటే అంగీకారంతో మాత్రమే బదిలీ చేస్తారు.
5. 30.04.2017 నాటికి 50 సం॥లు దాటిన పురుష ఉపాధ్యాయులకు మహిళా ఉపాధ్యాయులు/మహిళా ప్రధానో పాధ్యాయులు లేకపోతేనే బాలికల పాఠశాలలకు కోరుకొనే అవకాశం ఉంటుంది.
6. ఉపాధ్యాయులు 8 సం॥, అకడమిక్ సం॥లు ప్రధానోపాధ్యాయులుగా 5 సం॥లు పూర్తి అయిన ఎన్‌సిసి ఆఫీసర్లను వేరొక ఎన్‌సిసి యూనిట్‌గల పాఠశాలలకు బదిలీ చేస్తారు.
   వేకేన్సీ అందుబాటులో లేకుంటే వీరిని అదే పాఠశాలలో కొనసాగిస్తారు.
7. డిఇఓ పూల్‌లోని ఉపాధ్యాయులను వారు జీతము పొందే పాఠశాలల్లో చూపుతారు. వారు మిగులు ఉపాధ్యాయులు అయితే వారు జీతము పొందే పాఠశాలల ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్స్ ఆధారంగా బదిలీల కౌన్సిలింగ్‌లో పాల్గొనాలి. లేదా పని సర్దుబాటు ద్వారా వారు పనిచేస్తున్న పాఠశాల నుండి బదిలీల కౌన్సిలింగ్‌లో పాల్గొనవచ్చును. ఈ రెండింటిలో ఏది వారికి ఉపయోగమో దానిని ఎంచుకొనవచ్చును.
8. జిఓ 32; తేది.04.06.2017 ఉత్తర్వులు రూల్ నం.13 ప్రకారం డిఇఓలు జిల్లాలోని అన్ని మండలాలలో సమాన శాతం ఖాళీలు మిగులు ఖాళీలుగా ఉండునట్లుగా ఉంచాలి. ఆపై మిగిలిన ఖాళీలను మాత్రమే బదిలీలకు ఖాళీలుగా చూపాలి. మిగులు ఖాళీలలను ఆబ్‌స్ట్రాక్ట్ చివరి కాలమ్‌లో మండలం / జిల్లా వారీగా చూపాలి. రేషనలైజేషన్ మరియు బదిలీల అనంతరం మిగులు ఉపాధ్యాయులను గుర్తించిన ఖాళీ పోస్టులలో పని సర్దుబాటుకు ఉపయోగించు కొనవచ్చును.
9. మండలాల వారిగా సమాన శాతం ఖాళీలు మిగులు ఖాళీలుగా ఉండేట్లు డిఇఓలు చూడాలి. బదిలీల కౌన్సిలింగ్ సందర్భంగా అన్ని మండలాలలో కేటగిరి, సబ్జెక్టు వారీగా మిగులు ఖాళీలు ఉండునట్లు చూడాలి.
10. ప్రాథమిక, యుపి, ఉన్నత పాఠశాలల రేషనలైజేషన్ అనంతరం విలీనం అయిన పాఠశాలలకు ఉపాధ్యాయులను బదిలీ చేస్తారు. ఆ ఉపాధ్యాయుడు రేషనలైజేషన్ ద్వారా ఆ పాఠశాలకు వెళ్ళుటకు ఇష్టపడని యెడల బదిలీ కౌన్సిలింగ్‌కు అనుమతిస్తారు.
11. రేషనలైజేషన్ ద్వారా బదిలీ చేయుటకు
    1. ఆ పాఠశాలలో 8 సం॥లు పూర్తి అయిన ఉపాధ్యాయుని మొదటి ప్రాధాన్యత ఇస్తారు.
    2. అట్టి ఉపాధ్యాయుడు లేనిచో కేడరులో జూనియర్ ఉపాధ్యాయుని బదిలీ చేస్తారు.
    3. వ్రాతపూర్వకంగా సీనియర్ బదిలీ కోరిన అతనిని బదిలీకి అనుమతిస్తారు.
12. ఒకే పాఠశాలలో పనిచేసిన అన్ని కేడర్ల సర్వీస్‌ను బదిలీకి లెక్కిస్తారు.
13. ప్రస్తుతం పనిచేస్తున్న మేనేజిమెంట్ పాఠశాలలకే బదిలీ చేస్తారు.
14. పేరెంట్ మేనేజిమెంట్‌కు వెళ్ళుటకు ఇష్టపడితే అక్కడ వేకేన్సీలు అందుబాటులో ఉంటే సీనియార్టీని పరిగణనలోకి తీసుకొని బదిలీ చేస్తారు.
15. ఆన్‌లైన్ పద్ధతిలో స్థానాల కేటాయింపు జరిగేంతవరకు ఐటి విభాగం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను నిర్వహిస్తుంది.

16. 30.04.2017 నాటికి ప్రస్తుత పాఠశాల మరియు కేటగిరీలో ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్ ఇస్తారు.

17. పంచాయతీరాజ్ ఇంజనీర్ విభాగం సూపరిండెంటెండ్ ఇంజనీర్ వారు ఇచ్చిన నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ వారిచే ప్రచురితమైన ఆవాస ప్రాంతాలు మరియు కేటగిరీలను పరిగణనలోకి తీసుకొంటారు.

18. బదిలీ ఉత్తర్వులు రూల్-7లో పేర్కొన్న దాని ప్రకారం తన స్పౌజ్ వద్దకు వెళ్ళుటకు ప్రత్యేక పాయింట్స్ అనుమతించ బడినవి. ఆ విధంగా పాయింట్స్ వినియోగించుకొనే ఉపాధ్యాయులు జిల్లాలోగాని, ప్రక్క జిల్లాలో గాని స్పౌజ్ పనిచేస్తున్న దగ్గర స్థానానికి కోరుకోవాలి.

19. బదిలీ ఉత్తర్వు రూల్-9ఏ మరియు బి యు-డైస్ 2015 మరియు 2016 ఆధారం ఫర్‌ఫార్మెన్స్ పాయింట్స్ గత రెండు సంవత్సరాలలో పెరిగిన హాజరు ఆధారంగా తీసుకొనబడతాయి.

20. 2012 తర్వాత జాతీయ, రాష్ట్ర అవార్డు పొంది గత కౌన్సిలింగ్‌లో వ్యక్తిగత పాయింట్స్ వినియోగించుకొనని ప్రధానోపాధ్యాయులు మరియు 2009 తర్వాత జాతీయ, రాష్ట్ర అవార్డు పొంది గత కౌన్సిలింగ్‌లో పాయింట్స్ వినియోగించుకొనని ఉపాధ్యాయులు రూల్-10 ఏ ప్రకారం వ్యక్తిగత పాయింట్స్ ఇప్పుడు వినియోగించు కొనవచ్చును.

21. బదిలీ ఉత్తర్వులు రూల్-10(జి) అప్‌గ్రేడేషన్ పోస్టులన్నీ (ప్రమోషన్‌కు భర్తీచేసినవి లేదా ఖాళీగా ఉన్నవన్నీ) వేకెన్సీలుగా నోటిఫై చేస్తారు.

పండిట్స్, పిఇటిలకు తగినన్ని వేకెన్సీలు లేకుంటే నీడ్ వేకెన్సీలో చూపించి ఎస్‌జిటి మరియు తత్సమాన కేడర్ల రెగ్యులర్ వేకెన్సీలలో జీతం చెల్లిస్తారు.

22. బదిలీల దరఖాస్తులు సమర్పించుకొనుటకు ఎంఆర్‌సి సెంటర్సులో కంప్యూటర్ ఆపరేటర్, సిస్టమ్, ఇంటర్నెట్ కనెక్షన్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఏర్పాటు చేయాలి. ఆర్‌జెడి / జిల్లా విద్యాశాఖాధికారులు ఈ నిబంధనలు జాగ్రత్తగా పరిశీలించి నిర్ణీత కాల పరిమితిలో షెడ్యూల్ పూర్తి చేయాలి. దీనికి భిన్నంగా వ్యవహరించిన వారిపై తగు చర్యలు తీసుకొనబడునని ఆదేశించారు.

## రేషనలైజేషన్ మరియు బదిలీల షెడ్యూల్ 2016-17

**సిఎస్ఇ ఉత్తర్వులు ఆర్‌సి నం.190/Estt.III/2017, తేది.06.06.2017**

| | |
|---|---|
| 1. ప్రాథమిక / ప్రాథమికోన్నత / ఉన్నత పాఠశాలల రేషనలైజేషన్ | - 09.06.2017 లోగా |
| 2. మేనేజిమెంట్ / కేటగిరి / సబ్జెక్టు / మీడియం వారీగా ఖాళీల ప్రదర్శన | - 11.06.2017 |
| 3. ఆన్‌లైన్‌లో బదిలీకి దరఖాస్తుచేసి ప్రింట్ కాపీని ఎంఇఓ/డివైఇఓలకి సమర్పించడం | - 09.06.2017 నుండి 12.06.2017 |
| 4. ఎంఇఓ / డివైఇఓ ఫెరిఫికేషన్ చేసి డిఇఓకి సమర్పించాలి | - 10.06.2017 నుండి 13.06.2017 |
| 5. ప్రొవిజినల్ సీనియార్టీ లిస్టులు ప్రదర్శన | - 14.06.2017 |
| 6. ఆధారాలతో అభ్యంతరాలకు జవాబులు ఆన్‌లైన్‌లో సమర్పించుట | - 15.06.2017 నుండి 16.06.2017 |
| 7. డిఇఓల ద్వారా అభ్యంతరాల స్వీకరణ | - 17.06.2017 |
| 8. బదిలీలలో పాల్గొనే వారు అప్లికేషన్ కన్ఫర్మేషన్ చేయుట | - 17.06.2017 నుండి 18.06.2017 |
| 9. సీనియార్టీ తుది జాబితా | - 19.06.2017 |
| 10. ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ | - 20.06.2017 నుండి 22.06.2017 |
| 11. ప్రొవిజనల్ అలాట్‌మెంట్‌లిస్టు ప్రదర్శన | - 24.06.2017 |
| 12. ప్రొవిజనల్ లిస్టులపై ఫిర్యాదుల స్వీకరణ | - 25.06.2017 |
| 13. ఫిర్యాదులపై జిల్లాస్థాయి కమిటీ పరిష్కారం చేయుట | - 26.06.2017 నుండి 27.06.2017 |
| 14. ఫైనల్ అలాట్‌మెంట్ జాబితా ప్రదర్శన | - 28.06.2017 |
| 15. వెబ్‌సైట్‌లో బదిలీ ఉత్తర్వులు ప్రదర్శన | - 29.06.2017 నుండి 30.06.2017 |
| 16. జాయినింగ్ ప్రక్రియ | - 01.07.2017 |


**ఐక్య ఉపాధ్యాయ పత్రిక చందా రేట్లు**

| | | |
|---|---|---|
| **విడి పత్రిక** | - | ₹ 15.00 |
| **సంవత్సరం చందా** | - | ₹ 150.00 |
| **అర్థ దశాబ్ది (5 సం॥లు)** | - | ₹ 650.00 |
| **దశాబ్ది చందా (10 సం॥లు)** | - | ₹ 1250.00 |

**ఐక్య ఉపాధ్యాయలో ప్రకటనల రేట్లు**

| | | |
|---|---|---|
| **4వ కవర్ పేజీ (కలర్)** | - | ₹ 30,000 |
| **2వ కవర్ పేజీ (కలర్)** | - | ₹ 20,000 |
| **3వ కవర్ పేజీ (కలర్)** | - | ₹ 20,000 |
| **లోపలి పేజీ (బ్లాక్ & వైట్)** | - | ₹ 10,000 |
| **లోపలి పేజీ (బ్లాక్ & వైట్)ఆప్షనల్** | - | ₹ 11,000 |

### మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు నూతన వేతనాలు

మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపులు లేనందున జీతాల సమస్య ముందుకొచ్చింది. జీతాలు, పిఆర్‌సి అరియర్లు 164.88 బడ్జెట్ విడుదల చేయాలని ఆర్థిక శాఖమంత్రికి, ఆర్థికశాఖ కార్యదర్శి కె.సునీతకు అనేక దఫాలుగా విజ్ఞప్తి చేశాము. కేంద్రం నిధులు నిలుపుదల చేసిన సందర్భంలో వీరి జీతాల చెల్లింపుకు నూతనంగా హెడ్‌ఆఫ్ అక్కౌంట్‌కు కేటాయించి బడ్జెట్ విడుదల చేయాలని చెప్పాము. వీరి జీతాలు రాష్ట్ర బడ్జెట్‌నుండే చెల్లించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించడంతో 41.22 కోట్లు మొదటి విడతల బడ్జెట్ విడుదలయ్యింది. 2017 మార్చి, ఏప్రిల్ నెలలకు నూతన పిఆర్‌సిలో వేతనాలు చెల్లించడమైనది. బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో అదనపు బడ్జెట్ విడుదల చేస్తేతప్ప జీతాలు వచ్చే పరిస్థితి లేదు.

### సిఆర్‌టిలను రెన్యువల్ చేయాలి - జీతాలు పెంచాలి

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లను విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే రెన్యువల్ చేస్తూ ఉత్తర్వుల ఇవ్వాలని మరియు వారి వేతనాలు పెంచాలని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఆర్‌పి సిసోడియాకు విజ్ఞప్తి చేయడమైనది. ఆ మేరకు ఉత్తర్వులు ఇచ్చేదానికి ఫైల్ ప్రాసెస్‌లో ఉంది. వీరికి 2010 వేతన స్కేళ్ళలో ప్రారంభ వేతనాలు పెంచుతూ 29.05.2017న జిఓ నం.38 ద్వారా ఉత్తర్వులు విడుదలైనాయి. గత 14 సం॥లుగా ఎస్‌జిటి / ఎస్‌ఏలు రూ.4500/-, 5500/-లు చెల్లిస్తున్నారు. ఎస్‌జిటిలకు ప్రస్తుతం రెమ్యున రేషన్ రూ.4500/- నుండి 10,900/- స్కూల్ అసిస్టెంట్లకు, రూ. 5500/-లు నుండి రూ.14860/-లుగా పెంచారు. ఈ వేతనాలు 2013 పిఆర్‌సి మేరకు రివైజ్ చేయాల్సి ఉంది.

### మున్సిపల్ పాఠశాలల్లో పండిట్స్ పిఇటి పోస్టులు అప్‌గ్రేడేషన్

మున్సిపల్ కార్పొరేషన్ / మున్సిపాలిటీలో ఎస్‌జిటి పండిట్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని అనేక పోరాటాలు, ప్రాతినిధ్యాలు చేస్తూ వచ్చాము. జిఓ 82; తేది.16.05.2017 ఉత్తర్వుల ద్వారా తెలుగు 285, హిందీ 296, ఉర్దూ 14, సంస్కృతం 15, పిఇటి 262 మొత్తం 872 పోస్టులు అప్‌గ్రేడ్ చేయడం పట్ల యుటియఫ్ హర్షం వ్యక్తం చేస్తోంది. ఎస్‌జిటి పోస్టులు కూడా స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేస్తున్నది.

### ఎయిడెడ్ ఉపాధ్యాయులకు సిబిఆర్‌ఓ విడుదల చేయాలి బడ్జెట్ కంట్రోలు తొలగించాలి

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు 2017 జనవరి, ఫిబ్రవరి జీతాలకు అదనపు బడ్జెట్ విడుదల చేయనందున 2017 మొదటి క్వార్టర్ బడ్జెట్‌లో 25% జీతాలు, అరియర్లు చెల్లింపుకు ఆర్థికశాఖ ద్వారా ఉత్తర్వులు ఇప్పించడం జరిగింది. సిబిఆర్‌ఓ విడుదల చేసేలోగా ఈ 25% బడ్జెట్ వినియోగానికి యిచ్చిన అనుమతి మేరకు జనవరి, ఫిబ్రవరి జీతాలు చెల్లించడం జరిగింది. 2017 మార్చి, ఏప్రిల్, మే జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే సిబిఆర్‌ఓ విడుదల చేయాలని మే 31న ఆర్థికశాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రకు విజ్ఞప్తి చేయగా రెండు రోజుల్లో సిబిఆర్‌ఓ విడుదల చేస్తామని, త్వరలో బడ్జెట్ కంట్రోలు తొలగింపుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.

### ఆర్‌వియం శిక్షణ ఒంటిపూటకు మార్పు



ఐ.వెంకటేశ్వరరావు
యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు

ఆర్‌విఎం శిక్షణా తరగతులు వాయిదా అయినా వేయండి లేదా ఒంటిపూటకైనా మార్చాలని మే 16న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌కు విజ్ఞప్తి చేశాము. వేసవిలో శిక్షణా తరగతులు నిర్వహించదలిస్తే ఏసి హాల్‌లోనే నిర్వహించాలని లేదా మానుకోవాలని విజ్ఞప్తి చేశాము. దీనిపై ఆయన వెంటనే స్పందిస్తూ శిక్షణా తరగతులు ఒంటిపూటకు మార్చాలని ఆదేశించగా ఆ మేరకు డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

### ఆర్‌ఎంఎస్‌ఏ శిక్షణా తరగతులు

మండు వేసవిలో $40^0$-$50^0$ ఆపైన ఉష్ణోగ్రత నమోదు కాబడుతున్న సందర్భంలో క్లాసుకు ఒక ప్లాన్‌తో శిక్షణా తరగతులు ఎలా నిర్వహిస్తారని, శిక్షణా కేంద్రాలలో సౌకర్యాలు లేవని తక్షణం వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశాము. ఫ్యాప్టో-జాక్టో తరపున బహిష్కరిస్తామని చెప్పాము. అయినా అధికారులు మొండిగా వ్యవహరించారు. ఉదయం-మధ్యాహ్నం వేళలు మార్పు చేశారు.

### మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ఇప్పించాలి

మున్సిపల్ విద్యాశాఖలో ఇటీవల మంజూరుకాబడిన అప్‌గ్రేడ్ పోస్టులకు ఖాళీలకు వెంటనే ప్రమోషన్లు యిప్పించాలని మే 24న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్యకార్యదర్శి మరియు డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశాము. సర్వీస్‌రూల్స్‌లో కొన్ని అసంబద్ధాలు సరిచేయవలసి ఉన్నందున ప్రస్తుతం మున్సిపల్ యూనిట్‌గా ప్రమోషన్లు అమలు చేస్తామని చెప్పారు.

### మున్సిపల్ సాధారణ బదిలీలు / అంతరజిల్లా బదిలీలు షెడ్యూల్ ప్రకటించాలి

మున్సిపల్ పాఠశాలల్లో బదిలీలకు ఒక పద్ధతి లేకుండా పోతుందని, కమీషనర్లు / చైర్మన్లు / మేయర్లు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు చేస్తున్నారని, ఏ నిబంధనలు, కౌన్సిలింగ్ పద్ధతి పాటించడం లేదని చెప్పాము. కావున సాధారణ, అంతరజిల్లా మున్సిపల్ బదిలీలకు షెడ్యూల్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశాము.

1. మున్సిపల్ కార్పొరేషన్ / మున్సిపాలిటీలలో బదిలీలు చేయాలి.
2. జిల్లాలో అంతర మున్సిపల్ కార్పొరేషన్ / మున్సిపాలిటీలకు బదిలీలు చేయాలి.
3. అంతరజిల్లా మున్సిపల్ కార్పొరేషన్ / మున్సిపాలిటీలకు బదిలీల షెడ్యూలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశాము. ఆ మేరకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.

### సాంకేతిక కమిటీ నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల తీవ్ర ఆగ్రహం

ఉద్యోగుల ఆరోగ్యం పథకంలో (ఇహెచ్‌ఎస్) మాస్టర్ హెల్త్ చెక్‌అప్‌కు సంబంధించి టెక్నికల్ కమిటీ ప్రతిపాదనల పట్ల ఇహెచ్‌ఎస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మే 12న గుంటూరు చుట్టుగుంట ఎన్‌టిఆర్‌వైద్య సేవ కార్యాలయంలో సిఇఓ ఎ.రవిశంకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. మాస్టర్ హెల్త్ చెక్‌అప్ పరీక్షలు మరియు ప్యాకేజీ రేట్లకు సంబంధించి టెక్నికల్ కమిటీల సిఫారసులపై ఎన్‌టిఆర్ వైద్యసేవ టెండరును ఆహ్వానించింది.

ఆ మేరకు మెడాల్, కాల్ హెల్త్ ఏజెన్సీల ప్రతినిధులు మాత్రమే హాజరై తమ సేవలు గురించి వివరించారు.

గతంలో ఇహెచ్ఎస్ మేనేజ్‌మెంట్ కమిటీ, స్టీరింగ్ కమిటీలు రెండూ ఆమోదించిన వైద్య పరీక్షల సంఖ్యను తగ్గించడాన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పి.అశోక్‌బాబు (ఏపిఎన్‌జిఒ) ఐ.వెంకటేశ్వరరావు (యుటియఫ్ ), జోసెఫ్ సుధీర్ (ఎస్‌టియు) ఎం.కమలాకరరావు, (పిఆర్‌టియు). ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి (ఏపిఎన్‌జిఒ) నేతలు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

సాంకేతిక కమిటీ ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పరీక్షలు తగ్గించడంలో అంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. మేనేజిమెంట్ కమిటీ, స్టీరింగ్ కమిటీ నిర్ణయించిన జాబితాలోని పరీక్షలు తగ్గిస్తే అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. వైద్యశాఖకు వైద్యుడు కాని కన్సల్టెంట్ జితేంద్రశర్మ నిర్వాకం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇహెచ్ఎస్ కమిటీల నిర్ణయాలు ఎందుకు మారాయి, ఎవరు మార్చారో చెప్పాలని పట్టుబట్టారు.

ప్రభుత్వ ఉత్తర్వులు 135, తేది.29.10.2014 ప్రకారం క్రానిక్ వ్యాధులకు ఔట్‌పేషెంట్ వైద్యం, 40 సంllలు పైబడిన సర్వీస్ ఎంప్లాయీస్‌కు సంవత్సరంలో ఒకసారి మాస్టర్ హెల్త్ చెకప్ నోటిఫై ఆసుపత్రులలో వైద్యం చేయుటకు సంబంధిత మార్గదర్శకాలు ఇస్తామని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ద్వారా పురుషులకు 31, మహిళలకు 33 వైద్య పరీక్షలు చేయుటకు మరియు సర్వీస్ ఎంప్లాయీస్, పెన్షనర్లు వారి భార్య / భర్తకు ఒకసారి మాస్టర్ హెల్త్ చెకప్ చేయుటకు ప్రభుత్వం అంగీకరించింది.

దీనిపై మాస్టర్ హెల్త్ ప్యాకేజీ అమలుకు ఒక కమిటీ, రేట్లకు సంబంధించి మరొక కమిటీలను ప్రభుత్వం నియమించింది.

- ఈ కమిటీలు 40 సంllలోపు వున్న ఉద్యోగులు వారి స్పౌజ్‌లకు 27 వైద్య పరీక్షలు, వీరిలో 30 సంllలు పైబడిన మహిళలకు అదనంగా Sono mammogram & PAP smear (లిక్విడ్ బేస్డ్) పరీక్షలు చేయాలని,
- 40 సంllలు పైబడిన ఉద్యోగులు వారి స్పౌజ్‌లకు 28 వైద్య పరీక్షలు, వీరిలో మహిళలకు అదనంగా Sono mammogram & PAP smear పరీక్షలు మాస్టర్ హెల్త్ చెకప్‌లో భాగంగా రెండు సంవత్సరాలకొకసారి చేయాలని,
- పెన్షనర్లు వారి స్పౌజ్‌లకు పై వ్యాధులకు ఒన్‌టైమ్ హెల్త్ చెకప్ చేయాలని సిఫారసు చేశారు.

రేట్లకు సంబంధించిన కమిటీ హెమటోలాజికల్ & బయో కెమికల్ పరీక్షలకు ఒక్కరికి రూ.235/-లు, ఎక్సేర్ రూ.71/-లు, ఇసిజి (12 లీడ్స్) రూ.51/-లు, సోనో మమ్మోగ్రామ్ (30 సంllలు పైబడిన మహిళలకు) రూ.381/-లు, పాప్ స్మీర్ (30 సంllలు పైబడిన మహిళలకు) రూ.237/-లు రేట్లను సిఫారసు చేసింది.

సాంకేతిక కమిటీ వైద్య పరీక్షలకు ప్రతిపాదించిన రేట్లు చాలా తక్కువగా ఉన్నాయనే కారణంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు ఎన్‌టిఆర్ వైద్యసేవా నోటిఫికేషన్‌కు స్పందించలేదని ఉద్యోగ సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు.

థైరాయిడ్‌కు సంబంధించిన టి3, టి4, టిఎస్‌హెచ్, సీరం విటమిన్ డి3 లెవెల్స్, 2డి ఈకో, ట్రెడ్ మిల్ టెస్ట్, హెచ్‌బి ఏ1-సి, హెచ్ఐవి లాంటి ముఖ్యమైన టెస్టులు సాంకేతిక కమిటీ తీసివేయడాన్ని ఉద్యోగ సంఘ నేతలు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు.

## నరసింహమూర్తి ఆదర్శప్రాయుడు సంస్మరణ సభలో వక్తలు




యు.టి.ఎఫ్ సీనియర్ నాయకులు పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ కుడిపూడి నరశింహ మూర్తి సంస్మరణ సభ తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలంలో వారి స్వగ్రామం అయిన తొత్తరమూడి పెదపాలెంలో జరిగింది. ఈ సంస్మరణ సభకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యం.రాజశేఖర్ అధ్యక్షతవహించారు. సీనియర్ నాయకులు డి.శ్రీరామమూర్తి సంస్మరణ సభకు హాజరై మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అన్యాయాలను ఎదిరించి నిలబడిన వారిలో నరశింహమూర్తి కూడా ఒకరన్నారు.

ముఖ్య అతిథిగా హాజరైన సి.పి.యం. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ నరశింహమూర్తి ఉపాధ్యాయ ఉద్యమానికే కాక అనేక ప్రజా సంఘాల నిర్మాణానికి చేయూతనిచ్చారని అన్నారు. యు.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముమ్మిడివరం సమితిలో ప్రజాప్రతినిధుల నియంతృత్వాన్ని ఎదిరించాడని అన్నారు. భార్యను ప్రజా సంఘాల నిర్మాణంలో ఉంచిన త్యాగశాలి అని కొనియాడారు. యు.టి.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ యు.టి.ఎఫ్ ఉద్యమం తూర్పుగోదావరి జిల్లాలో పెరిగిన తీరును చూసి ఆయన కంటతడి పెట్టడం తనకు గుర్తుందన్నారు. ఐద్వా జిల్లా నాయకురాలు సి.హెచ్.రమణి, యు.టి.ఎఫ్ జిల్లా కార్యదర్శి పెంకే వెంకటేశ్వరరావు, సి.ఐ.టి.యు నాయకులు వేణుగోపాల్, యు.టి.ఎఫ్ ఐనవిల్లి మండల శాఖ బాధ్యులు జి.బంగార్రాజు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మే 8న ఆరోగ్యశాఖ మంత్రి, ఆశ ఆసుపత్రుల యాజమాన్యం ప్యాకేజి రేట్లపై తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే అమలు చేసి పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

ఉద్యోగ సంఘాల నేతలు వెలిబుచ్చిన అభిప్రాయాల మినిట్స్‌ను ఆరోగ్య మంత్రి మరియు ముఖ్యమంత్రికి వెంటనే పంపాలని, త్వరలో ముఖ్యమంత్రిని కలిసి స్టీరింగ్ కమిటీ నిర్ణయాల అమలుకు పట్టుబడతామని తెలియజేశాము.

# ప్రశ్నోత్తరాలు



*నిర్వహణ :* **టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,**
**ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు**
**mail : ikyopadhyaya1975@gmail.com**

ప్రశ్న : **మా పాఠశాలనందు ప్రధానోపాధ్యాయుడు, నాన్ టీచింగ్ స్టాఫ్ పనిచేయుచున్నారు. వేసవి కాలమునందు ఎస్ఎస్సి పరీక్షల నిమిత్తం వీరికి కాక మరొక ఉపాధ్యాయుడికి సంపాధిత సెలవు ఇవ్వవచ్చా?**

**- ఐ.వెంకటేశ్వరరావు, కొత్తపేట**

**జవాబు :** ఇవ్వరాదు. ప్రధానోపాధ్యాయుడు, జూనియర్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్‌లను మాత్రమే ఎస్ఎస్సి పరీక్షల నిమిత్తం పాఠశాలకు హాజరుకావాలసి వుంది. వారికి మాత్రమే సంపాధిత సెలవు జమ చేయబడుతుంది. నాన్ టీచింగ్ లేని పాఠశాలల్లో ఉపాధ్యాయుని సేవలు వినియోగించుకొనట్లయితే అతనికి కూడా సంపాదిత సెలవు జమ చేయాలి.

ప్రశ్న : **నేను పదవ తరగతి అనంతరం ఇంటర్ మధ్యలో ఆపేసి తదుపరి ఓపెన్ యూనివర్శిటీ ద్వారా డిగ్రీ, బిఇడి, ఎంఏ చేసి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌కి సెలక్ట్ అయ్యాను. దానివల్ల భవిష్యత్తులో ప్రమోషన్లకు ఇబ్బందులు వస్తాయా?**

**- కె.సునీత, కర్నూలు జిల్లా**

**జవాబు:** మీరు డైరెక్ట్ స్కూల్ అసిస్టెంట్ కాబట్టి 45 సం॥ వయస్సు వచ్చేలోపు ప్రమోషన్ వచ్చినా లేదా 12 సం॥ల స్కేలు పొందాలన్న డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు పాస్ కావాలి. 45 సం॥లు దాటితే మినహాయింపు వర్తిస్తుంది. మరే ఇబ్బందులు లేవు.

ప్రశ్న : **నేను పదవ తరగతి పాస్‌అయి ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీ చదివి, టిపిటి చేసి స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను. పదోన్నతికి ఏదైనా ఇబ్బందులున్నాయా?**

**- వై.శ్రీను, కడప**

**జవాబు :** పై ప్రశ్నకు యిచ్చిన జవాబే వర్తిస్తుంది.

ప్రశ్న : **నేను సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేయుచున్నాను. నా ఆదాయం 6 లక్షలు దాటినందున ఒబిసి సర్టిఫికెట్ ఇవ్వడానికి తహసీల్దార్‌గారు నిరాకరిస్తున్నారు. సరియైనదేనా?**

**- విశాల, మైలవరం, కృష్ణా జిల్లా**

**జవాబు :** సరియైనదికాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 08.09.1993న కేంద్ర ప్రభుత్వం ఒబిసి సర్టిఫికెట్ విషయంలో యిచ్చిన వివరణ "Excluding all class-I employees and direct recruites of class-II cadre, all other government services having income grater than 6 lakhs are still eligible for OBC Non creamy layer certificate" అని ఉన్నది. కాబట్టి మీకు సర్టిఫికెట్ ఇవ్వడానికి అభ్యంతరం అవసరం లేదు.

ప్రశ్న : **ఈ వేసవి సెలవులలో 8 రోజులు ఆర్ఎంఎస్ఏ 5 రోజులు యుపి స్థాయి శిక్షణా తరగతులకు హాజరయ్యారు. మొత్తం ఎన్ని రోజులు సంపాదిత సెలవులు వస్తాయి?**

**-బి. ముత్యాలరావు, నెల్లూరు**

**జవాబు:** ఈ సంవత్సరం మొత్తం వేసవి సెలవులు 50 రోజులు.

$$\left[365\times\frac{1}{11}\right]-\left[27\times\frac{\text{వాడుకొన్న సెలవులు}}{\text{మొత్తం సెలవులు}}\right]-6$$

సూత్రం ప్రకారం ఆర్ఎంఎస్ఏ శిక్షణా తరగతులకుగాను 5 రోజులు, యుపి స్థాయి శిక్షణా తరగతులకు 3 రోజులు సంపాదిత సెలవులు జమ చేయబడతాయి.

ప్రశ్న : **ఎస్ఎస్సి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల విధులకు హాజరైన జూనియర్ అసిస్టెంట్‌కు ఎన్ని రోజులు సంపాదిత సెలవు జమ చేయాలి?**

**- కె.నరసింహమూర్తి, చిత్తూరు**

**జవాబు:** పాఠశాల విద్యాసంచాలకుల వారి ఉత్తర్వులు ఆర్‌సి నం.223/ఎ&ఐ/2016; తేది.04.05.2017 ప్రకారం ఎస్ఎస్సి ఫలితాల రోజు నుండి హాజరు కావలసినదిగా ఆదేశించారు. ఫలితాలు మే 6వ తేదీన ప్రకటించడం జరిగింది. అనగా వేసవి సెలవులు అనుభవించింది 23.04.2017 నుండి 05.05.2017 వరకు 13 రోజులు మాత్రమే. ఆం.ప్ర. సెలవు నిబంధనల ప్రకారం 15 రోజులలోపు వేసవి సెలవులు అనుభవించినట్లయితో మొత్తం వేసవి సెలవులు పనిచేసినట్లుగా భావించాలి. ఆ ప్రకారం 24 రోజులు సంపాదిత సెలవు జమ చేయవలసి వుంటుంది.

ప్రశ్న : **ఆదాయపు పన్ను రిటర్న్ ఎప్పటిలోగా సమర్పించవలసి వుంటుందా?**

**- ఫాతిమాబేగం, నరసరావుపేట**

**జవాబు:** జులై 31లోపు ఆన్‌లైన్‌లో రిటర్న్ సమర్పించవలసి వుంటుంది.

## పాఠకులకు గమనిక

ఇ-మెయిల్ **(ikyopadhyaya1975@gmail.com)** లేదా లేఖల ద్వారా ప్రశ్నలు పంపేవారు వారి పేరు, గ్రామం, జిల్లా పేరు, ఫోన్ నంబరు, ఐక్య ఉపాధ్యాయ చందానంబరు తప్పనిసరిగా వ్రాయాలి. ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా ఉండాలి. జిఓ / మెమో కాపీలు కావలసిన వారు సంబంధిత జిల్లాలలో యుటియఫ్ కార్యాలయాలను లేదా బాధ్యులను సంప్రదించాలి. పత్రికా కార్యాలయం నుండి జిఓ / మెమో కాపీలు పంపుటకు వీలుకాదు.



# ఉపాధ్యాయ ఉద్యమ నేత ఈడ్పుగంటికి నివాళి

ఉపాధ్యాయ ఉద్యమ నేత, గుంటూరు జిల్లా ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన ఈడ్పుగంటి అప్పారావు (88) జూన్ 2న గుంటూరు జిల్లా మంగళగిరి మండలం, పెదవడ్లపూడిలో మృతిచెందారు. ఈడ్పుగంటి అప్పారావు గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం, రేవేంద్రపాడు గ్రామంలో 1928లో ఆయన జన్మించారు. తండ్రి ఈడ్పుగంటి పెదరాఘవయ్య, తల్లి శేషమ్మ. ఇద్దరు అన్నదమ్ములు, ముగ్గురు అక్క చెల్లెళ్ళు కలిగిన పెద్ద కుటుంబం. అప్పారావుగారి భార్య మరియు మాణిక్యమ్మ. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య స్ఫూర్తి, ప్రోద్బలంతో ఆయన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. ప్రారంభంనుంచే ఆయన జీవితం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో ముడిపడి ఉంది. ప్రాథమిక ఉపాధ్యాయ – ఫెడరేషన్‌లో ఉద్యమ జీవితాన్ని ప్రారంభించి, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌వైపు సాగింది ఆయన పయనం.

ఈమని సమితిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా ప్రారంభమై స్కూల్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ చేశారు. ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్‌లో జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాజకీయ కారణాలతో ఆయన సొంత ఊరులో పనిచేయనివ్వకుండా –ఈపూరు మండలం బొగ్గరం గ్రామానికి బదిలీ చేశారు. ఇటువంటి సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో అవిశ్రాంతంగా పనిచేస్తూనే విద్యారంగం, ఉపాధ్యాయుల స్థితిగతులు, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపైనే ఆధారపడి ఉంటాయని, వాటిని సాధించాలంటే వామపక్ష భావజాలమే మార్గమని తాను విశ్వసించడంతోపాటు ఉపాధ్యాయులకు నిరంతరం ఉద్బోధించారు.

ప్రజాసంఘాల కార్యాలయాల నిర్మాణ సమయంలో నిధులు వసూలు చేయడంలో అందరికీ ఆయన మార్గ దర్శకుడు. ఢిల్లీలో పార్టీ కార్యాలయానికి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ఎంబి భవన్, మోటూరు ఉదయం భవన్ నిర్మాణ సమయంలో ఎక్కువమందిని కలవడం ద్వారా అటు నిధుల సమీకరణ, ఇటు ప్రచారం చేశారు. అలాగే సాహిత్యపరంగా ప్రజాశక్తి, పీపుల్స్ డెమోక్రసీ, ఐక్య ఉపాధ్యాయ పత్రికలు తాను చదవడంతోపాటు అందరిచేత చందాలు చేర్పించేవారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో చెన్నుపాటి లక్ష్మయ్య విజయానికి అన్నీ తానే అయి పనిచేశారు.

యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వర రావు, పి.బాబురెడ్డి, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, యుటియఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కె.జోజయ్య, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎన్.తాండవకృష్ణ, యుటియఫ్ సీనియర్ నాయకులు వి.విశ్వనాథం, కె.సీతారామయ్య, దైవప్రసాద్, కెఎస్‌వి దుర్గారావు, పి.ప్రభుదాస్, యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె. నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి యు.రాజశేఖర్, టి.ఆంజనేయులు, స్థానిక శాఖల నాయకులు, ఉపాధ్యాయులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి ఉపాధ్యాయ ఉద్యమ నేత ఈడ్పుగంటికి నివాళులర్పించారు. గుంటూరు జిల్లా శాఖ, రాష్ట్ర సంఘం సంతాపాన్ని తెలియజేసింది.


## కవిత — మనిషిలోనే కాంచగలవు

- తంగెళ్ళ లింగారావు, చిలకలూరిపేట

స్వేద జలమును చిలికి భువిపై
పంట పైరులు సాగు చేయుచు
జీవరాసుల క్షుదశు బాపెడు
కర్షకునిలో కానలేరా! దేవుని?
చిత్తశుద్ధితో శిష్యకోట్లకు
జ్ఞాన బోధను చేసి దేశపు
భావి తరమును తీర్చిదిద్దెడు
ఒజ్జలందున కానలేరా దేవుని?
ఒడలు విరచి శ్రమను మరచి
ప్రగతి కొరకు పాటుపడుచు
కాయకష్టము చేయుచున్న
కార్మికునిలో కానలేరా దేవుని?
రోగపీడిత దీనజునులకు
పగలురాత్రి సేవ చేయూచు
ఓర్పు నేర్పుతో ప్రేమపంచెడు
వైద్యులందున కానలేరా దేవుని?
కడగండ్ల కడవిలా చిక్కువడిన
అభాగ్య జీవుల చేరదీసి
అదుకొని ఓదార్పునిచ్చెడు
కారుణ్యమూర్తిలో కానలేరా దేవుని?
దేశరక్షణె ధ్యేయమంచు
ప్రాణాలు తృణముగ యెంచిపోరుచు
కార్యదీక్షతో ముందుకురికెడు
వీరసైనికుని త్యాగ నిష్ఠలో కానలేరా దేవుని?
కండు లేడను వాడులేల?
కాంచగలిగిన కన్నులున్న
కన్నులెదుటె నిలిచియున్న
మనిషిలో కాంచగలవు దేవుని.

# ఆధునిక ప్రపంచ చరిత్ర - విప్లవ యుగం

"ఆధునిక ప్రపంచ చరిత్ర - విప్లవయుగం" అనే గ్రంథాన్ని ఆంగ్లంలో "The Age of Revolution" పేరుతో ప్రముఖ చరిత్ర కారుదు ఎరిక్‌హాబ్స్ - బామ్ వ్రాషారు. బామ్ 1917లో అలెగ్జాండ్రి యాలో జన్మించారు. ఈయన బ్రిటీష్ చరిత్రకారుడు, సామాజికవేత్త, రచయిత. మార్క్సిస్టు దృక్పథంలో చరిత్రను అధ్యయనం చేశారు. ఆయన అనేక గ్రంథాలు రాశారు. వాటిలో "The Age of Revolution" అనే గ్రంథం ఒకటి. 19వ శతాబ్దంలో యూరప్‌లో జరిగిన మార్పులను అక్షరరూపాన్నిచ్చారు. విషయాన్ని లోతుగా చర్చించడం లోనూ, సరళంగా చరిత్రను అందించడంలోనూ హాబ్స్‌బామ్ నేర్పరి.




ఈ గ్రంథాన్ని గుంటూరు జిల్లా యుటియఫ్ సీనియర్ నాయకులు కె.కేశవరెడ్డి గారు "ఆధునిక ప్రపంచ చరిత్ర - విప్లవయుగం" అనే పేరుతో తెలుగులోకి అనువదించారు. యుటియఫ్‌లో వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించిన ఆయన, గణిత ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఐక్యఉపాధ్యాయ పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. ఆయన సామాజిక స్పృహ కలిగిన ఐక్యఉపాధ్యాయ కార్యకర్తగా అనేక విలువైన గ్రంథాలను తెలుగులోకి అనువాదం చేశారు. వాటిలో "విప్లవయుగం ఒకటి".

ప్రధానంగా ఈ గ్రంథంలో 1789-1848 మధ్య కాలంలో జరిగిన పరిణామాలను విశ్లేషించారు. ఈ గ్రంథం రెండు భాగాలుగా ఉన్నది. ఇందులో మొదటి భాగంలో పరిణామాలను వివరించారు. 1789ల నాటి ప్రపంచం అత్యధిక ప్రజానీకానికి ఊహించరానంత విస్తృతమైనది. తరువాత జరిగిన పారిశ్రామిక విప్లవం, పెట్టుబడిదారీ వ్యవస్థకు నాంది పలకడం, ఫ్రెంచి విప్లవం, యుద్ధం, శాంతి, విప్లవాలు, జాతీయవాదం అనే అంశాలను వివరించారు. ప్రస్తుతం భారత దేశంలో జాతీయవాదం / దేశభక్తిలాంటి వాటిమీద చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఇది మనకు లోతైన అవగాహన కలిగిస్తుంది.

ఇక రెండవ భాగంలో ఆ పరిణామాల ఫలితాలను విశ్లేషించారు. ఇందులో ప్రధానంగా భూమి, పారిశ్రామిక ప్రపంచం దిశగా, శ్రామిక పేదలు, మతం, సెక్యులర్ భావాజాలాలు, సైన్స్, కళలులాంటి అంశాలను లోతుగా అర్థంచేసే ప్రయత్నం చేశారు. 1848 నాటికి బ్రిటిష్ పారిశ్రామికీకరణ చెందిన ఆర్థిక వ్యవస్థగా ముందుకు రావడం, ఆర్థిక మాంద్యం, సంక్షోభాలకు సంబంధించిన అంశాలు సమకాలీన ప్రపంచంలో సంభవిస్తున్న పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ సంక్షోభాలను గుర్తుకు తెస్తాయి. ఈ అంశాల సారూప్యతను పరిశీలించవచ్చు. అలాగే 'మతం'-'మతతత్వం' సవాళ్ళు నేటి సమకాలీనత సెక్యులర్ భావ జాలాన్ని ప్రత్యామ్నాయంగా చూడడం ఆ రోజుల్లోనే ప్రారంభమై నేడు అది అనివార్యమైనదిగా ఉండడం మనం చూస్తున్నాం.

సమాజం నిరంతరం మారుతూ ఉంటుంది. ఆ మార్పు అనివార్యంగా అభివృద్ధివైపే ఉంటుంది. అది విప్లవాల ద్వారానే జరుగుతుందన్నది చరిత్ర చెప్పిన వాస్తవం. ఈ వాస్తవాలను "విప్లవ యుగం" అనే ఈ గ్రంథంలో సోదాహరణంగా చూడవచ్చు. 280 పేజీలు కలిగిన ఈ గ్రంథం ప్రతి ఒక్కరూ, ప్రత్యేకించి ఉపాధ్యాయులం దరూ తప్పనిసరిగా చదవదగినది. ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు ముద్రించిన ఈ గ్రంథం ఖరీదు రూ. 200/-లు.

**-కె.నాగమల్లేశ్వరరావు,** గుంటూరు జిల్లా

## పాఠకుల అభిప్రాయాలు పంపండి

**"ఐక్యఉపాధ్యాయ"** మాసపత్రిక ఉపాధ్యాయ సమస్యలు, ఉద్యమాలతో పాటు అనేక సామాజిక, ఆర్థిక, అకడమిక్ అంశాలపై వ్యాసాలు ప్రచురిస్తోంది. కథలు, కవితలతో పాటు పలు శీర్షికలు నిర్వహిస్తోంది. వీటిపై పాఠకుల ప్రతిస్పందనను ఆహ్వానిస్తున్నది. పత్రికలో ప్రచురితమైన అంశాలపై మీ అభిప్రాయాలు మరియు ఏ అంశాలు వుంటే బాగుంటుందో మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. మీ అభిప్రాయాలు క్లుప్తంగా, సూటిగా ఉత్తరాల ద్వారాగానీ, మెయిల్ ద్వారాగానీ తెలియజేయగలరు.

**ఉత్తరాల ద్వారా ....“ఐక్యఉపాధ్యాయ”**, యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారివీధి, గవర్నరుపేట, విజయవాడ- 520002.

**E-Mail : ikyopadhyaya1975@gmail.com**కి పంపవచ్చు.

**- సంపాదకవర్గం**

# సమస్యలపై ప్రాతినిధ్యాలు

## శ్రీకాకుళం జిల్లా

### కెజిబివి సిబ్బందికి వేసవి సెలవులు ఇవ్వాలి

మండు వేసవి దృష్ట్యా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల స్పెషల్ ఆఫీసర్లకు, సిఆర్‌టిలకు బోధనేతర సిబ్బందికి వేసవి సెలవులను మంజూరు చేయాలని సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి త్రినాథ రావుని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర, కెజిబివి టీచర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.వాగ్దేవి, ఎస్ఎస్ఏ కార్యాలయంలో కలిసి వినతిని అందించారు.

పదవ తరగతి పరీక్షల ఫలితాలలో ఉత్తమ ఫలితాలు కెజిబివి పాఠశాలలు పొందటంలో మంచి కృషి చేసిన ప్రాజెక్టు అధికారిని, స్పెషల్ ఆఫీసర్లను, సిఆర్‌టిలను వారు అభినందించారు. కెజిబివి సిబ్బంది వేతనాల పెంపుదలకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు అధికారి సానుకూలంగా స్పందిస్తూ కెజిబివి సిబ్బంది అవసరాలమేరకు సెలవులను మంజూరు చేస్తామని సిబ్బంది వత్తిడికి గురికాకుండా కెజిబిబి పాఠశాలలు ఉత్తమ పాఠశాలలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## కృష్ణా జిల్లా

### కెజిబివి టీచర్ల కొనసాగింపుకు ఎస్‌పిడి హామీ



**విజయవాడ :** కెజిబివి పాఠశాలల్లో తొలగించిన ప్రత్యేక అధికారిణులను, సిఆర్‌టిలను మరల విధులలోనికి తీసుకోవాలని మే 15న ఎస్ఎస్ఏ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కెజిబివి టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు సామూహిక వినతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రాజెక్టు అధికారి జి.శ్రీనివాస్ కెజిబివి టీచర్స్ ఫెడరేషన్, యుటియఫ్ నాయకుల ను చర్చలకు పిలిచి దాదాపు 20 నిమిషాలు మాట్లాడారు. ఈ సందర్భంగా యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కె.విజయగౌరి మాట్లాడుతూ ఈ యేడాది 10వ తరగతి పరీక్షలలో గణితంలోనే మొత్తం విద్యార్థులందరూ ఫెయిలయ్యారని, దానికి సంబంధించిన సమగ్ర సమీక్ష జరపాలని అడిగారు. అలాగే గత మూడు సం॥లుగా 66మంది కృషితో చేసిన ఫర్‌ఫార్మెన్స్‌కు సంబంధించి పత్రాలను ఎస్‌పిడికి అందజేశారు.

చర్చలు జరిగిన తరువాత సప్లిమెంటరీ పరీక్షలకు అందరూ మరల ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని, పాఠశాలలకు వెళ్లమని, అందరికీ మరల రెన్యువల్ ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.విజయగౌరి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతి ప్రియదర్శిని, రత్నకుమారి, ఏపిజెఏసి నాయకులు విజయ్‌కుమార్, తేజోవతి, స్రవంతి, పద్మావతి, రోజ్ సులోచన, సిఆర్టిలు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా

### మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీ షెడ్యూలు ప్రకటించాలి

మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీ షెడ్యూలును వెంటనే ప్రకటించి బదిలీలను నిర్వహించాలని యుటియఫ్ రాష్ట్ర సంఘం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కి ప్రాతినిధ్యం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యుటియఫ్ నాయకులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలకాలంగా మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్ ప్రక్రియ జరగడం లేదని, గత రెండు రోజులక్రితం క్రమబద్ధీకరణ జిఓని విడుదల చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియను మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలను కూడా అనుమతించాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ పి.శివపార్వతి మాట్లాడుతూ త్వరలో బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లాల్లోని మున్సిపల్ పాఠశాలల పరిధిలో డిప్యుటేషన్‌పై పనిచేయుచున్న ఉపాధ్యాయులను తిరిగి వారి పాఠశాలలకు పంపే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించారు. యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు, కార్యదర్శులు బురాన్ ఆలి, కోటిరెడ్డి, వివిధ మున్సిపాలిటీ బాధ్యులు ఉన్నారు.

### మండల విద్యాశాధికారి నియామకపు ఉత్తర్వులు రద్దు చేయాలి - ఆర్‌జెడికి ధర్నా నోటీసు



నిబంధనలకు భిన్నంగా జరిగిన గుంటూరు మండల విద్యాశాఖాధికారి నియామకాన్ని వెంటనే రద్దు చేయాలని యుటియఫ్ జిల్లా శాఖ గుంటూరు ఆర్‌జెడి కార్యాలయంలో కలిసి ధర్నా నోటీసు అందించింది. ఈ సందర్భంగా యుటియఫ్ నాయకులు మాట్లాడుతూ నిబంధనలకు భిన్నంగా జరిగిన ప్రధానోపాధ్యాయులను పదోన్నతిని రద్దు చేయాలని గత 2 సం॥లుగా పలుమార్లు ప్రాతినిధ్యం చేస్తుండగా, సదరు ప్రధానోపాధ్యాయున్నే నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యం గా గుంటూరు ఎంఇఓగా నియమించడం జరిగిందని తెలిపారు.

ఉమ్మడి సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాల్సి వుండగా నిబంధనలకు విరుద్ధంగా 2009లోనే పదోన్నతి కల్పించి, గుంటూరు రేంజ్ ఉర్దూగా కొనసాగించడం జరిగింది.

ఏపిఏటి వారి ఉత్తర్వులను అమలుచేసే సందర్భంలో కౌన్సిలింగ్ తేదీ నాటికి మిగిలిన 5 ఖాళీలలో మాత్రమే నియామకం జరపాల్సి ఉండగా కౌన్సిలింగ్ అనంతరం ఏర్పడిన గుంటూరు ఎంఇఓ ఖాళీని భర్తీ చేయడం సరైందికాదని తెలిపారు.

ఆర్‌జెడి కెవి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఎం పదోన్నతికి సంబంధించిన పూర్తి వివరాలు అందించమని డైరెక్టర్ కార్యాలయం వారికి ఉత్తర్వులు అందాయని డైరెక్టర్ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకొనుట జరుగుతుందని తెలిపారు.

నిబంధనలకు భిన్నంగా జరిగిన గుంటూరు ఎంఇఓ నియామకం వారం రోజులలో రద్దు చేయాలని లేని పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణ కార్యక్రమం నిర్వహించుట జరుగుతుందని యుటియఫ్ నాయకులు తెలిపారు. ఆర్‌జెడిని కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శి పి.ఐ.పాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### సీనియర్ ప్రధానోపాధ్యాయులనే ఇన్‌చార్జి ఎంఇఓగా నియమించాలి

సీనియర్ ప్రధానోపాధ్యాయులనే గుంటూరు మండల ఇన్‌చార్జి ఎంఇఓగా నియమించాలని యుటియఫ్ జిల్లా నాయకత్వం డిమాండ్ చేసింది. మే 6న గుంటూరు ఆర్‌జెడి కార్యాలయంలో ఆర్‌జెడిని కలిసి ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండలంలో పనిచేస్తున్న సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జి ఎంఇఓగా నియమించాలని, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు ఇన్‌చార్జి ఎంఇఓగా బాధ్యతలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు వేరొకర్ని ఇన్‌చార్జి ఎంఇఓగా నియమించడం సరైందికాదని తెలిపారు.

ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ డిఎస్ఇ వారికి వివరణ కొరకు రాయడం జరిగిందని, వివరణ వచ్చిన తరువాత నిబంధనల ప్రకారం మాత్రమే గుంటూరు ఇన్‌చార్జి ఎంఇఓను నియమిస్తామని తెలిపారు.

ఆర్‌జెడిని కలిసి ప్రాతినిధ్యం చేసినవారిలో రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగమల్లేశ్వర రావు, ఎం.హనుమంతరావు, కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

**కడప జిల్లా**

### ప్రావిడెంట్ ఫండ్ ఋణాల మంజూరు జాప్యం తగదు

ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ (జెడ్‌పిపిఎఫ్) ఋణాల మంజూరులో జిల్లా పరిషత్ అధికారులు చేస్తున్న జాప్యాన్ని నివారించి, సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని యుటియఫ్ కడప జిల్లాశాఖ, జిల్లా కలెక్టరుకు మే 8న ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ప్రావిడెంట్ ఫండు ఋణాల కొరకు ఉపాధ్యాయులు చేసుకొన్న దరఖాస్తులను సకాలంలో మంజూరు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారని, నెలల తరబడి కార్యాలయము చుట్టూ త్రిప్పుకొనుచున్నారని, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుల ఫైనల్ పేమెంట్ సెటిల్‌మెంట్‌ను చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఋణాల మంజూరు అధికారి అయిన డిప్యూటీ సిఇఓ ఛాంబర్‌లో దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయులకు 2015-16, 2016-17 సం॥ల పిఎఫ్ స్లిప్పులు జారీచేయడం లేదని, ఋణాల దరఖాస్తులను వరుసక్రమంలో మంజూరు చేయడంలేదని తదితర సమస్యలు వినతి పత్రంలో తెలిపారు.



**అనంతపురం జిల్లా**

### ఉపాధ్యాయ బదిలీలు నిజాయితీగా, పారదర్శకంగా జరగాలి

ఉపాధ్యాయ బదిలీలు నిజాయితీగా, పారదర్శకంగా జరగాలని కౌన్సిలింగ్ విధానాన్ని మన ముఖ్యమంత్రిగారే 1998లోనే ప్రవేశ పెట్టారు. బదిలీలు ప్రతిభ ఆధారంగా జరపాలని పట్టుబడుతున్నారు. అయితే ఏ ప్రతిభ ప్రాతిపదికన దొడ్డిదారిన ప్రభుత్వం అక్రమ బదిలీలను నేరుగా సెక్రటేరియేట్ నుండి చేస్తున్నదని యుటియఫ్ అనంతపురం జిల్లాశాఖ ప్రశ్నించింది.

బదిలీల్లో అవినీతి, పైరవీలు దగ్గరకు రానీయమని ముఖ్యమంత్రి ప్రకటించగా విద్యాశాఖ పైరవీలకు, ధన, రాజకీయ పలుకు బడులకు ఉపాధ్యాయ బదిలీలు చేయడాన్ని యుటియఫ్ అనంతపురం జిల్లాశాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తోన్నది.

ఇప్పటివరకు జరిగిన దొడ్డిదారి అక్రమ బదిలీలన్నింటినీ తక్షణం రద్దు చేయాలని, విద్యాశాఖ తన వైఖరి మార్చుకోవాలని అక్రమ బదిలీలకు పైరవీలు చేస్తున్నవారిపై తగుక్రమశిక్షణా చర్యలు గైకొనా లని, మే 9న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్నట్లు యుటియఫ్ అనంతపురం జిల్లాశాఖ నాయకత్వం తెలిపారు.

### బెంగళూరు ప్రైవేట్ ఆసుపత్రులలో ఆరోగ్య పథకం అమలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేస్తున్న ఆరోగ్య పథకం సేవలను అనంతపురం జిల్లా వాసులకు బెంగళూర్ నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులలో కూడా వైద్యసేవలు పొందుటకు అనుమతి మంజూరు చేయాలని యుటియఫ్ అనంతపురం జిల్లాశాఖ మే 12న వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగారికి ప్రాతినిధ్యం చేసింది. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలులో 12.01.2017న స్టీరింగ్ కమిటీ తీసుకొన్న నిర్ణయాలను అమలు చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకమునకు సంబంధించిన ప్యాకేజి రేట్ల సమస్యను పరిష్కరించాలని, ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాల తగాదా మధ్య ఉద్యోగులు నష్టపోతున్నారని, కావున తక్షణం ఆరోగ్యపథకం అమలులో వున్న సమస్యలన్నింటిని తక్షణం పరిష్కరించాలని కోరుతూ యుటియఫ్ ప్రాతినిధ్యం చేయడం జరిగింది. మంత్రిని కలిసినవారిలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్, జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.వి.వి.రమణయ్య, కోశాధికారి ఎస్.జయచంద్రారెడ్డి, రాప్తాడు మండలశాఖ ప్రధాన కార్యదర్శి బి.అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# సదస్సులు, సమావేశాలు

## శ్రీకాకుళం జిల్లా

### విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయాలు విరమించుకోవాలి




రాష్ట్ర విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయాలు విరమించుకోవాలని, బదిలీల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని, బదిలీలలో ఫర్‌ఫార్మెన్స్ పాయింట్స్ రద్దు చేయాలని, వెబ్ కౌన్సిలింగ్ రద్దు చేయాలని, బదిలీలకు 8 సం॥ల కాలపరిమితి వుండాలని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు, జెఏసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని, విద్యాశాఖను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుకై పెద్దఎత్తున ఐక్య ఉద్యమాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఉన్నత, యుపి, ప్రాథమిక పాఠశాలలకు కొత్త ప్యాట్రన్ ఏర్పాటుచేసి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

మోడల్ స్కూల్ టీచర్లకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడు నెలల జీతాల చెల్లింపునకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమ పలుకుబడి బదిలీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫర్‌ఫార్మెన్స్ ఆధారంగా కెజిబివి ఎస్‌ఓలను సిఆర్‌టిలను తొలగించ రాదని వారి వేతనాలను సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేర పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం జిల్లా

### సిపిఎస్ విధానం రద్దు అయ్యేంతవరకు పోరాడతాం



విజయనగరం జిల్లా కేంద్రంలో స్థానిక ఎన్‌జిఓ కార్యాలయంలో యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎస్.మురళీమోహన్ అధ్యక్షతన "సిపిఎస్ విధానం రద్దు - ప్రత్యామ్నాయా"లు అనే అంశంపై జరిగిన సెమినార్‌లో రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానం, నియామకాలు రావడానికి గల కారణం పిఎఫ్ఆర్‌డిఏ బిల్లును ఆనాడు బిజెపి ప్రభుత్వం చట్టబద్ధం చేయటం వల్లనే ఈ ప్రమాదం వచ్చిందని అన్నారు. సిపిఎస్ ప్రమాదాన్ని వెంటనే యుటియఫ్ ప్రతిఘటించిందని, సదస్సులు, పోరాటాలు కూడా నిర్వహించామని తెలిపారు. నేడు సిపిఎస్ అసలు రూపం పూర్తిగా సిపిఎస్ ఉద్యోగులకు అర్థమైందని అన్నారు. ఈ విధానం రద్దు కావాలంటే ఐక్యపోరాటాలు అవసరం అవి అన్నారు. యుటియఫ్‌గా నిరంతర పోరాటాలు నిర్వహిస్తూ, భవిష్యత్‌లో ఈ పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. సిపిఎస్ ఐక్య సంఘటనే ప్రత్యామ్నాయమని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి సిపిఎస్ ఉద్యమం, ఉపాధ్యాయుల సమస్యలకు సంబంధించిన కర్తవ్యాలను ప్రతిపాదించారు. సెమినార్‌లో రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి, రాష్ట్ర కార్యదర్శి డి.రాము, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.కృష్ణారావు, జిల్లా నాయకులు జి.వెంకటరావు, జి.నిర్మల, రమేష్ పట్నాయక్, సత్య శ్రీనివాస్, మధుసూధనరావు, నాగరాజు, సిపిఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం జిల్లా

### జమిలి ఎన్నికలు సాధ్యమా

**నర్సీపట్నం :** దేశంలో జమిలీ ఎన్నికలు ఆచరణ సాధ్యంకాదని యుటియఫ్ విశాఖపట్నం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు దాసరి నాగేశ్వర రావు అన్నారు. మే 31న నర్సీపట్నం ఎల్ఐసి క్లబ్‌లో అల్లూరి సీతారామ రాజు అధ్యన వేదిక ఆధ్వర్యంలో దేశంలో 'జమిలీ ఎన్నికలు సాధ్యమా' అనే అంశంపై చర్చావేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేంత బలగాలు అందుబాటులో లేకపోవడం, వివిధ రాష్ట్రాలలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఉండడం తదితర కారణాల వల్ల ఈ ఎన్నికలు సాధ్యం కావన్నారు. దేశంలో నిరక్షరాస్యులైన ఓటర్లు అధిక శాతంలో ఉన్నారని, ఎక్కువ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు, కొన్ని జాతీయ పార్టీలు అధికారంలో ఉన్నాయని ఇటువంటి సందర్భం ఎంపి, ఎమ్మెల్యే ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే కేంద్రంలలో ఒక పార్టీకి, రాష్ట్రంలో మరొక పార్టీకి ఓటు వేసేటప్పుడు అయోమయానికి, గందర గోళానికి గురవుతారని, నిజమైన ప్రజాభిప్రాయం ప్రతిబింబించిందన్నారు. దామాషా పద్ధతిలో ఎన్నికలలో వచ్చిన ఓట్లు ప్రాతిపదికగా సీట్లను చట్టసభలో కల్పించే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. దీనికి వేదిక అధ్యక్షులు కె.త్రిమూర్తులు రెడ్డి అధ్యక్షత వహించారు. వివిధ సంఘాల నాయకులు బొంతు గౌరునాయుడు, కురచ జోగినాయుడు, గంటేడ అప్పలరాజు, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి జిల్లా

### ఐక్యఉద్యమాలతోనే సి.పి.యస్.రద్దు
### సంకల్ప సదస్సులో ప్రొ॥ కె.నాగేశ్వర్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సామాజిక భద్రతకు విఘాతం కలిగించిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దుకు సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ప్రముఖ విశ్లేషకులు, మాజీ యం.ఎల్.సి మరియు హన్స్ ఇండియా పత్రికా సంపాదకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ పిలుపునిచ్చారు. సి.పి.యస్.రద్దు కోరుతూ యు.టి.ఎఫ్ తూర్పు గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యములో కాకినాడ పైడా చలమయ్య కళ్యాణ మండపంలో మే 14వ తేదీన జరిగిన సంకల్ప సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సంకల్ప సదస్సుకు

జిల్లా శాఖ అధ్యక్షులు డి.వి.రాఘవులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భముగా నాగేశ్వర్ మాట్లాడుతూ మొదటి అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ పత్రం ఆధారం చేసుకుని పాలకుల వర్గాలు పాత పెన్షన్ విధానాని కి తూట్లు పొడిచాయని అన్నారు. శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు ఒక్క రోజు పనిచేసినా పెన్షన్ ఇస్తారని , ప్రభుత్వ పథకాలను అమలు చేసే ఉద్యోగులకు పెన్షన్‌ను రద్దు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. పింఛను సొమ్ములు షేర్‌మార్కెట్‌లో పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అమెరికా వంటి దేశాలలో షేర్ మార్కెట్‌లో పెట్టిన పింఛను నిధులు గల్లంతయ్యాయన్నారు. సిపియస్ రద్దు కావాలంటే రాజకీయపార్టీల ఎజెండాగా మారే స్థాయిలో ఉద్య మించాలన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అన్న సర్వోన్నత న్యాయస్థానం తీర్పును సైతం కాలరాసి ఉద్యోగుల నెత్తిన బలవంతంగా ఈ నూతన విధానాన్ని రుద్దారని విమర్శించారు.

యు.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి తరపున సి.పి.యస్ రద్దు కోరుతూ విశాల ఐక్య వేదిక నిర్మిస్తామని అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో పి.ఎఫ్.ఆర్.డి.ఏ బిల్లు చట్టం కావడం వెనుక వామపక్షాలు మినహా అన్ని పార్టీలు ఉన్నాయన్నారు. ఉద్యోగుల 10శాతం వాటా, ప్రభుత్వం 10శాతం వాటా షేర్ మార్కెట్‌లో పెట్టడం ఎవరి ప్రయోజనాల కోసమని వారు ప్రశ్నించారు. సామాజిక భద్రతలేని ఈ విధానంపై పాలక వర్గాలు పునరాలోచన చేయాలని కోరారు. మన సమస్యను మనమే పరిష్కరించుకుందామనే అస్థిత్వ ధోరణులను సి.పి.యస్ ఉద్యోగులు విడనాడాలని పిలుపునిచ్చారు. పి.ఎఫ్.ఆర్.డి.ఏ చట్టం రద్దయ్యేవరకు జాతీయ స్థాయిలోను, అసెంబ్లీలో సి.పి.యస్ రద్దు చేస్తూ తీర్మానం చేసే వరకు రాష్ట్రంలోను పోరాడవలసిన అవసరం ఉందన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల టీచర్ యం.ఎల్.సి రాము సూర్యారావు మాట్లాడుతూ సి.పి.యస్ రద్దు కొరకు జరిగే అన్ని ఉద్యమాలకు పి.డి.ఎఫ్ యం.ఎల్.సి లంతా సంపూర్ణ మద్దతునిస్తామని అన్నారు. ఇప్పటికి శాసన మండలిలో రెండు సార్లు వాయిదా తీర్మానం ఇచ్చి చర్చ కోసం పట్టుపట్టామన్నారు.

జిల్లా జె.ఏ.సి ఛైర్మన్ బూరిగ ఆశార్వాదం మాట్లాడుతూ జిల్లాలో సి.పి.యస్ రద్దు కొరకు బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. యు.టి.ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ప్రభాకరవర్మ మాట్లాడుతూ అప్రంటిస్ వ్యవస్థ రద్దు కొరకు చేసిన ఉద్యమం కంటే బలమైన ఉద్యమాన్ని నిర్మించవలసిన అవసరం ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు ఆహ్వానం పలికిన ఈ సదస్సుకు జిల్లా కార్యదర్శి టి.వి.జి.జి.ఆర్ చక్రవర్తి వందన సమర్పణ చేశారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు, జె.ఏ.సి జిల్లా కోశాధికారి జియా ఉద్దీన్, ఎ.పి.ఆర్.పి.ఏ నాయకులు సిహెచ్. సత్యనారాయణరాజు, డి.వై.ఎఫ్.ఐ నాయకులు పలివెల వీరబాబు, యు.టి.ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ జోగా అప్పారావు, కె.వి.ప్రసాద్ బాబు, యస్.జ్యోతిబసు, బేతినీడి శ్రీనివాసరావు, యం.విజయగౌరి, నల్లి విశ్వనాథ్, జె.సత్య నారాయణ, జి.అప్పలనాయుడు, పి.నాగేశ్వరరావు, టి.జి.వషింగ్టన్, ఎ.షరీఫ్, యస్.యస్.వి.చలపతి, వి.సోనీ, పెంకె వెంకటేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, సి.హెచ్.వి.రమణ, వి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

**జె.ఏ.సి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ ఎన్నిక**

మే 21వ తేదీన కాకినాడ ఎన్.జి.ఓ హోమ్‌లో జరిగిన జె.ఎ.సి తూర్పుగోదావరి జిల్లా సమావేశానికి జిల్లా జె.ఎ.సి ఛైర్మన్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షత వహించారు. జిల్లా జె.ఎ.సి కన్వీనర్ స్థానానికి జరిగిన ఎన్నికలో ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకగ్రావంగా యు.టి.ఎఫ్ పేరు ప్రతిపాదించడంతో యు.టి.ఎఫ్ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు కన్వీనర్‌గా ఎన్నికైనారు. ఈ సమావేశంలో యు.టి.ఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు, జిల్లా బాధ్యులు జి.ప్రభాకరవర్మ, డివి.రాఘవులు, జోగా అప్పారావు, టి.వి.జి.ఆర్. చక్రవర్తి, కె.వి.వి.నాగేశ్వరరావు తదితరులు హాజరైనారు.

**పశ్చిమగోదావరి జిల్లా**

**ఉపాధ్యాయులు సామాజిక ఉద్యమాలు నిర్మించాలి**



యుటియఫ్ వ్యవస్థాపక నాయకులు, ఎస్‌టిఎఫ్ఐ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్సీ దాచూరిరామిరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా లయన్స్ ఆడిటోరియంలో మే 18న యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ అధ్యక్షతన విద్యా సదస్సు జరిగింది. సాబ్జీ మాట్లాడుతూ 1974 సం॥లో యుటియఫ్‌ను స్థాపించడంలోనే జాతీయ స్థాయిలో ఉపాధ్యాయ ఉద్యమాన్ని ఎస్‌టిఎఫ్ఐ పేరుతో స్థాపించి తొలి ఛైర్మన్‌గా పనిచేశా రన్నారు. శాసనమండలి రద్దు కాకముందు, పునరుద్ధరించిన తరువాత కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికై ఉపాధ్యాయుల సంక్షేమానికి, విద్యారంగాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు.

శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్‌గా విఠపు బాలసుబ్రహ్మణ్యం 'ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షణ-ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగం ప్రైవేటీకరణ స్థాయి దాటి కార్పొరేటీకరణగా అయిపోయిందన్నారు. ప్రభుత్వం ప్రతి యేటా రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను మూసివేసి వేలాది పోస్టులను రద్దుచేసుకుంటూ పోతుందన్నారు. దీనివలన ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో నెట్టబడుతుందన్నారు. విద్యారంగ సమస్యలు గుర్తించి పరిష్కారం చేయడం కోసం మేధావులు, విద్యారంగ శ్రేయోభిలాషులు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, సంఘాల ప్రతినిధులతో విద్యా కమీషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమాజంలోని సమస్యల పట్ల స్పందించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాల లు, ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించి ఆయా పాఠశాలల్లో చదువుతున్న బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు, జెఏసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి, చెన్నుపాటి లక్ష్మయ్యలు ఉ ద్యమాల ద్వారా సాధించుకున్న పెన్షన్ సౌకర్యాన్ని ప్రభుత్వాలు రద్దుచేసి సిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుండి వసూలు చేసిన సొమ్మును షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి

పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు పనిచేస్తున్నా యన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారా మాత్రమే సిపిఎస్ రద్దు సాధ్యం అవుతుందన్నారు.

యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖామంత్రి అన్ని ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడి అన్ని సంఘాల అభిప్రాయాలు తీసుకుని వాటికనుగుణంగా బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామని హామీ ఇచ్చి అందుకు భిన్నంగా ఉత్తర్వులు రూపొందించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మన్నారు. దొడ్డిదారి బదిలీలకు పూనుకోవడం శోచనీయమన్నారు.

సదస్సులో రాష్ట్ర కార్యదర్శి ఎస్.జయప్రభ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పివి నరసింహారావు, కె.శ్రీదేవి, జిల్లా శాఖ గౌరవాధ్యక్షులు ఎం. రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు పి.జయకర్, సహాధ్యక్షులు సిహెచ్. జగన్మోహనరావు, కోశాధికారి వి.కనకదుర్గ, జిల్లా కార్యదర్శులు ఎకెవి రామభద్రం, బిఎస్ ప్రకాశరావు, వి.శంకరుడు, పి.శివప్రసాదు, సిహెచ్. పట్టాభిరామయ్య, ఎ.విక్టర్, ఎం.వెంకటేశ్వరరావు, కె.హరిప్రియ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టిజె జయకుమార్, వి.వెంకటరాముడు, కె.శ్రీనివాస్, కె.రాజశేఖర్, బివి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కృష్ణా జిల్లా**

### ఉద్యోగుల సంక్షేమానికి కృషి



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో చర్యలు తీసుకుంటామని, ఉద్యోగుల సంక్షేమ నిధి ద్వారా 207మంది ఉద్యోగులకు 41లక్షల 47వేల 500 రూపాయలు ఋణాన్ని మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తెలిపారు. ఉద్యోగుల సంక్షేమ నిధి జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని మే 19న జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ బి.లక్ష్మీకాంతం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ పశ్చిమ కృష్ణా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ నిధి కమిటీ కోశాధికారి, ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వనజారాణి, ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణరెడ్డి, బి.ఆనంద్, యుటియఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్‌కుమార్, ఇతర సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల ఋణాల మంజూరు పట్ల హర్షం

చాలాకాలం తర్వాత ఉద్యోగుల సంక్షేమనిధి ఋణాలు మంజూరు కావడం పట్ల యుటియఫ్ కృష్ణాజిల్లా శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్‌పి మనోహర్‌కుమార్, కె.ఏ.ఉమామహేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ప్రతి ఆరు నెలలకు ఉద్యోగుల సంక్షేమ నిధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ అంగీకరించారని తెలిపారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

**గుంటూరు జిల్లా**

### కెజిబివి రాష్ట్రస్థాయి ధర్నాను జయప్రదం చేయండి



కస్తురిబా బాలికల విద్యాలయంలో పనిచేసే ఉపాధ్యాయుల, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కెజిబివి సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.రత్నమాలినిదేవి అన్నారు. కెజిబివి జిల్లా స్థాయి సమావేశం బ్రాడీపేటలోని యుటియఫ్ కార్యాలయంలో కెజిబివి రాష్ట్ర అధ్యక్షులు ఎం.శాంతిప్రియదర్శిని అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయకపోగా వారికి ఉద్యోగ భద్రత కల్పించలేదని విమర్శించారు. సంఘటితంగా పోరాటం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. యుటియఫ్ జిల్ల ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం సాధించుకొనేదాని కోసం మీరు పోరాటం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కెజిబివి స్టేట్ మెంబర్ ఎస్‌కె ఆషారిపా మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు ఒక వార్డెన్ పోస్టును మంజూరు చేయాలని, ఖచ్చితంగా పనిగంటలను అమలు చేయాలని, మన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయి ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం కెజిబివి గుంటూరు జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

కెజిబివి జిల్లా కమిటీ : అధ్యక్షులు బిఎస్ ఈశ్వరమ్మ , సహాధ్యక్షులు ఎం.శిరీష, కె.భారతి, ఎస్.బ్లెస్సీ దైవసృజన, డి.విజయ, ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యం, కోశాధికారి డి.ఉదయలక్ష్మి, సభ్యులు జికెఎస్ స్వరూప, ఏ.సూర్యకుమారి, వై.జయంతి, బి.శివపార్వతిబాయి, ఎన్. సరళాదేవి, జి.నాగమణి, కె.ప్రమీల.

### పారదర్శక బదిలీల చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావాలి




ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయుల బదిలీల విషయంలో బదిలీల చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. యుటియఫ్ హాల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వేసవి కాలం ముగుస్తున్నా బదిలీల రేషనలైజేషన్ షెడ్యూల్ ప్రకటించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వ తీరుపట్ల నిరసన తెలిపారు. బదిలీలలో ఉపాధ్యాయుల పని పాయింట్ల

ఆధారంగా బదిలీలు నిర్వహిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఏ పని పాయింట్లు ఉన్నాయని అక్రమంగా ప్రభుత్వం 32మందిని బదిలీ చేసిందని విమర్శించారు. గత సంవత్సరం కూడా ఇలాగే బదిలీల షెడ్యూల్ ప్రకటించకుండా అక్రమ బదిలీలు ప్రభుత్వం చేసిందని ఈ సంవత్సరం కూడా ఇలాగే నిర్వహించాలని, ప్రభుత్వం భావిస్తుందా అనే అనుమానం మాకుందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా అక్రమ బదిలీలను రద్దు చేసి, నేరుగా బదిలీలను ఆపకపోతే పిడిఎఫ్ ఎమ్మెల్సీలం నిరవధిక నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు.

రేషనలైజేషన్ పేరుతో ప్రతి సంవత్సరం పాఠశాలలను మూసి వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం పాఠశాలల్లో పిల్లలు ఎందుకు తగ్గుతున్నారో చర్చ జరగాల్సివున్నా ఆ పని జరపకుండా ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. బదిలీల పేరుతో జాతర కార్యక్రమంగా చేయడాన్ని ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయుల నియామకం జరపకుండా ఆ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ప్రమోషన్స్ ఇవ్వకుండా చేయడం ద్వారా నియామకం పొందిన వారు అలాగే రిటైర్డ్ అయిపోతున్నారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఎయిడెడ్ వ్యవస్థ రక్షించాలని కోరారు. ఎమ్మెల్సీ వై. శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల రేషనలైజేషన్ బదిలీలు, సర్వీస్‌రూల్స్ విషయంలో స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ పాఠశాలల్లో రెండు మీడియంలను సమాంతరంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాల విద్యను రాష్ట్రంలో గందర గోళం పరుస్తూ కార్పొరేట్‌రంగంకి విస్తరిస్తున్న ప్రభుత్వ విధానాలను ఉపాధ్యాయులు అవగాహన చేసుకొని పోరాటానికి సిద్ధంకావాలని పాఠశాల విద్యను ప్రభుత్వరంగంలో నిలబడేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు, యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు, యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి, ఎం. హనుమంతరావు, యుటియఫ్ ప్రచురణ విభాగం చైర్మన్ ఎన్.తాండవ కృష్ణ, జిల్లా యుటియఫ్ కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

**కడప జిల్లా**

### పాఠశాలల మూసివేత తగదు



రేషనలైజేషన్ పేరుతో వందలాది ఉపాధ్యాయ పోస్టులు, ప్రభుత్వ పాఠశాలలు మూసివేత సరికాదని యుటియఫ్ జిల్లా కార్యాలయంలో మే 24న సమావేశంనందు యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజ ఆరోపించారు. గత విద్యా సంవత్సరం మోడల్ స్కూల్ పేరుతో ఆదర్శ పాఠశాలలను ఆడంబరంగా ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఆ పాఠశాలలకు కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదన్నారు. ఈ విద్యా సంవత్సరం నూతన మార్గదర్శకాలతో రేషనలైజేషన్ చేయడానికి జిఓ 29ని విడుదల చేసి దీనిద్వారా రాష్ట్ర వ్యాపితంగా 9వేల పాఠశాలలు మూతపడుతున్నాయి. నాణ్యమైన విద్య అందిస్తామని చెబుతూ మరొకవైపున రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలు మూసివేయటం వలన బడుగు, బలహీనవర్గాల పిల్లలకు విద్యను దూరము చేయడమేనన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు పి.చంద్రశేఖర్, ప్రధానకార్యదర్శి ఎస్.వి.సుబ్బరాజు, జిల్లా కార్యదర్శు లు గంగన్న, సివి రమణ, సికె దిన్ని, వల్లూరు, కడప మండలాల నాయకులు జిలాని, దేవదత్తం, మస్తాన్‌బాషా పాల్గొన్నారు.

### ప్రతిభా ఆధారిత పాయింట్లు తొలగించాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా ఆధారిత పాయింట్లు లేకుండా అక్రమ బదిలీలు చేసి బదిలీల కౌన్సిలింగ్‌లో ఉపాధ్యాయ బదిలీలు ప్రతిభా ఆధారిత పాయింట్లు జరగాలని జిఓ 31 విడుదల చేయటం తగదని రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజ అన్నారు. వీరి బదిలీలకు ఎలాంటి ప్రతిభా ఆధారం కాకుండా కేవలం రాజకీయ పలుకుబడి డబ్బుఉన్నవారికి అక్రమ బదిలీలు చేశారన్నారు. యుటియఫ్ జిల్లా కార్యాలయంలో ఆఫీసు బేరర్ల సమావేశం జరిగింది. సమావేశంలో లక్ష్మిరాజ ప్రసంగిస్తూ ఉపాధ్యాయ సంఘాలతో కమీషనర్, సెక్రటరీ, విద్యాశాఖ మంత్రులతో జరిగిన చర్చలలో ఇచ్చిన హామీలు ఏ మాత్రం అమలు చేయకపోవటం విద్యాశాఖ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. వెబ్ ఆన్‌లైన యాప్ మొదలకు వాటికి పాయింట్లు పెట్టడం ఏమి ప్రతిభనే అర్థంకాదు.

ఇలాంటి అసంబద్ధ బదిలీ ఉత్తర్వుల రద్దుకు పాఠశాలల మూసి వేతకు వ్యతిరేకంగా చేసే ఉద్యమాలకు ఉపాధ్యాయులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.వి.సుబ్బ రాజు, జిల్లా కార్యదర్శి కె.గంగన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

### ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని విడుదల చేసిన ఉత్తర్వును రద్దు చేయాలి

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 19కంటే తక్కువగా వున్న పాఠశాలలను విలీనం పేరుతో శాశ్వతంగా మూసివేయాలని విడుదలచేసిన ఉత్తర్వు ఉత్తర్వు 29ను రద్దు చేయాలని యుటియఫ్ జిల్లా కార్యదర్శి జె.యల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో మే 26న ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిఓ 29 వల్ల జిల్లా వ్యాప్తంగా 162 ప్రాథమిక పాఠశాలలు మూతపడుతున్నాయని అన్నారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రాథమికోన్నత పాఠశాలకు నలుగురు పాఠశాల సహాయకులను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు దావీదు, భాస్కర్, దేవపాల్, కృష్ణ, నాగరాజు, పెద్దారెడ్డి, జ్ఞానప్రకాష్, రామాంజనేయులు, కౌలన్న, బడే సాహెబ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# దాచూరి రామిరెడ్డి ప్రథమ వర్ధంతి సభలు

**కృష్ణా జిల్లా**

**మచిలీపట్నం :**



యుటియఫ్ వ్యస్థాపకులు దాచూరి రామిరెడ్డి ప్రథమ వర్ధంతి సభ బందరు ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఎం.అగస్టీన్ అధ్యక్షతన మే 10న మచిలీపట్నం ఈడేపల్లి ఎన్ఎస్ యుటియఫ్ భవన్‌నందు నిర్వహించబడినది. ప్రధానవక్తగా విచ్చేసిన శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ డి.రామిరెడ్డి జీవిత విశేషాలు, విద్యారంగానికీ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషిని వివరించినారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళుర్పించినారు. జిల్లా ప్రధానకార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రామిరెడ్డి త్యాగాల ఫలితంగా ఉపాధ్యాయులకు మెరుగైన జీతాలు, ఎన్నో సౌకర్యాలు సమకూడాయని, నేటితరం ఉపాధ్యాయులందరూ ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిలర్ జె.వి. రఘుకాంత్, మాజీ జిల్లా అధ్యక్షులు ఎస్.పార్వతీశం తదితరులు మాట్లాడుతూ ఆయన ఎంతో ఆదర్శ వంతమైన జీవితాన్ని గడిపారనీ, ఆయనతో వారికిగల అనుబంధాన్ని గురించి తెలియజేసినారు. సదరు సంతాప సభకు బందరు ప్రాంతంలో గల పలు మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, సీనియర్ ఉపా ధ్యాయులు, కార్యకర్తలు నివాళు ర్పించి వారి ఆశయ సాధనకు పునరిం కితమవ్వాలని ఆకాంక్షించారు.

**నాగాయలంక :**



యుటియఫ్ వ్యస్థాపకుడు డి.రామిరెడ్డి ఆదర్శాలను ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. మే 11న స్థానిక సంఘ కార్యాలయంలో రామిరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం జరిగింది. రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రీగ్రూపింగ్ స్కేలును ప్రవేశపెట్టిన ఘనత రామిరెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగాలలో ఉన్న 140 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు, బిజి గోపాలకృష్ణ, నవజీవన్, సబ్బినేని సురేష్, ఎం.యజ్ఞనారాయణ, డి నిరీక్షణరావు, ఎం.వెంకటేశ్వరరావులు రామిరెడ్డి సేవలను కొనియాడారు.

**గుడివాడ :**



యుటియఫ్ వ్యవస్థాపకులు దాచూరి రామిరెడ్డి లేని లోటు తీర్చలేనివని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్ఎన్‌పురం యుటియఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మే 5న సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.రమేష్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధానకార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు, కార్యదర్శులు బండి గోవర్ధనరావు, టి. సీతారామయ్య, జె.రాంప్రసాద్, కెవి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**మైలవరం :**



ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా, శాసనమండలి సభ్యునిగా దివంగత దాచూరి రామిరెడ్డి విశేష సేవలు అందించారని శాసనమండలి సభ్యుడు బొడ్డు నాగేశ్వరరావు పేర్కొన్నారు. రామిరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని మే 12న యుటియఫ్ మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండల శాఖల ఆధ్వర్యంలో మైలవరం ఎమ్మార్సీ భవనంలో సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ యుటియఫ్ స్థాపనలో రామిరెడ్డిది ప్రధాన భూమికన్నారు. సంఘం ద్వారా అనేక సేవలు అందించారని తెలిపారు. ఎమ్మెల్సీగానూ ఆయన విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఎస్పి మనోహర్‌కుమార్, కోశాధికారి కృష్ణ సుందర రావు, మండల నాయకులు జాన్, పాల్ బాబూరావు, పి.వెంకటేశ్వర రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కలిదిండి :**

యుటియఫ్ వ్యస్థాపకులైన దాచూరి రామిరెడ్డి ఆదర్శ ప్రాయుడని ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో రామిరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ 16యేళ్ళ సర్వీస్‌ను వదిలిపెట్టి ఉపాధ్యాయులు సంక్షేమం కోసం దాచూరి రామిరెడ్డి విశేష కృషి

చేశారన్నారు. ఎఎస్ఎస్ స్కేల్స్ సాధించడంలో దాచూరి కృషి అమూల్యమైందన్నారు.



ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రమేష్, రాష్ట్ర కౌన్సిలర్లు సిహెచ్.వరలక్ష్మి, పి.సాగర్‌బాబు, కైకలూరు మండల ప్రధాన కార్యదర్శి ఎం.రవిశంకర్, కలిదిండి మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.వెంకటేశ్వరరావు, నున్నా ఆంజనేయులు, యుటియఫ్ సభ్యులు మురళీప్రసాద్, పి.నాగరాజు, వి.రామకృష్ణ, సమిత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**తిరువూరు :**



తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల ఆధ్వర్యంలో తిరువూరు యుటియఫ్ కార్యాలయమునందు తిరువూరు శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు అధ్యక్షతన డి.రామిరెడ్డి వర్ధంతి సభ మే 5న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బి.నాగేశ్వరరావు రామిరెడ్డి గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సంఘ నిర్మాణంలోను, ఉద్యమంలోను ముఖ్యపాత్ర పోషించాలరని, ఆయన పోరాటపటిమని మనం ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఇంకా రామిరెడ్డి పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫ్లోర్ లీడర్‌గా అనేక సమస్యలపై శాసన మండలిలో ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. జిల్లా కోశాధికారి కృష్ణ సుందరరావు మాట్లాడుతూ ఎస్‌టిఎఫ్‌ఐని ఏర్పాటు చేయడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని, ఎస్‌టిఎఫ్‌ఐ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పిఎఫ్ఆర్‌డిఏ బిల్లుపై అనేక పోరాట కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ అపర్ణ, ఎం.శ్రీనివాస్, ముత్తయ్య మరియు మూడు మండలాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విస్సన్నపేట:**

విస్సన్నపేట, రెడ్డిగూడెం, చాట్రాయి మండలాల ఆధ్వర్యంలో విస్సన్నపేటలో జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన రామిరెడ్డి వర్ధంతి సభ మే 6న నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు, జిల్లా కోశాధికారి ఏ.కృష్ణ సుందరరావు పాల్గొన్నారు. కెఏ ఉమామహేశ్వరరావు ముందుగా చిత్ర పటానికి పూలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ యుటియఫ్ ఉద్యమంలో రామిరెడ్డి మరువలేని నాయకులని, పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్‌గాను, ఎస్‌టిఎఫ్‌ఐ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శిగాను ఆయన సమస్యలపై చేసిన ప్రాతినిధ్యాలు, పోరాటాలు మనకు మార్గదర్శకమని చెప్పారు. కోశాధికారి ఏ.కృష్ణసుందరరావు మాట్లాడుతూ ఆయన జీవిత చరిత్ర, పోరాటపటిమ పోరాట పటిమ మనమందరం మార్గదర్శకంగా తీసుకోవాలని ఆయన అడుగుజాడలలో నడిచినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సత్యనారాయణరెడ్డి, జి.నాగేశ్వరరావు, లక్ష్మిపతి, సూర్య నారాయణ, జి.సత్యనారాయణరెడ్డి, వీరకోటి, ఎల్.బాబురావు, ఇంక మూడు మండలాల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

**గన్నవరం :**



గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల ఆధ్వర్యంలో గన్నవరంలో దాచూరి రామిరెడ్డి గారి వర్ధంతిసభ జిల్లా కార్యదర్శి కె.వరప్రసాద్ అధ్యక్షతన మే 7న నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షురాలు కె.భగీరథి, కోశాధికారి ఏ.కృష్ణసుందరరావు, రాష్ట్ర కౌన్సిలర్ పి.ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా రామిరెడ్డిగారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి పోరాటాలు, నిరాడంబరత మనందరికి మార్గదర్శకమని, ఎమ్మెల్సీ గాను, ఎస్‌టిఎఫ్‌ఐ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శిగాను ఆయన చేసిన ప్రాతినిధ్యాలు, పోరాటాలు మనం గుర్తించుకోవాలని, ఆయన అడుగు జాడలో మనం నడవడం ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని ఆయన చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో మూడు మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డిఎస్.ప్రసాద్, ఎం.ప్రసాద్, తాతబాబు, దుర్గారావు, సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జగ్గయ్యపేట :**



జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో దాచూరి రామిరెడ్డి వర్ధంతి సభ జిల్లా కార్యదర్శి ఎస్‌కె దస్తగిరి అధ్యక్షతన నిర్వహించబడినది. ముందుగా రామిరెడ్డిగారి చిత్రపటానికి ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రామిరెడ్డి గారి పోరాటాలు, ఆయన జీవిత చరిత్రను వివరించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీగా ఆయన శాసన మండలిలో మన వాణిని విన్పించారు. ఎస్‌టిఎఫ్‌ఐ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఆయన పిఎఫ్ఆర్డిఏ బిల్లుపై చేసిన పోరాటాలను వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మూడు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విజయవాడ :**



విజయవాడ డివిజన్‌లో దాచూరి రామిరెడ్డి వర్ధంతి సభ విజయవాడ యుటియఫ్ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా సహాధ్యక్షులు ఎంఎస్ రాజు అధ్యక్షతన మే 8న నిర్వహించబడినది. ముందుగా రామిరెడ్డి చిత్రపటానికి బొడ్డు నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇంకా కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్ కుమార్, ప్రధానకార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.లీల, జిల్లా సహాధ్యక్షురాలు కె.భగీరధి, ప్రచురణల కమిటీ కన్వీనర్ కె.నాగభూషణరావులు రామిరెడ్డిగారికి నివాళులర్పించి వారి ఔన్నత్యాన్ని కొనియాడారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నెల్లూరు జిల్లా**



అమరజీవి దాచూరి రామిరెడ్డి ప్రథమ వర్ధంతి సభ నెల్లూరు నగరంలోని సుంకు చెంగన్న ఉన్నత పాఠశాలయందు మే 7న జరిగింది. సీనియర్ నాయకులు టి.కొండాచారి దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్య కర్తలందరూ వరుసగా నివాళులర్పించారు. రామిరెడ్డి ఆశయాలకు పునరంకితమవుతామని, విద్యాపరిరక్షణ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడతామని ప్రతినబూనారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా శాఖ అధ్యక్షులు కె.తులసీరాంబాబు మాట్లాడుతూ రామిరెడ్డి ప్రజలను చైతన్యవంతు లను చేసి తను పనిచేసే గ్రామంలోని భూస్వాముల భరతం పట్టారని పేద ప్రజల అభివృద్ధికి, సమాజమార్పుకు కృషి చేశారని వారి ఆశయా లకనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు టి.కొండాచారి మాట్లాడుతూ దాచూరితో కలిసి పనిచేయడం ద్వారా క్రమశిక్షణ కల్గిన కార్యకర్తగా ఎదగడం జరిగిందని, వారి జీవితం త్యాగమయం అని, ఉపాధ్యాయ ఉద్యమానికి మార్గదర్శియని, ఉపా ధ్యాయుల నేటి స్థాయికు కారకుడని వారి బాటన నడచి వ్యవస్థను కాపాడుకోవాలని తెలియజేశారు.

రాష్ట్రకార్యదర్శి బి.శ్రీదేవి మాట్లాడుతూ నేడు అనేక సవాళ్ళు మన ముందున్నాయని ఒకవైపు ప్రభుత్వ విద్యావ్యవస్థ నీరు కారిపోవడం మరోవైపు ఉపాధ్యాయ హక్కులు కాలరాయడం జరుగుతుందని వారు చూపిన మార్గాన సవాళ్ళను అధిగమించాలని, సమాజాన్ని కదిలించి సమస్యల పరిష్కారానికి తోడు తెచ్చుకునేవారన్నారు.

జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ రామిరెడ్డిగారిని సంస్మరించుకోవడం అంటే వారు చూపిన మార్గాన పయనించడమేనన్నారు. దాచూరి ఆశయాలకనుగుణంగా బూటకపు దేశభక్తిని ఎండకట్టాలని ప్రజలతో మమేకమై పనిచేయడం ద్వారా వ్యవస్థని కాపాడుకోవాలని కార్యకర్తను కోరారు.

జిల్లా సహాధ్యక్షులు ఎన్.వి.సుబ్బారావు మాట్లాడుతూ దాచూరి నిరాడంబరత, సమస్యలపై పట్టు, సమయపాలన కార్యకర్తలపై మొక్క వోని ప్రేమ కార్యకర్తలందరూ అలవచ్చుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.నాగిరెడ్డి, జిల్లా నాయకులు ఎస్‌కె బాబు, టి.స్వర్ణలత, ఎమ్మెల్సీ అచ్చయ్య, టి.వాసుదేవరావు, డి. గోపాల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంతాపం



**భీమవరం :** పశ్చిమగోదావరి జిల్లా ప్రధాకర్యాదర్శి బి.గోపిమూర్తి తండ్రి బొర్రా నాగేశ్వరరావు సంస్మరణ సభ భీమవరం యుటియఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పలువురు యుటియఫ్ నాయకులు బొర్రా గోపీమూర్తి మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సభలో జిల్లా కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడుతూ గోపిమూర్తి తండ్రి బొర్రా నాగేశ్వరరావు మే 8న వారి స్వస్థలం యలమంచిలి మండలం హెచ్/ఓ మట్లపాలెం గమళ్లపాలెంలో అనారోగ్యంతో మరణించారు. నాగేశ్వరరావు చిరు వ్యాపారిగా తన ముగ్గురు కుమారులను ఉన్నత విద్యవరకు చదివించా రన్నారు.. కుమారులు శ్రీనివాసరావు, గోపి మూర్తి, నాగబాబు ముగ్గురుకూడా ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని వారిలో గోపిమూర్తి యుటియఫ్ నాయకునిగా ఎదిగి జిల్లా ప్రధానకార్యదర్శిగా ఉపాధ్యాయులకు, ఉద్యోగు లకు ఎనలేని సేవలు అందిస్తున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంఐ విజయకుమార్, రాష్ట్ర కౌన్సిలర్ పి.సీతారామరాజు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావు, సీనియర్ నేతలు జివివి రామానుజరావు, సిహెచ్‌వివి సత్యనారాయణ, మండల నాయకులు ఎన్.భాను మహేష్, పిఎస్ విజయరామరాజు, జి.సుధాకర్, సిహెచ్ కుమార బాబ్జీ, డి.పుల్లారావు, కెసిహెచ్ సాయిరాం, డేవిడ్ రాజు, ఎ.రామశేషుబాబు, టి.వెంకటేశ్వరరావు కె.సత్య నారాయణ, కె.రవిచంద్రకుమార్, టి.సురేష్, విట్‌సన్ పాల్, రవితేజ, ఆర్ఆర్ శర్మ, గణపతిరావు, కె.ఫణిశేకర్, కె.చంద్ర రావు, పివిఆర్ఎస్ఎస్ సూర్యనారాయణ, జివి మురళీధర్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ శిక్షణా తరగతులు

## కృష్ణా జిల్లా




కృష్ణా జిల్లాశాఖ ఉపాధ్యాయ ఉద్యమ శిక్షణా తరగతులను రాష్ట్ర కార్యాలయంలో మే 12,13 తేదీలలో నిర్వహించబడినవి. మొదటి రోజు శిక్షణా తరగతులు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు "సమైఖ్యవాదం – సవాళ్ళు' గురించి వివరించారు. యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి "యుటియఫ్ నిబంధనావళి" గురించి వివరించారు. ఐక్యఉపాధ్యాయ పత్రిక సంపాదకవర్గ సభ్యులు టిఎస్ ఎల్ఎన్ మల్లేశ్వరరావు "ఇన్–కం–టాక్స్, సిపిఎస్ ఇతర సర్వీస్ నిబంధనలు" వివరించారు. రెండవ రోజు యుటియఫ్ రాష్ట్ర సహా ధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు "విద్యావిధానం–పోకడలు" గురించి వివరించారు. రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు 'ఉ ద్యమ చరిత్ర'ను వివరించారు. శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు 'కృష్ణా జిల్లా యుటియఫ్ నిర్మాణం' వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్‌గా జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్‌కుమార్ వ్యవహరిం చారు. జిల్లా ప్రధానకార్యదర్శి కె.ఏ.ఉ మామహేశ్వరరావు, కోశాధికారి ఎ.కృష్ణసుందరరావు, సహాధ్యక్షులు ఎంఎస్ రాజు, కె.భగీరథి మరియు జిల్లా కార్యదర్శులు, వివిధ మండలాల ప్రధాన బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా

### ఉత్తేజాన్నిచ్చిన జిల్లా ఉద్యమ శిక్షణా తరగతులు



డా॥ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జిల్లాస్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు మే 8,9 తేదీలలో నిర్వహించడం జరిగింది. ఈ తరగ తులకు టీచర్లుగా 8వ తేదీన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు "సమాజం– సమైక్యత"ను, యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు 'ఉపాధ్యాయ ఉద్యమం – ప్రస్తుత పరిస్థితులు", ఐక్యఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు సిహెచ్.శ్రీహరి 'జిల్లా ఉద్యమము'ను బోధించారు. మే 9న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం "నూతన విద్యావిధానం–రాబోవు విపత్కర ధోరణులు", ఐక్యఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు 'సర్వీసురూల్స్', యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి 'ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణం' బోధించారు. శిక్షణా తరగతులకు ప్రిన్సిపల్‌గా ఎన్‌వి సుబ్బారావు వ్యవహరించారు.

ఈ తరగతులకు అన్ని మండలాలనుండి ప్రిన్సిపాల్ ఆఫీసు బేరర్లు మరియు జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు మొత్తం 270మంది పాల్గొన్నారు. ఈ శిక్షణా తరగతులు మంచి వసతి ఏర్పాటు చేయడం, రాష్ట్రస్థాయి టీచర్లచే తరగతులు బోధించడం జరిగింది. జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.తులసీరాంబాబు, ఎన్.నవకోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎం.మస్తానయ్య, కోశాధికారి కె.నాగిరెడ్డి, జిల్లా కార్యదర్శులు ఎం.అచ్చయ్య, ఎస్‌కె బాబులు పర్యవేక్షణలో జరిగాయి.

## శ్రీకాకుళం జిల్లా

### శిక్షణా తరగతులు ఒక్కపూట నిర్వహించాలి

జిల్లాలో జరుగుతున్న ఆర్ఎంఎస్ఏ శిక్షణా తరగతులు వేసవి ఎండల దృష్ట్యా ఒక్కపూట మాత్రమే నిర్వహించాలని ఉపాధ్యాయులను రెసిడెన్షియల్‌గా రాత్రిపూట శిక్షణా కేంద్రాలలో నిద్రించాలనే నిబంధన సడలించాలని, శిక్షణా కేంద్రాలలో సౌకర్యాలు మెరుగుపర్చాలని ఫ్యాప్టో–జాక్టో శ్రీకాకుళం జిల్లా కమిటీ మే 23న జిల్లా విద్యాశాఖాధి కారిని కోరింది. అదే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులు 29 ప్రకారం పాఠశాలలు, ఉపాధ్యాయ పోస్టులు రేషనలైజేషన్ జరిగితే వందలాది పాఠశాలలు మూతపడతాయని, ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా మారతాయని ప్రభుత్వం పునరాలోచించి పాఠశాలల మూసివేతను ఆపాలని ఉపాధ్యాయ పోస్టులు రద్దు విరమించుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఫ్యాప్టో–జాక్టో సమావేశం డిమాండ్ చేసింది.

యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఫ్యాప్టో–జాక్టో సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, పిఆర్‌టియు జిల్లా ప్రధానకార్యదర్శి బి.రవికుమార్, ఏపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు టి.చలపతిరావు, ఆపస్ జిల్లా ప్రధానకార్యదర్శి పి.రవిప్రసాద్, హెచ్ఎంఏ జిల్లా అధ్యక్షులు పి.దాలి నాయుడు, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.అప్పలరాజు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం రాష్ట్ర అధ్యక్షులు బి.ధనుంజయరావు, ఎన్ఎల్‌టిఏ జిల్లా అధ్యక్షులు పి.వసంతరావు, ఆర్‌యుపిపి జిల్లా ప్రధానకార్యదర్శి కె. పద్మావతి, పూడి జనార్ధనరావు, ఎస్టీయు జిల్లా కార్యదర్శి సిహెచ్. రామారావు, యుటియఫ్ నాయకులు ఎస్.కిశోర్‌కుమార్, ఏపిటిఎఫ్ నాయకులు జి.బాలజీరావు, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం జిల్లా

### విస్తృతంగా జిల్లా అంతా ఉపాధ్యాయ శిక్షణా శిబిరాలలో పర్యటనలు

జిల్లా వ్యాప్తంగా గత 25 రోజులుగా ఆయా కేంద్రాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాలను యుటియఫ్ రాష్ట్ర, జిల్లా నాయకత్వం విస్తృతంగా పర్యటించి విద్యారంగంలో తాజా పరిణామాలను వివరించడం జరిగింది. ఆర్ఎంఎస్ఏ, ఆర్‌విఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా శిబిరాలలో విద్యారంగానికి

నష్టం కలిగించే ప్రభుత్వ విధానాలను వెనక్కు తీసుకోవాలని అన్నారు. ప్రధానంగా పాఠశాలలు మూసివేసే జిఓ 29ను రద్దు చేయాలని, కౌన్సిలింగ్ విధానాన్ని పరిరక్షించాలని, ప్రతిభ ఆధారిత పాయింట్లను రద్దు చేయాలని, అక్రమ బదిలీలను రద్దుచేయాలని తదితర అంశాలపై శిక్షణా శిబిరాలలో అవగాహన కల్పిస్తూ వివరించడం జరిగింది.



ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.శ్రీనివాస్, కె.శేషగిరి, జిల్లా సహాధ్యక్షులు ఎస్.మురళీమోహన్, జి.నిర్మల, రమేష్ పట్నాయక్, శివ వర్మ, వెంకట రావు, రమేష్, శ్రీరాములు, సత్యశ్రీనివాస్, మధుసూధనరావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పిడిఎఫ్ ఎమ్మెల్సీల అభినందన సభ

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఇటీవల ఎన్నికల్లో పిడిఎఫ్ నిలిచిందని శాసన మండలి ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాసులురెడ్డిలను గుంటూరు జిల్లా యుటియఫ్ శాఖ ఆధ్వర్యం లో స్థానిక వైన్ డీలర్స్ కళ్యాణ మండపంలో మే 19న నిర్వహించిన సభలో అభినందించారు. సభకు యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె.నాగ మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో ప్రజలకు అవసరమైన ప్రత్యామ్నాయ విధానాలు ప్రతిపాదిస్తూ, వాటికోసం పోరాడటం ద్వారానే పిడిఎఫ్ గెలుపు సాధ్యమైందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో విద్యారంగంలో అంతరాలు పెరుగుతున్నాయన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వంతపాడుతూ విద్యా ప్రైవేటీకరణను ప్రోత్సహి స్తున్నాయన్నారు. కార్పొరేట్ శక్తులు రాష్ట్ర రాజకీయాలను శాసించాలని ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఇటీవల ఎన్నికల్లో కార్పొరేట్ శక్తుల జోక్యం పెరిగిందన్నారు. ఇదే విధానం కొనసాగితే భవిష్యత్‌లో ప్రజల్ని శాసించే స్థాయి వెళ్లిపోతుందని, ప్రభుత్వ రంగాన్ని వెనక్కి నెట్టి ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. కార్పొరేట్ కబంధ హస్తాల నుండి విద్యారంగ రక్షణకు ఉపాధ్యాయులు, మేధావులు కలిసి రావాలన్నారు.

ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తమ గెలుపులో గుంటూరు జిల్లా యుటియఫ్ కార్యకర్తలు, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, కెఎస్ లక్ష్మణ రావు కృషి మరువలేనిదన్నారు. ప్రభుత్వరంగ రక్షణకు అందరూ కలిసి పోరాడాలన్నారు. ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలను ఓడించటానికి నైతికంగా, ఆర్థికంగా అన్ని రకాలుగా విశ్వప్రయత్నాలు చేసి విఫలమయ్యారన్నారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వర రావు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీల గెలుపులో యుటియఫ్ పాత్ర కీలకమైందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ రావు మాట్లాడుతూ విఠపు బాలసుబ్రహ్మణ్యం మూడోసారి, శ్రీనివాసులు రెడ్డి రెండో దఫా గెలుపొంది రికార్డ్ నమోదు చేశారన్నారు. సాంకేతి కంగా ఓటమి పాలైన డా॥ ఎం.గేయానంద్, ఆజ శర్మలు కూడా నైతికంగా గెలుపొందారన్నారు. వారికి గతంకంటే మంచి ఓట్లు నమోదయ్యాయని వివరించారు. పిడిఎఫ్‌పై ఆదరణకు ఇది సూచికగా పేర్కొన్నారు. పిడిఎఫ్ గెలుపు పేద వర్గాల వెన్నుదన్నుగా లక్ష్మణరావు అభివర్ణించారు.

యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగ, ప్రైవేటీకరణ పెరుగుతుందని యుటియఫ్ నిర్మాణానికి మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యా యుల్ని చైతన్యపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల్ని చైతన్యపర్చుకోవటానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అధికార పార్టీని ఢీకొని గెలవటం పెద్ద విజయమన్నారు. యుటియఫ్ ఆవిర్భావం నుండి అనేకమంది ఎమ్మెల్సీల గెలుపులో కీలక భూమిక పోషించిందని, ఇది ఉద్యమ స్ఫూర్తికి ప్రతిబింబమన్నారు.

అనంతరం ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డిని శాలువాతో అభినందించారు. కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎన్.తాండవకృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు, ఉపా ధ్యాయులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రాము కుటుంబానికి ఆర్థిక సహాయం



గుండెపోటుతో చిన్నబ్బిపురం గ్రామం, ఏఎస్ పేట (మం) నెల్లూరు జిల్లాలో మరణించిన ప్రజానాట్యమండలి కళాకారుడు రాము కుటుంబానికి జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ మరియు ఏఎస్ పేట, పొందలకూరు యుటియఫ్ మండల శాఖలు సేకరించిన 2 లక్షల రూపాయలను నెల్లూరు ప్రకాశం, చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ద్వారా రాము భార్య, తల్లికి అందజేశారు. విబివిస్ రాము కుటుంబానికి అండగా ఉంటామని, పిల్లలను బాగా చదువుకొనుటకు ఈ డబ్బు వినియోగిం చాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా జెవివి అధ్యక్షులు బుజ్జయ్య ప్రధానకార్యదర్శి భాస్కరరావు, యుటియఫ్ జిల్లా కార్యదర్శి ఎ. మురళీధరరావు, హరికృష్ణ, గద్దర్‌బాబు, యుటియఫ్ అధ్యక్షులు ఎస్‌కె చాన్‌భాష, కోశాధికారి సలీంభాష, కరుణాకర్, జెవివి ఆత్మకూరు అధ్యక్షులు ఎస్‌కె ఖజరాసుల్, సాత్విక్ సుధాకర్ పాల్గొన్నారు. రాము జెవివి, యుటియఫ్ కార్యక్రమాలలోను, అక్షర దీపం సంపూర్ణ అక్షరాస్యతా కార్యక్రమంలోనూ, సారా ఉద్యమంలోను తన పాటలతో ప్రజలను చైతన్యపరచాడు.

# నిరసనలు - ధర్నాలు

## శ్రీకాకుళం జిల్లా

### అక్రమ బదిలీలు రద్దు చేయాలి
### డిఇఓ కార్యాలయం వద్ద యుటియఫ్ నిరాహారదీక్ష



ప్రభుత్వం అమలు చేస్తున్న అక్రమ బదిలీలను రద్దుచేయాలని, పాఠశాలల మూసివేత, పోస్టుల కుదింపు ఆపాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న నిరాహారదీక్షలకు మద్దతుగా శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద యుటియఫ్ ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు జరిగాయి. యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. దీక్షలను ఉద్దేశించి గిరిధర్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఆపాలని, పేద బడుగు బలహీనవర్గాల వారికి విద్య లేకుండా చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుందని హెచ్చరించారు. బదిలీల కౌన్సిలింగ్‌కు షెడ్యూల్ ప్రకటించకుండా బదిలీలు చేస్తే ప్రభుత్వం అప్రదిష్ట పాలవుతుందని హెచ్చరించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ఏమైన జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వుంటుందని హెచ్చరించారు.

దీక్ష శిబిర నిర్వాహకులు యుటియఫ్ జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహన రావు ప్రసంగిస్తూ కౌన్సిలింగ్ సిస్టమ్‌ను తీసుకొచ్చానని గర్వంగా చెబుతున్న గౌరవ ముఖ్యమంత్రి అదే కౌన్సిలింగ్ సిస్టమ్‌ను తూట్లు పొడవడం భావ్యం కాదన్నారు. పాఠశాలల మూసివేతను ప్రజా ఉద్యమాల ద్వారా తిప్పికొడతామన్నారు. యుటియఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.కిశోర్‌కుమార్ ప్రసంగిస్తూ ఉద్యోగులు ఉపాధ్యాయులు ఆందోళన తీవ్రతరం కాకమునుపే ప్రభుత్వం కళ్లుతెరిచి సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నిరాహారదీక్ష శిబిరంలో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షులు బమ్మిడి శ్రీరామమూర్తి, ఎం. వాగ్దేవి, జిల్లా కోశాధికారి పొందూరు అప్పారావు ప్రసంగించారు.

యుటియఫ్ జిల్లా నాయకులు కె.గౌరినాయుడు, కె.చంద్రరావు, వై.ఉమాశంకర్, ఎ.లక్ష్మీనారాయణ, శ్రీరామచంద్రమూర్తి, బి.రవి కుమార్, ఎ.శ్రీనివాసరావు, టి.సుధీర్, కె.హరినారాయణ, జిల్లా నాయకత్వం పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శులు జి.కొదండరావు, ఎల్.బాబూరావు, పి.మురళీ, టి.వైకుంఠరావు, గొంటి సురేష్, హెచ్ అన్నాజీ రావు, కె.వి.శ్రీరామ మూర్తి, బి.మాలతి, హేమలత, పి.మురళీధర్, రవికుమార్, శ్రీరంగ, నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం జిల్లా

### మున్సిపల్ టీచర్ల అసంబద్ధ రేషనలైజేషన్‌ను అడ్డుకున్న యుటియఫ్




ప్రభుత్వం మున్సిపాలిటీ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ఇచ్చిన జిఓ 210 అసంబద్ధంగా ఉందని, పురపాలక విద్యకు నష్టంలేకుండా అదనపు విద్యార్థులు ఉన్నచోట సర్దుబాటు చేయాలని, కమీషనర్ పూల్‌లో టీచర్లను ఉంచరాదని యుటియఫ్ జిల్లా శాఖ మున్సిపల్ ఆర్‌డి ఆశాజ్యోతికి ప్రాతినిధ్యం చేయగా అంగీకరించక పోవడంతో రేషనలైజేషన్ కౌన్సిలింగ్ ప్రక్రియను యుటియఫ్ ఆధ్వర్యం లో ఉపాధ్యాయులు బహిష్కరించారు. జిల్లాలో గల 4 మున్సిపల్ కేంద్రాలలో గల సర్దుబాటు ఉపాధ్యాయులను విజయనగరం జిల్లా కేంద్రానికి జోనల్ ఆర్‌డి ఆశాజ్యోతి పిలిపించి ప్రక్రియను జిఓలో గల నిబంధనలకు విరుద్ధంగా కూడా జరపటంతో బహిష్కరించారు.

తరువాత చర్చలకు యుటియఫ్ నాయకత్వాన్ని ఆహ్వానించిన ఆర్‌డి మన సంఘం పెట్టిన డిమాండ్లను అంగీకరించడంతో 1వ తేదీన కౌన్సిలింగ్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శు లు కె.శ్రీనివాస్, కె.శేషగిరి, జిల్లా నాయకులు రమేష్ పట్నాయక్, పిల్లా శ్రీనివాస్, జి.నిర్మల, పట్టణ నాయకులు రాములు, శ్రీనివాస్, సూర్యనారాయణ, 4 మున్సిపల్స్ యుటియఫ్ నాయకత్వం పాల్గొన్నారు.

### అక్రమ బదిలీలు రద్దు చేయాలి- రేషనలైజేషన్ జిఓను రద్దు చేయాలి - యుటియఫ్ రిలే నిరాహారదీక్షలు

మే 30వ తేదీన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విజయవాడలో ధర్నాచౌక్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు మద్దతుగా విజయనగరం కలెక్టరు కార్యాలయం ఎదుట జిల్లాశాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం దొడ్డి దారిన అక్రమ బదిలీలు చేపట్టి టీచర్ల కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తుందని అన్నారు. తక్షణమే అక్రమ బదిలీలను రద్దు చేయాలని, పాఠశాలలను మూసివేత జిఓ 210ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్ శిబిరాన్ని ఉద్దేశించి భవిష్యత్ పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు నిర్మల, సత్యశ్రీనివాస్, రమేష్ పట్నాయక్, నాగరాజు, పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం జిల్లా

### అక్రమ బదిలీలను తక్షణమే నిలిపివేయాలి



**అక్కయ్యపాలెం :** అక్రమ మార్గంలో చేపడుతున్న ప్రభుత్వ బదిలీలకు తక్షణమే నిలిపివేయాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము డిమాండ్ చేశారు. అక్రమ బదిలీలకు వ్యతిరేకంగా ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎమ్మెల్సీలు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షలకు ఒక రోజు నిరాహారదీక్షలు యుటియఫ్ ఆధ్వర్యంలో చేపట్టినట్టు చెప్పారు. విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరాహారదీక్షా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగా ఉపాధ్యాయుల బదిలీలు చేపడతామని చెబుతున్న ప్రభుత్వం, దొడ్డిదారిన చేస్తున్న అక్రమ బదిలీలకు ఏ ప్రతిభను ఆధారంగా తీసుకున్నారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకూ వందలాది బదిలీలు జరిగాయని, మరిన్ని బదిలీలకు పైరవీలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైఏఆర్కె ప్రసాద్, కెకె జాజులు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ ఆమోద యోగ్యమైన సాధారణ బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ సీనియర్ నాయకులు జి.సింహాద్రప్పడు, డిటిఎఫ్ నాయకుడు కెఎస్ సాయిప్రసాద్, ఆప్టా నాయకులు గణేష్, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్. వెంకటేశ్వర్లు, సీతారామయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.నాగరాజు, జిల్లా కోశాధికారి టి.అప్పారావు, వివిధ మండలాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి జిల్లా

### విజయవంతమైన ఐ.టి.డి.ఏ రంపచోడవరం ధర్నా




గిరిజన సంక్షేమ పాఠశాలలో అక్రమ రేషనలైజేషన్ మరియు బదిలీలను నిరసిస్తూ ఐ.టి.డి.ఏ రంపచోడవరం వద్ద యు.టి.ఎఫ్ తూర్పుగోదావరిజిల్లా శాఖ మే 22న ధర్నా చేపట్టింది. జరిగిన ధర్నా శిబిరంలో యు.టి.ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ప్రభాకరవర్మ మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు చర్చించి సమస్యలను పరిష్కరించపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యు.టి.ఎఫ్ ఐ.టి.డి.ఏ సబ్ కమిటీ కన్వీనర్ మరియు జిల్లా కార్యదర్శి ఇ.చైతన్యకిరణ్ మాట్లాడుతూ ఏజన్సీ 11 మండలాలలను ఒక యూనిట్‌గాను, సబ్‌ప్లాన్ మరియు మైదాన ప్రాంతాలను ఒక యూనిట్‌గాను తీసుకుని రేషనలైజేషన్ చేపట్టాలనే విషయం అధికారులకు అవగాహనలేదన్నారు. దీనివల్ల మైదాన ప్రాంతానికి 12 పోష్టులు తరలి వెళ్లడం వల్ల ఏజన్సీ గిరిజన అభ్యర్దులకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

యు.టి.ఎఫ్ జిల్లా కోశాధికారి కె.వి.ప్రసాద్ బాబు, జిల్లా కార్యదర్శులు యం.విజయగౌరి, టి.జి.వాషింగ్టన్, ఎ.షరీఫ్ తదితరులు ధర్నా శిబిరంలో సమస్యలపై మాట్లాడారు. ఐ.టి.డి.ఏ డిప్యూటి డైరెక్టర్, ప్రాజెక్ట్ అధికారి వారికి తెలియజేయడంతో రాత్రి 11గంటల ప్రాంతంలో యు.టి.ఎఫ్ ప్రతినిధి బృందాన్ని చర్చలకు ఆహ్వానించారు. మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 12 పోస్టులను ఏజన్సీ గిరిజన అభ్యర్థులతోనే నింపుతామని, దీనిపై తదనుకూలంగా గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారుల ఉత్తర్వులు కూడా తీసుకుంటామని హామీనిచ్చారు. మిగిలిన సమస్యలన్నీ పరిష్కరిస్తూ లిఖిత పూర్వక హామీనివ్వడంతో ధర్నా విరమించడమైనది.

### ఉపాధ్యా బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి & అక్రమ బదిలీలను రద్దు చేయాలి - కె.సత్తిరాజు

ఉపాధ్యాయ బదిలీలకు వెంటనే షెడ్యూల్ విడుదల చేస్తూ ఉత్తర్వులీయాలని యు.టి.ఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ లో ఈ డిమాండ్ల సాధన కోసం పి.డి.ఎఫ్ యం.ఎల్.సిలు చేపట్టిన నిరాహార దీక్షలకు సంఘీభావంగా తూర్పు గోదావరి జిల్లాలో మే 30వ తేదీన జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయం వద్ద నిరాహారదీక్షలు చేపట్టారు. నిరాహారదీక్షలను ప్రారంభిస్తూ సత్తిరాజు మాట్లాడారు. నిరాహారదీక్షా శిబిరానికి యు.టి.ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ప్రభాకరవర్మ అధ్యక్షత వహించారు. డి.వై.ఎఫ్ఐ నాయకులు పలివెల వీరబాబు పాల్గొని ప్రసంగించారు. నిరాహారదీక్షలలో యు.టి.ఎఫ్ జిల్లా బాధ్యులు డి.వి.రాఘవులు, టి.కామేశ్వరరావు, బేతినీడి శ్రీనివాసరావు, యం.విజయగౌరి, వి.సోనీ, పెంకే వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.వి.వి.నాగేశ్వరరావు, కు.సం.ప డైరెక్టర్లు యం.టి.వి.ఎ.యస్. సుబ్బారావు, యస్.నాగేశ్వరరావు, వివిధ మండలాల బాధ్యులు పి.లోవరాజేష్, ఎ.హరి, పి.వి.వి. సత్యనారాయణ, జె.వి.వి.సుబ్బారావు, కె.జనార్ధన స్వామి, యస్.వీరబాబులు పాల్గొన్నారు. డి.వి.రాఘవులు మాట్లాడుతూ నియమ నిబంధనల పేరిట ఉపాధ్యాయులను గందరగోళపరచి దొడ్డిదారి బదిలీలకు తెరతీశారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యా బదిలీలు అవినీతిమయం కావడం రాష్ట్రం తిరోగమనాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ నిరాహారదీక్షలో జిల్లా బాధ్యులు జోగా అప్పారావు, కె.వి.ప్రసాద్ బాబు, పి.కిష్టయ్య, యం.వెంకటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఎ.షరీఫ్, టి.వి.జి.జి.ఆర్.ఆర్. చక్రవర్తి, యస్.యస్.వి.చలపతి, ఆర్.వి.రమణమూర్తి, వి.వి.రమణ, ఐ.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. నిరాహారదీక్షలకు యస్.టి.యు. జిల్లా అధ్యక్షులు పి.సుబ్బరాజు, వ్యాయామోపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు గోవిందు, ఎల్.జార్జి విచ్చేసి సంఘీభావాన్ని తెలియజేశారు.

### ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాలలో నిరసనలు

పి.డి.ఎఫ్ శాసనమండలి సభ్యుల నిరాహారా దీక్షలకు సంఘీభావంగా మే 31వ తేదీన జిల్లాలో జరుగుతున్న అన్ని శిక్షణా కేంద్రాలలో నల్ల బ్యాడ్జీలతో కూడిన నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రాజోలు శిక్షణా కేంద్రం, ఉప్పలగుప్తం, అమలా పురంలో, ముమ్మిడివరంలో, ఐ.పోలవరంలో, కపిలేశ్వరపురంలో, రామచంద్రాపురంలో, బిక్కవోలు, కాకినాడలో, యు.కొత్తపల్లి, పిఠాపురంలో, తునిలో, ప్రత్తిపాడులో, రాజవొమ్మంగి, గంగవరంలో, దేవీపట్నంలో, కోరుకొండలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమాలలో జిల్లా బాధ్యులు, స్థానిక మండల శాఖల బాధ్యులు పాల్గొన్నారు.

**చిత్తూరు జిల్లా**

### జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు నిరాహారదీక్షలు



గత నెలరోజుల నుండి ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలను అక్రమం గా చేపడుతున్న ధోరణిని ఎండగడుతూ, ఆ అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, సత్వరమే ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించాలని, అదే విధంగా లక్షలాది ఉద్యోగ, ఉపా ధ్యాయుల జీవన్మరణ సమస్య అయినటువంటి సిపిఎస్‌ను రద్దు చేయాలని, గత 3 సం॥లుగా ప్రభుత్వ నాన్చివేతకు గురవుతున్న పిఆర్‌సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రెండు విడతల డిఏను వెంటనే మంజూరు చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న నిరాహారదీక్షకు మద్దతుగా చిత్తూరు జిల్లా యుటియఫ్ శాఖ ఆధ్వర్యంలో నిరాహారదీక్ష స్థానిక డిఇఓ కార్యాలయం ఎదుట మే 30న జరిగింది. ఈ సందర్భంగా యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం. సోమశేఖర్‌నాయుడు, ఎన్.గుణశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ రేషనలైజేషన్ పేరిట సంక్షేమరంగమైన విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నదని, ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయాలని కుట్రపన్నుతున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తున్నామని, ఉపాధ్యాయ ఉద్యోగాలొస్తాయని ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత ఆశలను నిర్వీర్యం చేసే విధంగా అనేక ఉపాధ్యాయ పోస్టులను అధికంగా చూపుతూ రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నిరాహారదీక్షా శిబిరంలో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రాధాకృష్ణ, కార్యదర్శులు పరంధామనాయుడు, పిఆర్ మునిరత్నం, జివి రమణ, కె.శేఖర్, సుధాకర్‌రెడ్డి, పట్టాభి, సిపి ప్రకాష్, రెడ్డెప్ప నాయుడు, చంద్రారెడ్డి, కన్నయ్య, రమేష్, గోవిందస్వామి, సునందన రెడ్డి, ఆంజనేయులు, ఓ.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కడప జిల్లా**

### అక్రమ బదిలీలు ఆపాలి - బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి



ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కడప జిల్లా ఆధ్వర్యంలో ఉపా ధ్యాయ అక్రమ బదిలీల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం వద్ద నిరాహారదీక్షలు మే 30న జరిగాయి. ఈ దీక్షలను ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బి.లక్ష్మిరాజ నాయకులు యు.జయరామయ్య, కె.సురేష్‌బాబు, పి.చంద్రశేఖర్, ఎస్.వి.సుబ్బరాజు, ఎస్.ఇలియాస్‌భాషా, ఎస్.ఇక్బాల్ నిరాహారదీక్షలు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నెలలోనే షెడ్యూల్ ప్రకటించి జూన్ 11లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని చప్పి దొడ్డిదారి అక్రమంగా బదిలీలకు సిద్ధపడటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ అక్రమ బదిలీలల్లో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని అన్నారు. ఇప్పటివరకు చేసిన అక్రమ బదిలీలు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ బదిలీలు ఆపి బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ దీక్షలలో పి.చెంగల్‌రాజు, పి.రషీద్‌ఖాన్, బి.హరిప్రసాద్, యు రామసుబ్బయ్య, ఇ.శ్రీనివాసులు, ఎన్ మహబూబ్ భాషా, వై.రవి కుమార్ మొదటి రోజు కూర్చున్నారు. ఈ నిరాహారదీక్షలలో పాల్గొన్న నాయకులు వై.మస్తానయ్య, టి.మురళీ, బాలగంగిరెడ్డి, కె.నరసింహా రావు, జయరామయ్య, నాగేశ్వర్‌గౌడ్, హైదర్‌అలీ, శంకరయ్య, ఫకృద్దీన్, అహమ్మద్‌అలీ, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజు మే 31న నిరాహారదీక్షలు జరిగాయి. ఉపాధ్యా యులు కె.నరసింహారావు, కె.గంగన్న, ఎస్.శివశంకర్, జి.వెంకట సుబ్బయ్య, సూర్యకుమార్‌లు నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని తొందరగా బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని, ప్రభుత్వ మొండి వైఖరిని ఖండిస్తున్నామని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం. విజయకుమార్, ఎస్.వి.సుబ్బరాజు, ఎస్‌టియు ప్రధానకార్యదర్శి ఇలియాస్ బాషా, ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.జయరామయ్య, సురేష్‌బాబు పాల్గొన్నారు. శ్రీకాంత్, జానకిరామ్, మురళి, రామాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు ఆపాలి

ప్రభుత్వం చేస్తున్న అక్రమ బదిలీలను తక్షణమే ఆపాలని, లేకపోతే ఉపాధ్యాయుల నుండి తిరుగుబాటు తప్పదని యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.విజయకుమార్, ఎస్.వి.సుబ్బరాజులు హెచ్చరించారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమ బదిలీలను తక్షణమే

ఆపాలని డిమాండ్ చేస్తూ మే 11న స్థానిక డిఇఓ కార్యాలయం వద్ద యుటియఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా విజయకుమార్, సుబ్బరాజులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రతిభ ఆధారంగా బదిలీలు జరపాలని పట్టుబడుతున్న రాష్ట్ర ప్రభుత్వం, కొంతమంది ఉపాధ్యాయులకు దొడ్డిదారిన చేస్తున్న అక్రమ బదిలీలు ఏ ప్రతిభ ఆధారంగా చేస్తున్నదో సమాధానం చెప్పాలన్నారు. మూడేళ్ళుగా ఉపాధ్యాయ బదిలీలను ప్రహసనంగా మార్చివేసిందని వారు విమర్శించారు. బదిలీలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించటానికి సమయం లేని విద్యాశాఖ మంత్రికి, అక్రమ బదిలీలు చేయటానికి మాత్రం సమయముందని విమర్శించారు. రాజకీయ ప్రాభల్యంతో జరుగుచున్న ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను రద్దు చేయాలని, పనితీరు ఆధారంగా బదిలీలు చేసే విధానాన్ని రద్దుచేసి, కౌన్సిలింగ్ పద్ధతిలో బదిలీలు నిర్వహించేందుకు తక్షణమే షెడ్యూల్ విడుదల చేయాలని, బదిలీలకు శాశ్వత కోడ్ రూపొందించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.చంద్రశేఖర్, ట్రెజరర్ బి.హరిప్రసాద్, జిల్లా కార్యదర్శులు వై.రవికుమార్, కె.నరసింహారావు, కె.గంగన్న, సి.శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రనధానకార్యదర్శులు నిత్య ప్రభాకర్, కె.రమేష్, యుటియఫ్ నాయకులు దేవదత్తం, జి.వెంకటసుబ్బయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

### వెబ్‌కౌన్సిలింగ్ రద్దు చేయాలని యుటియఫ్ ధర్నా

ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 31 అసంబద్ధంగా వుందని కడప జిల్లా యుటియఫ్ జూన్ 2న డిఇఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించింది. ఈ ధర్నా సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా మాట్లాడుతూ ప్రభుత్వం వెబ్‌కౌన్సిలింగ్‌ను రద్దుచేసి పాత కౌన్సిలింగ్ విధానం ద్వారానే బదిలీలు జరుపుతామని ఉపాధ్యాయ సంఘాలకు, ఎమ్మెల్సీలకు హామీనిచ్చి జిఓలో వెబ్‌కౌన్సిలింగ్ ద్వారానే బదిలీలు చేపడతామని పేర్కొనడం దారుణమన్నారు. ఫర్‌ఫార్మెన్స్ పాయింట్లు గతంలో 25వుంటే సంఘాలు, ఎమ్మెల్సీలు వాటిని రద్దు చేయమని కోరితే జిఓలో (31) వాటిని 50కి పెంచి నియంతృత్వ ధోరణిని ప్రదర్శించారని విమర్శించారు.

జిల్లా అధ్యక్షులు ఎం.విజయకుమార్ మాట్లాడుతూ రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి పేద, బడుగు, బలహీన వర్గాల వారికి విద్యను దూరం చేయడమేనన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సుబ్బరాజు మాట్లాడుతూ కౌన్సిలింగ్‌ను పాతపద్ధతిలోనే కొనసాగించాలన్నారు. లేకపోతే 5వ తేదీన అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి ఫ్యాప్టో-జాక్టో ఆధ్వర్యంలో విజయవాడలో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామన్నారు.

ధర్నాలో జిల్లా గౌరవాధ్యక్షులు పి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు కె.నరసింహారావు, ఎస్.రామాంజనేయులు, వై.మస్తానయ్య, నాయకులు వై.రవికుమార్, జి.వెంకటసుబ్బయ్య, సూర్యకుమార్, సుబ్బారెడ్డి, విజయకుమార్, ఓబయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

### కర్నూలు జిల్లా

### ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను రద్దు చేయాలి




**ఎమ్మిగనూర్ :** ప్రభుత్వం చేస్తున్న ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను రద్దు చేసి కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించాలని మే 8న ఫ్యాప్టో నాయకులు జె.యల్లప్ప, అడివన్న, ఈశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీవర్స్ కాలనీనందు జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమం విరామ సమయంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో మే 8న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లప్ప మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగా బదిలీలు జరపాలని పట్టుబడుతున్న ప్రభుత్వం ఏ ప్రతిభ ఆధారంగా అక్రమ బదిలీలు చేస్తుందని ప్రశ్నించారు.

ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని తొలగిస్తూ ఆయా శాఖల్లో పారదర్శకంగా బదిలీలు జరపాలని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. బదిలీల్లో అవినీతి, పైరవీలకు తావులేదని సిఎం ప్రకటించగా అందుకు విరుద్ధంగా విద్యాశాఖ పైరవీలను రాజకీయ పలుకుబడులకు తలొగ్గి బదిలీలు చేస్తోందని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. విద్యాశాఖ వైఖరి మార్చుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగమణి, రంగన్న, దావీదు, రంగస్వామి, హనుమంతు, మంజుల, నాగేశ్వరరావు, వీరభధ్ర, ఎంఎస్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

### టీచర్ల అక్రమ బదిలీలు ఆపి, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి - ఎమ్మెల్సీల దీక్షలకు మద్దతుగా యుటియఫ్ దీక్షలు

రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల మూసివేతను మానుకొని, ఉపాధ్యాయ అక్రమ బదిలీలను ఆపి, వెంటనే బదిలీల షెడ్యూల్ ప్రకటిం చాలని విజయవాడలో దీక్షలు చేస్తున్న శాసనమండలి సభ్యులకు మద్దతుగా యుటియఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మే30న నిరాహారదీక్షలు జరిగాయి.

కృష్ణదేవరాయ విగ్రహం దగ్గర జరిగిన దీక్షలను యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌కుమార్ అధ్యక్షత వహించి ప్రారంభించారు. వెంటనే బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని ఆయన కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి డి.రామశేషయ్య మాట్లాడుతూ అక్రమ బదిలీలు ఆపాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తున్నందున పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు మద్దతుగా దీక్షలు చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి కమీషనరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

దీక్షలో యుటియఫ్ జిల్లా నాయకులు ఎ.టి.తిమ్మన్న, జె.ఎల్లప్ప, ఎం.జనార్ధనరావు, బివై సుబ్బరాయుడు, సిహెచ్.చిన్నవీరారెడ్డి, బి.

రాఘవేంద్ర, ఎన్.సి.హెచ్.మద్దిలేటి మరియు నరసింహుడు, జె. సుధాకర్, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకులు ఎం.రమేష్, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు ఎస్ఎండి షఫీ, జిల్లా నాయకులు మల్లేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా నాయకులు జె.సుధాకర్, ఓఎస్ఎం జయరాజు, యుఆర్ఏ రవికుమార్, ఏఎండి రఫిక్, మాదన్న, వేణుగోపాల్, హేమంత్‌కుమార్, మద్దిలేటి, ఎల్లయ్య, నాగమణి, ఆంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా**

**అవినీతిని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం**

ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయకుండా కౌన్సిలింగ్ విధానాన్ని తూట్లు పొడుస్తూ రాజకీయ, ధనబలం కలిగిన కొంతమంది ఉపాధ్యాయులకు మాత్రమే దొడ్డిదారిన అక్రమంగా సెక్రటేరియేట్‌నందు బదిలీలు చేస్తూ ప్రభుత్వమే అవినీతిని ప్రోత్సహిస్తున్నది. ఈ అక్రమ బదిలీలలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయని, వీటిని తక్షణం రద్దుచేయాలని మాజీ ఎమ్మెల్సీ డా॥ ఎం.గేయానంద్ డిమాండ్ చేశారు.

రాష్ట్ర రాజధానిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, రాము సూర్యారావు, బొడ్డు నాగేశ్వరరావు, శ్రీనివాసులురెడ్డి, కె.నరసింహారెడ్డి అక్రమ బదిలీలను నిరసిస్తూ రాష్ట్ర రాజధానిలో నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది. ఆ దీక్షలకు మద్దతుగా యుటియఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా డిఇఓ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు పూర్వ అధ్యక్షులు ఇమాంసాహెబ్ ప్రారంభించారు. ఈ నిరాహారదీక్ష శిబిరానికి జిల్లా ప్రధానకార్యదర్శి రమణయ్య అధ్యక్షత వహించారు.




ఈ సందర్భంగా నిరాహారదీక్షలకు మద్ధతు సంఘీభావం తెలియజేస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలతోపాటు ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికి వదిలేసిందని, కార్పొరేట్‌కు దాసోహమై అన్ని రంగాలను ప్రైవేటీకరిస్తున్నదని అందులో భాగంగానే రేషనలైజేషన్ పేరుతో వేలాది పాఠశాలలు మూతవేయడానికి ప్రభుత్వం సిద్ధమైనదని, దీన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులతోపాటు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేయాల్సిన అవసరం వున్నదని కమ్యూనిస్ట్ పార్టీలు అన్ని కలిసి పాఠశాల మూసివేతకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటానికి సిద్ధమవుతాయని ఈ పోరాటంలో ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.

యుటియఫ్ చేస్తున్న పోరాటానికి ఎస్‌టియు, ఏపిటిఎఫ్ (1938), పిఎస్‌హెచ్ఎం, ఎన్‌టిఏ, డివైఎఫ్ఐ, పిఇటి, ఎస్ఎఫ్ఐ నిరుద్యోగ పోరాట సమితి మొ॥ ఉపాధ్యాయ ప్రజాసంఘాలు మద్ధతు తెలిపాయి. నిరాహారదీక్షకు కూర్చున్నవారు రాష్ట్రకార్యదర్శి మహమ్మద్‌జిలాన్, గౌరవాధ్యక్షులు సికె నాగేంద్రబాబు, అధ్యక్షులు ఎం.సుధాకర్, కోశాధికారి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి రామప్పచౌదరి, బికెఎస్ కార్యదర్శి మహబూబ్‌ఖాన్, పామిడి ప్రధానకార్యదర్శి కొండప్ప, విడపనకల్ ప్రధానకార్యదర్శి జయరాములు, విడపనకల్ కార్యదర్శి నాగరాజు, ఉరవకొండ కోశాధికారి లక్ష్మినారాయణ ఈ నిరాహార దీక్ష శిబిరానికి దాదాపుగా 100మంది యుటియఫ్ కార్యకర్తలు, నాయకులు, విద్యార్ధి సంఘాలు యువజన సంఘాలు పాల్గొన్నాయి. ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్ లెక్చరర్ ప్రగతి పాల్గొని ప్రసంగించారు.

**పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం కుట్ర**

రెండవరోజు మే 31న చేపట్టిన రిలే నిరాహారదీక్షను ప్రారంభిస్తూ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దన్నగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడానికి ప్రభుత్వమే కుట్ర పన్నుతున్నదని తద్వార పేద బడుగు, బలహీనవర్గాల పిల్లలకు చదువు అందని వస్తువుగా మారుతుందని రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల మూసివేతను ఉపసంహరించుకోవాలని తెలియజేశారు.

దీక్షా శిబిరానికి యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సుధాకర్ మరియు జిల్లా గౌరవాధ్యక్షులు సికె నాగేంద్రబాబు అధ్యక్షత వహించారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్ ప్రసంగిస్తూ ఉపాధ్యాయ బదిలీలను ఆధారిత పాయింట్లు మేరకే చేస్తానని చెప్పి ఏ ప్రతిభ ఆధారిత పాయింట్లతో బదిలీలను చేశారని ప్రశ్నించారు. తక్షణం బదిలీల షెడ్యూలును విడుదలచేసి అక్రమ బదిలీలను రద్దు చేయాలని లేని పక్షాన ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రెండవరోజు దీక్షా శిబిరానికి మద్ధతు, సంఘీభావం తెలియజేస్తూ జెఏసి అధ్యక్షులు నరసయ్య ప్రసంగిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల స్నేహశీల ప్రభుత్వం అంటూనే సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని యుటియఫ్ న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ బసవరాజు యుటియఫ్ పోరాటానికి జెఏసి ప్రధానకార్యదర్శి ప్రభాకర్, జెఏసి కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌యుపిపి తులసిరెడ్డి, ఎన్‌టిఏ హరికృష్ణ, పిఎస్‌హెచ్ఎం గోవిందరెడ్డి, ఏపిటిఎఫ్ నాగరాజు, పిఆర్‌టియు శ్రీధర్‌రెడ్డి, వైయస్ఆర్‌టిఎఫ్ ఓబుళపత్తి, ఏపిపిటిఏ చంద్రశేఖర్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మనోహరరెడ్డి, బిసి ఉద్యోగుల సంఘం శ్రీధర్, హెచ్‌యు అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశులు, భాస్కర్, బిఇడి అసోసియేషన్ నారాయణస్వామి, ఎస్‌టియు సూర్యుడు తదితర సంఘాల నాయకులు ప్రసంగించారు.

జిల్లా ప్రధానకార్యదర్శి రమణయ్య, శేషప్ప, మహబూబ్‌ఖాన్, బసవరాజు, అనిల్‌కుమార్, అహోబిలేసు, శేఖర్, మైలారులింగ, వేణుగోపాల్, చంద్రమోహన్, శ్రీరాములు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో మద్ధతుగా యుటియఫ్ కార్యకర్తలు, నాయకులు, ఉపాధ్యాయులు వందమందికిపైగా పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉత్తర్వులు

1. ఆర్ఎంఎస్ఏ శిక్షణా తరగతులలో బయోమెట్రిక్ హాజరుకు సంబంధించిన సూచనల ఉత్తర్వు
   **పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.137/IT Cell/2017; తేది.02.05.2017**
2. డిపార్టుమెంట్ పరీక్షల నిబంధనలు 1965లో రూల్-17 మరియు అనెగ్జర్-111లో రూలు 20కు సవరణ ఉత్తర్వు
   **జిఓ ఎంఎస్ నం.55; తేది.02.05.2017**
3. 2017-18 బడ్జెట్‌లో నాన్‌ప్లాన్ స్కీమ్ క్రింద 25% నిధులు కేటాయింపు ఉత్తర్వు
   **పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వు ఆర్‌సి నం.100/ఏ111/2017-18; తేది.02.05.2017**
4. ఎస్ఎస్‌సి అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు మే / జూన్ 2017 నిర్వహణకై వేసవిలో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, సిబ్బందికి సంపాదిత సెలవు మంజూరు ఉత్తర్వు
   **పాఠశాల విద్యా కమీషనర్ ఉత్తర్వు ఆర్‌సి నం.223/ఏ&1/2016; తేది.04.05.2017**
5. డిఎస్‌సి 1998 క్వాలిఫయింగ్ అభ్యర్థుల వివరాలు కోరుట గురించి ఉత్తర్వు
   **పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఉత్తర్వు ఆర్‌సి నం.990/టిఆర్‌సి-2/2015; తేది.04.05.2017**
6. కరువు పీడిత ప్రాంత విద్యార్థులకు 2017 వేసవి సెలవులలో రేషను దుకాణాలద్వారా రేషను సరఫరాకు సూచనల ఉత్తర్వు
   **పాఠశాల విద్యా కమీషనర్ ఆర్‌సి నం.01/MDM/2017; తేది.05.05.2017**
7. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 5 రోజుల వృత్యంతర శిక్షణ ఉత్తర్వు
   **సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి ఉత్తర్వు ఆర్‌సి నం.49/A3/SSA/SIEMT/2016; తేది.08.05.2017**
8. కరువు పీడిత ప్రాంత విద్యార్థులకు 2017 వేసవి సెలవులలో రేషను దుకాణాల ద్వారా రేషను సరఫరాకు మరికొన్ని సూచనల ఉత్తర్వు
   **పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఉత్తర్వు ఆర్‌సి నం.01/MDM/2017; తేది.08.05.2017**
9. మోడల్ పాఠశాలల జీతాలు మరియు ఇతర ఖర్చులకై రూ.41,22,05,000/-లు మంజూరు
   **జిఓ ఆర్‌టి నం.81; తేది.15.05.2017**
10. ప్రావిడెంట్ ఫండ్ వడ్డీరేటు 7.9%
    **జిఓ ఆర్‌టి నం.1171; తేది.17.05.2017**
11. మున్సిపల్ పాఠశాలల్లో బాషా పండితులు మరియు పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్ ఉత్తర్వులకు సవరణ ఉత్తర్వు
    **జిఓ ఎంఎస్ నం.82; తేది.16.05.2017**
12. స్కూల్ అసిస్టెంట్స్‌కు ఆర్ఎంఎస్ఏ వృత్యంతర శిక్షణా తరగతుల ఉత్తర్వు
    **ప్రాజెక్టు డైరెక్టర్, ఆర్ఎంఎస్ఏ ఉత్తర్వు ఆర్‌సి నం.778/ఆర్ఎంఎస్ఏ/ఏపిఎంఎస్/2016; తేది.19.05.2017**
13. అర్ధజీతపు సెలవు మంజూరు కొరకు రిటైర్డు ఉపాధ్యాయుల వివరాలు కోరుట గురించి
    **పాఠశాల విద్యా కమీషనర్ ఆర్‌సి నం.118/పెన్షన్-1/ 2012; తేది.22.05.2017**
14. మున్సిపల్ పాఠశాలలు, పోస్టులు, సిబ్బంది రేషనలైజేషన్ నిబంధనల ఉత్తర్వు
    **జిఓ ఎంఎస్ నం.210; తేది.23.05.2017**
15. రంజాన్ పండుగ సందర్భంగా ఉర్దు మీడియం పాఠశాలల పని వేళలు మార్పు గురించి ఉత్తర్వు
    **పాఠశాల విద్యా కమీషనర్ ఆర్‌సి నం.30/యుసి/2017; తేది.24.05.2017**
16. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఉద్యోగి మరణించిన సందర్భంలో ప్రస్తుత తెలంగాణా ప్రాంతంలో నివసిస్తున్న వారసుని స్థానిక అభ్యర్థిగా పరిగణించి ఉద్యోగ అవకాశం కల్పించు ఉత్తర్వు
    **యుఓ నోట్ నం.873/సర్వీస్.ఏ/2016; తేది.25.05.2017**
17. 2017-18 సం॥నికి మధ్యాహ్న భోజన పథకానికి రూ.141, 16,64000/-లు మంజూరు ఉత్తర్వు
    **జిఓ ఆర్‌టి నం.91; తేది.29.05.2017**
18. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, పోస్టులు, సిబ్బంది రేషనలైజేషన్ ఉత్తర్వు
    **జిఓ ఎంఎస్ నం.29; తేది.22.05.2017**
19. కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్సు రెమ్యునరేషన్ పెంపుదల ఉత్తర్వు
    **జిఓ ఎంఎస్ నం.38; తేది.29.05.2017**
20. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, పాఠశాలలు, పోస్టులు, సిబ్బంది రేషనలైజేషన్ మార్గదర్శకాలు
    **పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఉత్తర్వు ఆర్‌సి నం.4102/2015; తేది.30.05.2017.**
21. ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వు
    **జిఓ ఎంఎస్ నం.31; తేది.31.05.2017**
22. ఆర్ఎంఎస్ఏ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా సూచనల ఉత్తర్వు
    **పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఆర్‌సి నం.778/ఏపిఎంఎస్/ఆర్ఎంఎస్ఏ/2016; తేది.31.05.2017.**

22\. ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వు
    **జిఓ ఎంఎస్ నం.32; తేది.04.06.2017**

23\. ప్రభుత్వ., జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, పోస్టుల సిబ్బంది రేషనలైజేషన్ ఉత్తర్వుకు సవరణ ఉత్తర్వు
    **జిఓ ఎంఎస్ నం.33; తేది.04.06.2017**

## పాఠకులకు గమనిక

తెలుగు మాస పత్రికలలో ఇంగ్లీషులో ప్రభుత్వ ఉత్తర్వులు, ఇంగ్లీషులో వ్యాసాలు వంటివి ప్రచురించరాదని పోస్టల్ శాఖ వారు అభ్యంతరం తెలిపారు. అందువలన ప్రభుత్వ ఉత్తర్వుల నంబరు, వివరాలు మాత్రమే ప్రచురించడం జరుగుతున్నది. ప్రభుత్వ ఉత్తర్వులు యధావిధిగా ప్రచురించడా నికి పోస్టల్ డిపార్టు మెంట్ వారికి, రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ వారికి ప్రతి పాదనలు పంపడం జరిగింది. పోస్టల్ పర్మిషన్ కొరకు కృషి చేయడం జరుగుతున్నది. అసౌకర్యానికి చింతిస్తున్నాం. – సంపాదకవర్గం